www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గర్భిణులకు రూ.21 వేలు

ఆరు పోషకాహార కిట్లు కూడా.. 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్

రూ.500కే సిలిండర్, ఏడాదికి 2 సిలిండర్లు ఉచితం

మహిళలకు నెలకు రూ.2,500

ఢిల్లీ ఓటర్లపై బీజేపీ హామీల వర్షం

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ ఓటర్లను ఆకట్టుకోవడానికి బీజేపీ హామీల వర్షం కురిపించింది. దీనిపై ఆప్ అధినేత కేజ్రీవాల్ విమర్శలు ఎక్కుపెట్టారు. ప్రధాని మోదీ ఉచితాలు మంచివేనని అంగీకరించాలంటూ డిమాండ్ చేశారు. తామూ తగ్గబోమంటూ విద్యార్థులకు మెట్రోలో 50 శాతం రాయితీని ప్రకటించారు. 2

శనివారం | 18-1-2025 | పేజీలు: 10 + 8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 273 |

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం, తిథి: పంచమి పూర్తి; నక్షత్రం: పుబ్బ మ. 2.51 తదుపరి ఉత్తర; వర్జ్యం: రా. 10.50-12.37; దుర్ముహూర్తం: ఉ. 6.52-8.21; అమృతఘడియలు: ఉ. 7.53-9.37; రాహుకాలం: ఉ. 9.30-10.30; సూర్యోదయం:6.52; సూర్యాస్తమయం: 5.58

విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



PREMIUM 3 & 4 BHK HOMES STARTING AT ₹2.75 CR*

The stars will have company tonight,
witness the grand unveil at HITEC City at 8pm.

9513443803

Godrej | PROPERTIES

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శనివారం | 18-1-2025

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

క్రీడా రత్నాలకు పురస్కారాలు


శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో జాతీయ క్రీడా అవార్డుల వేడుక కన్నుల పండువగా జరిగింది. క్రీడారంగంలో విశేష ప్రతిభ కనబర్చిన ఆటగాళ్లను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఘనంగా సత్కరించారు. అర్జున పురస్కారానికి ఎంపికైన విశాఖపట్నం అథ్లెట్ జ్యోతి యర్రాజి.. శిక్షణ నిమిత్తం దక్షిణాఫ్రికాలో ఉండడంతో ఈ వేడుకకు హాజరుకాలేకపోయింది. ఈ వేడుకలో నలుగురికి మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న, 31 మందికి అర్జున, ఐదుగురికి ద్రోణాచార్య అవార్డులను రాష్ట్రపతి అందజేశారు. ...స్పోర్ట్స్‌లో


రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా అర్జున అవార్డు అందుకుంటున్న తెలుగు పారా అథ్లెట్ దీప్తి జివాంజి

జగన్ మాటలు బాబు చేతలు!



విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు



సమర్థ నాయకత్వంతో రాష్ట్రానికి ఫలాలు

నాడు.. స్వప్రయోజనాల కోసమే ఢిల్లీకి
- పోలవరం పరిహారంపై చేతులెత్తేసి కేంద్రమే దయతలచాలంటూ దీనత్వం
- ఉక్కుపై శూన్య స్పందన.. అమరావతిపై 'భారమైన' కబుర్లు.. జోన్‌కు రెడ్ సిగ్నల్

నేడు.. రాష్ట్ర ప్రయోజనాలే కీలకం
- ఒకేరోజు పోలవరం నిర్వాసితులకు 988 కోట్లు
- విశాఖ ఉక్కుకు ఊపిరి పోస్తూ భారీ ప్యాకేజీ
- రైల్వే జోన్‌కు భూములు, ప్రధాని శంకుస్థాపన
- అమరావతికి ఆర్థిక సంస్థల రుణాలు, నిధులు



"మీరంతా అనుకున్నంత వేగంగా చేయలేకపోయిన పని ఒకటుంది! అది... పరిహారం ఇప్పించడం! అది నా చేతుల్లో ఉండే పని కాదు. కాబట్టి నేను కూడా కష్టపడాల్సి వస్తోంది. ఈ విషయంలో ఢిల్లీ మీద ఆధారపడాల్సి వస్తోంది. వాళ్ల మీద ఎక్కువ ఒత్తిడి తీసుకువచ్చే కార్యక్రమం చేతనైనకాడికి చేస్తూనే ఉన్నాను! అడుగులు ముందుకు వేస్తూనే ఉన్నాను."

2023 ఆగస్టు 7వ తేదీన అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ పోలవరం నిర్వాసితులతో పలికిన దీన, దయనీయమైన పలుకులు ఇవి! ఆయన ఇలాంటి మాటలు అనేకం చెప్పారు. కానీ... నిర్వాసితులకు పైసా దక్కలేదు.

అక్కడ సీన్ కట్ చేస్తే...

ఈ నెల 3వ తేదీన, ఒకే రోజున పోలవరం నిర్వాసితులకు రూ.988 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం జమ చేసింది. టింగ్‌మని ఫోన్‌లో మెసేజ్ రావడం... డబ్బులు జమ అయినట్లు తెలుసుకుని నిర్వాసితులు ఆనందంతో పొంగిపోవడం! అంతా... 'సైలెంట్'గా జరిగిపోయింది! వైఎస్ జగన్ సర్కారు అసమర్థ నిర్వాకాలు... నేటి చంద్రబాబు సర్కారు సాధిస్తున్న ఫలితాలను చెప్పేందుకు మచ్చుకు ఇదొక చిన్న ఉదాహరణ! అమరావతి నుంచి విశాఖ రైల్వేజోన్ దాకా... చెప్పుకొంటూ పోతే ఇలాంటివి ఎన్నో! ఐదేళ్ల అనేక పర్యాయాలు ఢిల్లీ యాత్రలు చేసి... జగన్ సాధించిందేమిటో

మిగతా 7వ పేజీలో...

నం. 1గా విశాఖ ఉక్కు

సవాల్‌గా తీసుకుని సాధిస్తాం

ప్రైవేటీకరణ ప్రసక్తే లేదు
- బాబు ప్రయత్నాలతోనే పునరుద్ధరణ
- అర్ధరాత్రి 2వరకు నిర్మలా సీతారామన్‌తో నేను, చంద్రబాబు చర్చించేవాళ్లం
- ఆగస్టులో మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌లో ఉత్పత్తి
- 93 శాతం సామర్థ్యాన్ని అందుకుంటాం
- ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి వెల్లడి
- ప్లాంటు కష్టాలు తీరినట్టే : అశ్వినీ వైష్ణవ్

కూటమి 'ఉక్కు' పట్టు

లాభాల్లోకి తేవడానికే 11,440 కోట్ల సాయం

న్యూఢిల్లీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీలు ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా పరిరక్షించేందుకు సకల చర్యలు తీసుకుంటామని, దాన్ని లాభాల బాటలోకి మళ్లిస్తామని ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి ప్రకటించారు. ఇందులో భాగంగానే, కేంద్ర కేబినెట్ రూ. 11, 440 కోట్ల భారీ సాయం ప్రకటించిందని తెలిపారు. విశాఖ ఉక్కు ప్లాంట్ పునరుద్ధరణకు ఈ నిధులను వినియోగిస్తామని కుమారస్వామి

మిగతా 6వ పేజీలో...



- ఏపీ ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం: మోదీ
- అసాధ్యాన్ని సుసాధ్యం చేశాం: చంద్రబాబు
- వేలాది కుటుంబాలకు కొత్త ఆశ: పవన్


సీఎం చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన మంత్రి వర్గం

పేదలకు స్థలాల సంబరం

పల్లెల్లో 3 సెంట్లు.. పట్టణాల్లో 2 సెంట్లు

రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు
- ఫ్రీహోల్డ్ భూములు ఎవరి చేతుల్లోకి వెళ్లాయి?
- మంత్రులతో పరిశీలనకు నిర్ణయం
- లావాదేవీలు మరికొంతకాలం స్తంభన
- నిషేధ జాబితా నుంచి వివాదం లేనివి తొలగింపు
- 2019 కటాఫ్‌గా ఆక్రమిత ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ
- ధాన్యం సేకరణకు 700కోట్ల రుణానికి అనుమతి
- మూడు కేటగిరీలుగా గ్రామ, వార్డు సచివాలయాలు
- తోటపల్లి బ్యారేజీపై రెండు మినీ హైడల్ ప్రాజెక్టులు
- వివరాలు వెల్లడించిన మంత్రి కొలుసు పార్థసారథి

అమరావతి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు ఉచితంగా ఇళ్ల స్థలాలు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇవ్వాలని తీర్మానించింది. ఉచిత ఇళ్ల స్థలాల పంపిణీ పర్యవేక్షణకోసం రాష్ట్ర స్థాయిలో రెవెన్యూ మంత్రి అధ్యక్షతన, జిల్లా స్థాయిలో ఇన్‌చార్జి మంత్రి నేతృత్వంలో కమిటీలు ఏర్పాటుచేయాలని నిశ్చయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో శుక్రవారం జరిగిన

మిగతా 7వ పేజీలో...

మీలో వేగమేదీ?! 7

- యువ మంత్రుల పనితీరుపై బాబు అసంతృప్తి
- ప్రజల్లోకి మరింతగా వెళ్లి పనిచేయాలని ఆదేశం
- మంత్రులు, ఎంపీలు, జోనల్ ఇన్‌చార్జులతో సమీక్ష
- కొందరు పార్లమెంటు సభ్యుల గైర్హాజరుపై ఆగ్రహం
- ప్రజాదరణ ఇప్పటికంటే 5 శాతం పెంచేలా లక్ష్యం


మంత్రులు లోకేశ్, భరత్ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న దృశ్యం

ఓర్వకల్లుకు భారీ వరం!

- దేశంలోనే తొలి 'ఈవీ పార్కు'
- పీపుల్‌టెక్‌తో సర్కారు ఒప్పందం
- 1800 కోట్ల పెట్టుబడి.. 25 వేల మందికి ఉపాధి
- ఎలక్ట్రానిక్ వాహనాల తయారీ కేంద్రం
- పరిశోధన కేంద్రాలు, టెస్టింగ్ ట్రాక్‌లు, ఇతర సదుపాయాలు
- ఆస్పత్రులు, విద్యాసంస్థలు, గృహ సముదాయాలు 5



31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు!

- తొలి విడత ఫిబ్రవరి 13 వరకు 2
- 1న బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నిర్మల

హెచ్-1బీ కొత్త నిబంధనలు
అమల్లోకి.. 2

భారత టెకీలకు మరింత మేలు

హైదరాబాద్ యువకుడు సాయి వర్షిత్‌కు 8 ఏళ్ల జైలు

వైట్‌హౌస్‌పై దాడి యత్నం కేసు తీర్పు చెప్పిన అమెరికా కోర్టు

ఇమ్రాన్‌కు 14 ఏళ్ల జైలు

- పాకిస్థాన్ మాజీ ప్రధానికి శిక్ష
- ఆయన సతీమణికి ఏడేళ్ల జైలు
- అవినీతి కేసులో కోర్టు తీర్పు 2

బిగుస్తున్న ఉచ్చు

ఐపీఎస్ సునీల్‌పై విచారణకు ఆదేశం

అగ్రిగోల్డ్ నకిలీ డిపాజిటర్ల పేరుతో రూ.7.20 లక్షలు స్వాహా

సాంకేతికత అభివృద్ధి మాటున రూ.75 లక్షలు నొక్కేశారు

- బిల్లు అడిగిన కాంట్రాక్టర్‌పై కేసు పెడతామని బెదిరించారు
- అక్రమ సంపాదనతో వ్యాపారాలు, తరచూ దుబాయ్‌కి
- సీఐడీ మాజీ ఏడీజీ అక్రమాలపై ఏసీబీకి రఘురామ ఫిర్యాదు
- ఆరోపణలన్నింటిపై విచారణ
- విచారణ అధికారులుగా సిసోడియా, హరీశ్ గుప్తా



అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో పలు అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలున్న సీఐడీ మాజీ ఏడీజీ పీవీ సునీల్ కుమార్‌కు ఉచ్చు బిగుస్తోంది. నకిలీ డిపాజిటర్లను సృష్టించి అగ్రిగోల్డ్ బాధితులకు చెల్లించాల్సిన సొమ్ము రూ.లక్షలు స్వాహా చేశారని,

మిగతా 6వ పేజీలో...

ట్రైబ్యునల్-2పై స్టే కోరదాం

- 23న సుప్రీం కోర్టులో ఆ మేరకు విన్నవిద్దాం
- కేంద్ర గెజిట్‌ను తొలి నుంచీ వ్యతిరేకిస్తున్నాం
- విభజన చట్టంలోని సెక్షన్ 89 రక్షణ కవచం
- సెక్షన్-3పైన బలమైన వాదనలు వినిపిద్దాం
- కృష్ణా జలాలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం

నాడు జగన్ మొద్దు నిద్ర
- పునఃసమీక్ష కోరని వైనం
- నేడు కూటమి సర్కారుదే తప్పంటూ రోత రాతలు
- ఏవగించుకుంటున్న నిపుణులు



అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కృష్ణానది జలాల పంపకాలపై పునఃసమీక్ష చేపట్టాలని కోరుతూ బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్-2 గడువు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేయడాన్ని రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ఈ నెల 23న సుప్రీంకోర్టులో జరిగే విచారణలో సదరు ఆదేశాలపై 'స్టే' కోరాలని సర్కారు నిర్ణయించింది. 2023లో కేంద్రం ఇచ్చిన ఆదేశాలపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై ఈ నెల 23న సుప్రీం కోర్టులో విచారణ

మిగతా 5వ పేజీలో...

కర్ణాటకలో భారీ బ్యాంకు దోపిడీ

- ఆయుధాలతో ఖాతాదార్లకూ బెదిరింపులు
- తుపాకీ గురిపెట్టి రూ.10 కోట్లు పైగా చోరీ
- లాకర్లలో నగదు, ఆభరణాల అపహరణ
- అంతా పది నిమిషాల వ్యవధిలోనే..
- బీదర్ ఘటన జరిగిన మరుసటి రోజే..
- పోలీసులపై సీఎం సిద్దరామయ్య ఆగ్రహం

ఆ దొంగలు ఎక్కడ?
- హైదరాబాద్ కాల్పుల ఘటనలో నిందితుల వేటకు 10 బృందాలు
- బిహారీ అమిత్ గ్యాంగ్ పనే!
- బస్సులో అతడి పేరిటే టికెట్
- కాల్పుల తర్వాత సికింద్రాబాద్‌కు

5

మోసపూరిత కాల్స్, ఎస్ఎంఎస్‌లకు చెక్!

» 'సంచార్ సాథీ' మొబైల్ యాప్ తెచ్చిన డాట్

న్యూఢిల్లీ, జనవరి 17: దేశంలో 90 కోట్ల మందికి పైగా స్మార్ట్‌ఫోన్ వినియోగదారులున్నారు. వీరిలో ఎందరో మోసపూరిత కాల్స్, ఎస్ఎంఎస్‌ల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు టెలికాం విభాగం (డాట్) చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా అనుమానిత కాల్స్, ఎస్ఎంఎస్‌లను మరింత సులభతరంగా రిపోర్ట్ చేయడానికి వీలుగా డాట్ 'సంచార్ సాథీ' పేరుతో మొబైల్ అప్లికేషన్‌ను తెచ్చింది. దీన్ని శుక్రవారం కేంద్ర టెలికాం శాఖ మంత్రి జ్యోతిరాధిత్య సింధియా విడుదల చేశారు. దీంతో వినియోగదారులు అనుమానిత కాల్స్, ఎస్ఎంఎస్‌లను తమ మొబైల్ ఫోన్ కాల్ లాగ్స్ నుంచి నేరుగా రిపోర్ట్ చేయడానికి అవకాశం ఉంటుంది. ఈ కొత్త యాప్ ఆండ్రాయిడ్, ఐఓఎస్ మొబైల్ ఫోన్లకు అందుబాటులో ఉంది. ఈ యాప్ ద్వారా వినియోగదారులు తమ పేరు మీద జారీ అయిన అన్ని మొబైల్ కనెక్షన్ల గురించి కూడా తెలుసుకోవచ్చు. దీని వల్ల తమ పేరుపై ఉన్న అనధికార కనెక్షన్ల వినియోగం జరగకుండా చూసుకోవచ్చు. అలాగే పోగొట్టుకున్న లేదా దొంగతనానికి గురైన మొబైల్ ఫోన్ల బ్లాకింగ్ సదుపాయం కూడా కల్పించారు. అంతేకాకుండా మొబైల్ ఫోన్ల ప్రామాణికతను సైతం తెలుసుకునే ఫీచర్ కూడా ఉంది. దీని వల్ల వినియోగదారులు అసలైన డివైజ్‌లను కొనుగోలు చేసే అవకాశం ఏర్పడుతుంది. మోసపూరిత కాల్స్‌ను కట్టడి చేసేందుకు 2023లో డాట్ 'సంచార్ సాథీ' పోర్టల్‌ను ప్రారంభించింది. కొత్తగా తెచ్చిన యాప్ ద్వారా వీటికి మరింత సమర్థంగా చెక్ పెట్టే అవకాశం ఏర్పడనుంది. సంచార్ సాథీ మొబైల్ యాప్‌తో పాటు జాతీయ బ్రాడ్‌బ్యాండ్ మిషన్ 2.0 విజన్, 'డిజిటల్ భారత్ నిధి'తో ఏర్పాటు చేసిన 4జీ మొబైల్ సైట్ల వద్ద ఇంట్రా సర్కిల్ రోమింగ్‌లను కేంద్ర మంత్రి జ్యోతిరాధిత్య సింధియా ప్రారంభించారు.

వివేకా హత్య కేసులో అవినాష్ రెడ్డి కోర్టుకు హాజరు

» తదుపరి విచారణ 30కి వాయిదా

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో భాగంగా కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి శుక్రవారం నాంపల్లి సీబీఐ కోర్టుకు వచ్చారు. ఆయనతో పాటు తండ్రి భాస్కర్ రెడ్డి సహా అభియోగాలు ఎదుర్కొంటున్న నిందితులందరూ విచారణకు హాజరయ్యారు. తమపై మోపిన అభియోగాలను నిందితులంతా తిరస్కరించడంతో తదుపరి విచారణను కోర్టు ఈ నెల 30కి వాయిదా వేసింది. మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి సోదరుడైన వైఎస్ వివేకానందరెడ్డిని 2019లో కొందరు హత్య చేశారు. అతడి కుమార్తె సునీతారెడ్డి ఫిర్యాదు మేరకు ఈ కేసును సీబీఐ విచారణ జరుపుతోంది.

లోకం తీరు



31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు!

న్యూఢిల్లీ, జనవరి 17: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తేదీలు ఖరారయ్యాయి. ఈసారి కూడా రెండు విడతల్లో ఈ సమావేశాలు జరగనున్నాయి. మొదటి విడత సమావేశాలు ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు కొనసాగనున్నాయి. రెండో విడత సమావేశాలను దాదాపు నెల రోజుల విరామం తరువాత మార్చి 10 నుంచి ఏప్రిల్ 4 వరకు నిర్వహించనున్నారు. కాగా, మొదటి విడత సమావేశాల తొలిరోజు ఈ నెల 31న లోక్‌సభ, రాజ్యసభ ఉమ్మడి సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగిస్తారు. అనంతరం మరుసటి రోజు ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. 2025-26కు సంబంధించి కేంద్ర వార్షిక బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెడతారు. బడ్జెట్‌ను నిర్మల ప్రవేశపెట్టడం వరుసగా ఇది 8వసారి కావడం గమనార్హం. ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో ఎన్డీయే సర్కారు మూడోసారి అధికారంలోకి వచ్చాక ప్రవేశపెడుతున్న పూర్తి స్థాయి బడ్జెట్ ఇదే.

అమల్లోకి హెచ్-1బీ వీసా కొత్త నిబంధనలు..

న్యూఢిల్లీ, జనవరి 17: అమెరికాలో హెచ్-1బీ వీసా ప్రోగ్రామ్‌కు సంబంధించి కొత్త నిబంధనలు అమలులోకి వచ్చాయి. ఇకపై ఎఫ్-1 వీసాలపై ఉన్న విద్యార్థులు హెచ్-1బీకి మారే ప్రక్రియ సరళతరం కానుంది. వీసా పొడిగింపు దరఖాస్తుల ప్రాసెసింగ్ ప్రక్రియ వేగవంతం కానుంది. దరఖాస్తుదారులు కొత్తగా ప్రవేశపెట్టిన ఐ-129 ఫాంను ఉపయోగించడం తప్పనిసరి చేశారు. కంపెనీలు తమ అవసరాలకు తగినట్లు నియామకాలు చేసుకొని పోటీ మార్కెట్‌లో నిలదొక్కుకొనే అవకాశం కల్పించారు. లాటరీ విధానంలో బల్క్‌గా దరఖాస్తులు సమర్పించే కంపెనీలపై కఠిన నిబంధనలు విధిస్తారు. యూనివర్సిటీలు, పరిశోధన సంస్థలు ఇకపై ఎలాంటి పరిమితి లేకుండా ఏడాది పొడవునా దరఖాస్తులు సమర్పించవచ్చు. 2023లో అమెరికా జారీ చేసిన 3,86,000 వీసాల్లో 72.3% భారతీయులే దక్కించుకున్న నేపథ్యంలో తాజా నిబంధనలు వారిపై సానుకూల ప్రభావం చూపించనున్నాయి. అలాగే హెచ్-1బీ వీసాలను అమెరికాలోనే పునరుద్ధరించే ప్రక్రియను ప్రవేశపెట్టడంతో అక్కడున్న భారతీయ టెకీలకు ప్రయోజనం చేకూరనుంది.

కెనడా వెళ్లారు... కాలేజీల్లో చేరలేదు!

» రిపోర్టు చేయని 20వేల మంది భారత విద్యార్థులు

అట్టవా, జనవరి 17: భారత్ నుంచి గతేడాది దాదాపు 2.5 లక్షల మంది విద్యార్థులు ఉన్నత విద్య కోసం కెనడాకు వెళ్లారు. అయితే వీరిలో సుమారు 20వేల మంది అక్కడి కాలేజీల్లో రిపోర్టు చేయలేదనే విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఇది ఆ దేశంలో ఉన్న మొత్తం భారత విద్యార్థుల్లో 5.4 శాతానికి సమానం. కెనడా వలసలు, శరణార్థులు, పౌరసత్వ శాఖ(ఐఆర్‌సీసీ) నివేదిక ప్రకారం.. 2024 మార్చి, ఏప్రిల్ నెలల్లో దాదాపు 50వేల మంది అంతర్జాతీయ విద్యార్థులు స్టడీ పర్మిట్లు జారీ అయిన తర్వాత కూడా కళాశాలలకు హాజరు కాలేదు. వీరిలో భారతీయ విద్యార్థులే అధికంగా ఉన్నా. కాగా, చైనా నుంచి వచ్చిన వారిలో 6.4శాతం, ఫిలిప్పీన్స్ నుంచి 2.2శాతం మంది విద్యార్థులు కాలేజీల్లో చేరలేదని తేలింది.

రష్యాలో 16 మంది భారతీయుల మిస్సింగ్

» ఇప్పటి వరకు యుద్ధంలో 12 మంది మృత్యువాత: కేంద్రం

న్యూఢిల్లీ, జనవరి 17: ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా తరుఫున పోరాడుతున్న భారతీయుల్లో ఇప్పటి వరకు 12 మంది ప్రాణాలు కోల్పోయారని, మరో 16 మంది ఆచూకీ తెలియడం లేదని భారత విదేశాంగ శాఖ తెలిపింది. ఈ మేరకు శుక్రవారం విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ఓ ప్రకటన చేశారు. ఇప్పటి వరకు రష్యా తరుఫున 126 మంది భారతీయులు యుద్ధంలో పాల్గొన్నారని చెప్పారు. వారిలో 96 మందిని రష్యా డిశ్చార్జి చేయడంతో కొందరిని స్వదేశానికి తీసుకువచ్చామని వెల్లడించారు. ఇంకా 18 మంది మాత్రం ఇప్పటికీ రష్యా ఆర్మీలో ఉన్నారని, వారిలో 16 మంది ఆచూకీ లేదని పేర్కొన్నారు. రష్యా వారిని కనిపించకుండా పోయినట్లు ప్రకటించిందన్నారు. మిగిలిన వారిని స్వదేశానికి పంపాలని రష్యాను భారత్ కోరిందని రణధీర్ జైశ్వాల్ చెప్పారు.

ఇజ్రాయెల్-హమాస్ ఒప్పందం రేపు అమల్లోకి!

» నేడు ఆమోదించనున్న నెతన్యాహు కేబినెట్

టెల్ అవీవ్, జనవరి17: ఇజ్రాయెల్-హమాస్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంపై చర్చించి ఆమోదం తెలిపేందుకు ఇజ్రాయెల్ కేబినెట్ ప్రత్యేకంగా సమావేశం కానుంది. నెతన్యాహు కేబినెట్ దీనికి ఆమోదం తెలిపితే ఆదివారం(ఈ నెల 19) నుంచి ఇది అమల్లోకి రానుంది. ఒప్పందం అమల్లోకి వస్తే 470 రోజులుగా జరుగుతున్న యుద్ధానికి తెరపడుతుంది. బుధవారం ఒప్పందం కుదిరినా చివరి దశలో కొన్ని చిక్కులు రావడంతో మధ్యవర్తిత్వం వహిస్తున్న అమెరికా- ఖతార్ వీటిని పరిష్కరించినట్లు తెలిసింది. మొత్తం 33 మంది బందీలను హమాస్ విడిచిపెట్టనుంది. ఇందుకు బదులుగా ఇజ్రాయెల్ జైళ్లలో ఉన్న పాలస్తీనా ఖైదీలను విడిచిపెట్టాల్సి ఉంటుంది. అయితే ఎంతమంది ఖైదీలను ఇజ్రాయెల్ విడిచిపెట్టనుందనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. హమాస్ వద్ద ఇంకా ఎంతమంది ఇజ్రాయెల్ పౌరులు బందీలుగా ఉన్నారనేది కూడా తెలియరాలేదు. కాగా, యుద్ధంలో ధ్వంసమైన గాజా తిరిగి కోలుకోవడానికి 350 సంవత్సరాలు పట్టవచ్చని ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. 18.5 బిలియన్ల అమెరికా డాలర్ల నిధులు కనీసంగా అవసరమవుతాయని తెలిపింది.

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు ట్రంప్ ఫోన్

వాషింగ్టన్, జనవరి17: డొనాల్డ్ ట్రంప్ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు ఫోన్ చేశారు. వాణిజ్యం, టిక్‌టాక్ తదితర అంశాలపై చర్చించారు. ఉమ్మడి ప్రయోజనాలను కాపాడుకోవాలని నిర్ణయించారు. కొన్ని అంశాలపై భిన్నాభిప్రాయాలు ఉండటం సహజమేనని, అయితే ఒకరినొకరు గౌరవించుకుంటూ పరిష్కారం కోసం యత్నించాలని నిర్ణయించారు. జిన్‌పింగ్‌తో ఫోన్ సంభాషణ తర్వాత ట్రంప్ తన సామాజిక మాధ్యమం ట్రూత్ ద్వారా ఈ విషయాలు వెల్లడించారు. సంయుక్తంగా అనేక సమస్యలను పరిష్కరించగలమనే ధీమాను వ్యక్తం చేశారు. ఈ నెల 20న ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. చైనా ఉపాధ్యక్షుడు హాన్ జెంగ్ ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరుకానున్నారు.

బీజాపూర్ ఎన్‌కౌంటర్ మృతుల్లో ఐదుగురు మహిళలు

చర్ల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లా పూజారికాంకేర్ అడవుల్లో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు మృతి చెందారని, మృతులను గుర్తిస్తున్నామని బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎన్‌కౌంటర్ వివరాలను వెల్లడించారు. సౌత్‌బస్తర్ డివిజన్‌లోని మల్లంపేట, మారేడుబాక అడవుల్లో పీఎల్‌జీఏ మొదటి బెటాలియన్ నాయకుడు హిడ్మాతో పాటు ఇతర సభ్యులు ఉన్నట్లు సమాచారం అందడంతో బీజాపూర్, సుకుమా, దంతెవాడ జిల్లాలకు చెందిన డీఆర్‌జీ, కోబ్రా బలగాలు కూంబింగ్ చేపట్టాయన్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కాల్పులు జరిగాయని, అనంతరం ఘటనా స్థలాన్ని పరిశీలించగా 12 మంది నక్సలైట్ల మృతదేహాలు లభించాయని చెప్పారు. వీరిలో ఐదుగురు మహిళలు ఉన్నారని, మృతదేహాలను బీజాపూర్ తరలించామని తెలిపారు. కాగా, హిడ్మా కోసం బలగాలు అడవులను జల్లెడ పడుతున్నాయి. ఇదిలా ఉండగా, ప్రజాస్వామ్యానికి అతి పెద్ద శత్రువైన నక్సలిజం అంతానికి భారత ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్రం హోం శాఖ శుక్రవారం ప్రకటించింది.

గర్భిణులకు రూ.21వేలు

ఆరు పోషకాహార కిట్లు కూడా.. 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్

» మహిళలకు నెలకు రూ.2,500

» ఢిల్లీ ఓటర్లపై బీజేపీ హామీల వర్షం


బీజేపీ సంకల్ప పత్ర విడుదల సందర్భంగా విలేకరులతో మాట్లాడుతున్న నడ్డా

న్యూఢిల్లీ, జనవరి 17: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రజలపై బీజేపీ వరాల వర్షం కురిపిస్తోంది. ఓటర్లను ఆకట్టుకునేందుకు ఆకర్షణీయమైన హామీలతో బీజేపీ మేనిఫెస్టోను విడుదల చేసింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా శుక్రవారం సంకల్ప్ పత్ర్ పేరిట దానిని విడుదల చేశారు. అందులో ఢిల్లీలో బీజేపీని అధికారంలోకి తీసుకువస్తే గర్భిణులకు రూ.21 వేల ఆర్థిక సాయం, ఆరు పోషకాహార కిట్లు అందిస్తామని ప్రకటించారు. వాటితో పాటు ప్రస్తుతం అందిస్తున్న మొదటి కాన్పుకు రూ.5 వేలు, రెండు కాన్పుకు రూ. 6 వేల సహాయం కొనసాగిస్తామని చెప్పారు. అలాగే మహిళా సమృద్ధి యోజన కింద మహిళలకు ప్రతినెలా రూ.2500 ఆర్థిక సాయం అందిస్తామన్నారు. రూ.500లకే ఎల్‌పీజీ సిలిండర్ అందించడంతో పాటు హోలీ, దీపావళి పండుల సందర్భంగా ఒక్కొక్క సిలిండర్ ఉచితంగా ఇస్తామని చెప్పారు. ఇక 60 నుంచి 70 ఏళ్ల మధ్య వయసున్న వృద్ధులకు నెలకు రూ.2,500, 70 ఏళ్లు పైబడిన వారికి, దివ్యాంగులకు, వితంతువులకు నెలకు రూ.3000 వేల సాయం ఇస్తామని ప్రకటించారు. ఆయుష్మాన్ భారత్ అమలు చేస్తామని, దీనికి అదనంగా రూ.5 లక్షల కవరేజీ ఇస్తామని ప్రకటించారు. అటల్ క్యాంటీన్‌లను ఏర్పాటు చేసి రూ.5 లకే భోజనం అందిస్తామని ప్రకటించారు.

ఉచితాలపై మోదీ ఏమంటారు: కేజ్రీవాల్

ఢిల్లీ ఎన్నికల వేళ బీజేపీ ఉచిత పథకాలు ప్రకటించడంపై ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ స్పందించారు. ఆప్‌ను కాపీ కొట్టి బీజేపీ పథకాలను ప్రకటించిందని ఆయన ఆరోపించారు. కేజ్రీవాల్ ఉచితాలు ఇస్తారని బీజేపీ నన్ను విమర్శించేది, ఇప్పుడు ఆ పార్టీనే ఢిల్లీ ప్రజలకు ఉచితాలు ప్రకటించిందని మండిపడ్డారు. 'ఇంతకాలం ఉచితాలు మంచివి కావని మోదీ అన్నారు. కానీ వారి మేనిఫెస్టో ద్వారా ఇన్నాళ్లు వారు అన్నవి తప్పని తేలింది. ఉచితాలు హానికరం కాదని, మంచివేనని ప్రధాని ఇప్పుడు అంగీకరించాల'ని డిమాండ్ చేశారు. బీజేపీ మేనిఫెస్టోను అబద్ధాల కట్ట అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. మరోవైపు ఢిల్లీలో విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని కేజ్రీవాల్ ప్రకటించారు. మెట్రోలో 50 శాతం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ నడిపే అన్ని ఏసీ, నాన్ ఏసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అందిస్తుమని గుర్తు చేశారు. కాగా, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ దాఖలుకు ఆఖరి రోజైన శుక్రవారం బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది.

ఏఐతో ఆప్ దూకుడు

ఢిల్లీ పీఠాన్ని వరుసగా మూడోసారి దక్కించుకోవడానికి ఆమ్ ఆద్మీ పార్టీ అందివచ్చిన ప్రతి అవకాశాన్ని తన ఎన్నికల ప్రచారానికి వాడేస్తోంది. ఫిబ్రవరి 5న జరిగే ఎన్నికల కోసం అటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ, ఇటు సంప్రదాయ ప్రచారాన్ని కొనసాగిస్తూ దూసుకెళుతోంది. విపక్ష నేతలపై ఏఐ సాయంతో కామెడీ కంటెంట్‌తో వీడియోలను రూపొందించి సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్న ఆ పార్టీ.. మరోపక్క ర్యాలీలు, పాదయాత్రలతో ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది. ముఖ్యంగా బీజేపీ నేతలను లక్ష్యంగా చేసుకున్న స్పూఫ్ వీడియోలు ఆప్ ప్రచారంలో కీలకంగా మారాయి.

ఢిల్లీలో ఆయుష్మాన్ భారత్ అమలుపై సుప్రీంకోర్టు స్టే

ఆరోగ్య పథకాల అమలు విషయమై కేంద్రంతో ఒప్పందం చేసుకోవాలంటూ ఢిల్లీ ప్రభుత్వానికి హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై శుక్రవారం సుప్రీంకోర్టు స్టే విధించింది. కేంద్రం అమలు చేసే పీఎం-ఆయుష్మాన్ భారత్, ఆస్పత్రుల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు ఉద్దేశించిన పీఎం-అభీం పథకాల అమలుపై జనవరి 5లోగా కేంద్రంతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకోవాలని గత నెల 24న హైకోర్టు ఆదేశించింది. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కేంద్ర పథకాలను అమలు చేస్తుండగా, ఒక్క ఢిల్లీ ప్రజలే ఆ సేవలకు ఎందుకు దూరం కావాలంటూ ఈ ఉత్తర్వులిచ్చింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ కేంద్రంతో ఎంఓయూ కుదుర్చుకోవాలని ఆదేశించింది. దీనిని సవాలు చేస్తూ ఢిల్లీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా ధర్మాసనం స్టే ఇచ్చింది.

ఫిబ్రవరి 15న సికింద్రాబాద్ నుంచి కుంభమేళాకు ప్రత్యేక రైలు!

» 8 రోజుల యాత్రకు ప్రత్యేక ప్యాకేజీ

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాలో పాల్గొనే భక్తుల కోసం ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) ప్రత్యేక రైలును నడుపుతోంది. ఫిబ్రవరి 15న సికింద్రాబాద్ నుంచి బయలుదేరే ఈ రైలు 22న తిరిగి నగరానికి చేరుతుంది. వారంరోజుల పాటు జరిగే ఈ మహాకుంభ పుణ్యక్షేత్ర యాత్ర ప్రత్యేక రైలుకు ఐఆర్‌సీటీసీ ప్యాకేజీని ప్రకటించింది. భక్తులు వారాణసీ, అయోధ్య, ప్రయాగ్‌రాజ్‌లను దర్శించుకుని ఎనిమిది రోజుల్లో తిరిగి చేరుకునేందుకు వీలుగా ఈ ప్యాకేజీని రూపొందించింది. మొత్తం 578 మంది సామర్థ్యంతో కూడిన ఈ రైలు ఫిబ్రవరి 15న సికింద్రాబాద్ స్టేషన్ నుంచి బయలుదేరి 18న ప్రయాగ్‌రాజ్‌కు చేరుతుంది. కుంభమేళాలో భక్తులు పాల్గొంటారు. 19న వారాణసీలో కాశీవిశ్వనాథ్, కాశీ విశాలాక్షి, అన్నపూర్ణాదేవి ఆలయాలను దర్శించుకుని, ఆ రాత్రి అక్కడే విశ్రాంతి తీసుకుని 20న అయోధ్య చేరుకుంటారు. అయోధ్యలో శ్రీరామ జన్మభూమి, హనుమాన్ గర్హిని సందర్శించిన అనంతరం తిరుగు ప్రయాణం ప్రారంభమవుతుంది. 22 రాత్రికి సికింద్రాబాద్ చేరుకుంటుంది. యాత్రికులు ఎక్కి, దిగేందుకు ఈ ప్రత్యేక రైలు సికింద్రాబాద్, కాజీపేట, వరంగల్, ఖమ్మం, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మాపూర్, చత్రపూర్, కుర్దారోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్, బాలసూర్ స్టేషన్లలో ఆగుతుందని ఐఆర్‌సీటీసీ అధికారులు తెలిపారు. యాత్ర ప్యాకేజీలో ఎకానమీ (ఎస్ఎల్) పెద్దలకు రూ.23,035, పిల్లలకు (5-11 ఏళ్లలోపు) రూ.22,140లుగా చార్జీలు ఖరారు చేశారు. ఏసీ బోగీల చార్జీలు వేరుగా ఉంటాయి.

సైఫ్‌పై దాడిలో అండర్‌వరల్డ్ హస్తం లేదు

» మహారాష్ట్ర మంత్రి యోగేశ్ కదమ్ స్పష్టీకరణ

ముంబై, జనవరి 17: బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై జరిగిన దాడి వెనుక అండర్‌వరల్డ్ గ్యాంగ్ హస్తం లేదని.. మహారాష్ట్ర మంత్రి యోగేశ్ కదమ్ అన్నారు. సీసీటీవీ ఫుటేజీ వీడియోల ఆధారంగా.. అనుమానితుడి ముఖకవళికలున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, మరొక వ్యక్తిని కూడా పోలీసులు ట్రాక్ చేస్తున్నారని మంత్రి తెలిపారు. పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తికి క్రిమినల్ రికార్డు ఉందని వెల్లడించారు. ఈ దాడి వెనుక నేరముఠాల పాత్ర ఏమైనా ఉందా? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు.. అలాంటిదేమీ లేదని ప్రాథమిక విచారణలో తేలిందని, నిందితుడు చోరీ చేసే ఉద్దేశంతోనే వచ్చినట్టు కనిపిస్తోందని బదులిచ్చారు. తనకు ముప్పు ఉన్నట్టుగా సైఫ్ నుంచి పోలీసులకు ఇప్పటిదాకా సమాచారమేదీ లేదని.. ఆయన ఎలాంటి సెక్యూరిటీ కోరలేదని, ఒకవేళ కోరితే నిబంధనల మేరకు వ్యవహరిస్తామని ఆయన వెల్లడించారు. కాగా, సైఫ్‌పై దాడి జరిగిన ఫ్లాట్ వద్ద అసలు నిఘా కెమెరాలేవీ లేవని పోలీసు వర్గాల సమాచారం. అపార్ట్‌మెంట్ భవనంలో అమర్చిన సీసీ కెమెరా ఫుటేజీ ద్వారానే అనుమానితుణ్ని గుర్తించారు.

మాదక ద్రవ్యాల కేసులో 2500 మందికి క్షమాభిక్ష!

» ఒక్క రోజులో బైడెన్ నిర్ణయం

» భారీ సంఖ్యలో క్షమాభిక్షలు

» ప్రసాదించిన అధ్యక్షుడిగా రికార్డు

వాషింగ్టన్, జనవరి 17: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మరో రెండు రోజుల్లో తన పదవిని వదులకోనున్నారు. నూతన అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఈ నెల 20న శ్వేత సౌధంలోకి అడుగు పెట్టనున్నారు. అయితే.. ఈ చివరి రోజుల్లో అధ్యక్షుడు బైడెన్ సంచలన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా క్షమాభిక్షలు, తీవ్ర నేరాల్లో శిక్షలు పడిన వారికి ఆయా శిక్షల తగ్గింపు వంటి నిర్ణయాలతో రికార్డు సృష్టించారు. మాదక ద్రవ్యాల కేసుల్లో దీర్ఘకాలంగా జైల్లో మగ్గుతున్న 2500 మందికి శుక్రవారం ఒకే ఒక్క రోజులో ఆయన క్షమాభిక్ష ప్రసాదించారు. అధ్యక్షుడిగా తనకు ఉండే క్షమాభిక్ష అధికారాలను వినియోగించి.. ఈ నిర్ణయం తీసుకున్నట్టు బైడెన్ తెలిపారు. తాజా నిర్ణయంతో అమెరికా అధ్యక్షులుగా చేసిన వారిలో ఇప్పటి వరకు ఎవరూ ప్రసాదించని క్షమాభిక్షలు, శిక్ష తగ్గింపులు చేసిన అధ్యక్షుడిగా బైడెన్ రికార్డు సృష్టించినట్టు అయింది. చరిత్రాత్మక తప్పులను, శిక్షల అసమానతలను తగ్గించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని తెలిపారు. కాగా, ఈ 2500 మంది పేర్లను అధ్యక్ష భవనం వెల్లడించలేదు. అదేవిధంగా సోమవారం(ఈ నెల 20)లోగా మరిన్ని క్షమాభిక్షలు ప్రసాదించేందుకు, శిక్షలు తగ్గించేందుకు తన ప్రయత్నం కొనసాగుతుందని వెల్లడించారు. ఇదిలావుంటే, కరోనా సమయంలో శిక్షలు పడిన, గృహ నిర్బంధంలో ఉన్న 1500 మంది శిక్షలను బైడెన్ గత నెలలో తగ్గించారు.

గతంలో ట్రంప్ కూడా..

గతంలో అధ్యక్షుడిగా వ్యవహరించిన రిపబ్లికన్ నేత డొనాల్డ్ ట్రంప్ కూడా తన పదవి నుంచి దిగిపోయే చిట్ట చివరి రోజు అర్ధరాత్రి 140 మందికి సంబంధించిన శిక్షలను తగ్గించే లేదా క్షమాభిక్షలు ప్రసాదించే ఉత్తర్వులపై సంతకాలు చేశారు.

వేతనాలు ఎంత పెరుగుతాయి?

» 8వ వేతన కమిషన్‌పై పలు అంచనాలు

» వేతన పెంపు రూ.45 వేల వరకూ!

న్యూఢిల్లీ, జనవరి 17: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదార్ల కోసం 8వ వేతన కమిషన్‌ను నియమిస్తామని కేంద్రప్రభుత్వం ప్రకటించటంతో.. వేతనాలు, పింఛన్లు ఏ మేరకు పెరుగుతాయన్న దానిపై రకరకాల విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఈ మేరకు ప్రముఖ బిజినెస్ పత్రిక 'ఎకనమిక్ టైమ్స్' పలువురు నిపుణులను సంప్రదించి వారి అభిప్రాయాలను వెల్లడించింది. టీమ్‌లీజ్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణేందు చటర్జీ స్పందిస్తూ.. 'ప్రస్తుత ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకొని చూస్తే ఉద్యోగుల వేతనాలు సగటున రూ.40 వేల నుంచి రూ.45 వేల మధ్యన పెరగవచ్చు' అని తెలిపారు. ఈసారి పనితీరు ఆధారిత వేతన పెంపు అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. 'కింగ్ స్టబ్ అండ్ కాసివా' అనే సంస్థకు చెందిన రోహితాశ్వ సిన్హా మాట్లాడుతూ.. కొత్త వేతన కమిషన్ వల్ల మూల వేతనంలో 186% పెంపు ఉండవచ్చని, తద్వారా కనీస మూల వేతనం నెలకు రూ.51,480కి పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఎస్‌కేవీ లా ఆఫీసర్స్ సీనియర్ అసోసియేట్ నీహాల్ భరద్వాజ్.. గత పే కమిషన్ల ద్వారా సంభవించిన వేతనాల పెంపును దృష్టిలో పెట్టుకొని చూస్తే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు 25-30% పెరిగే అవకాశం ఉందన్నారు. 2006-16 కాలవ్యవధికి సంబంధించి ఏర్పాటైన 6వ వేతన కమిషన్ వేతనాల్లో 40 శాతం పెంపునకు సిఫార్సు చేయగా, 2016-26కి సంబంధించిన 7వ వేతన కమిషన్ 23-25% వేతన పెంపును సిఫార్సు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

విడిగా కాదు..ఉమ్మడిగానే

దావోస్‌లో నేరుగా భారత్‌కే రాష్ట్రాల ప్రాతినిధ్యం

కొత్తగా 'ఒక దేశం- ఒకే వేదిక' విధానం

రాష్ట్రాలకు ఇస్తున్న సమయం కుదింపు

సదస్సుకు తెలంగాణ సీఎం రేవంత్


గతేడాది దావోస్‌లో పారిశ్రామికవేత్తలతో రేవంత్

న్యూఢిల్లీ, జనవరి 17: దావోస్ సదస్సు అంటేనే పెట్టుబడుల వేట. మనదేశం నుంచి వెళ్లే పలు రాష్ట్రాల ప్రతినిధులు అధిక పెట్టుబడులను ఆకర్షించేందుకు పోటాపోటీగా తలపడే ప్రపంచ వేదిక అది. అలాగే, కేంద్ర ప్రభుత్వం కూడా ఒక టీమ్‌ను పంపుతుంది. 'ఒక దేశం- పలు వేదికలు' అన్నట్టు ఇప్పటివరకు నడిచింది. మరిన్ని గ్లోబల్ కంపెనీలను ఆకట్టుకుందుకు అటు కేంద్రం, ఇటు రాష్ట్రాలు తమలో తాము ఈ వేదికపై తీవ్రంగా తలపడుతుండేవి. అయితే, ఈసారి ఇటువంటి దృశ్యాలు దావోస్ సదస్సులో కనిపించకపోవచ్చు. ఈ నెల 20 నుంచి ఐదు రోజులు జరిగే ఈ సదస్సులో మునుపటిలా ఆర్థిక ప్రయోజనాలు రాబట్టుకునేందుకు మన రాష్ట్రాలు సాగించే పరస్పర బాహాబాహీలకు వీలులేకపోవచ్చు. 'ఒక దేశం- ఒకే వేదిక' అనే విధానాన్ని ఈ సదస్సును నిర్వహిస్తున్న దావోస్ సిటీ కౌన్సిల్ ముందుకు తేవడమే దీనికి కారణం. ఒక దేశం నుంచి ఒక ప్రాతినిధ్యం సరిపోతుంది కదా అని కౌన్సిల్ అభిప్రాయపడినట్టు 'మనీ కంట్రోల్' అనే పత్రిక ఒక కథనం ప్రచురించింది. ఈ కథనం ప్రకారం.. ఈసారి తెలంగాణ సహా ఆరు రాష్ట్రాలు దావోస్ సదస్సులో పాల్గొంటున్నాయి. అయితే కొత్త విధానం ప్రకారం ఈ రాష్ట్రాలకు ఇస్తున్న ప్రాధాన్యం, సమయం కూడా ఈసారి బాగా తగ్గిపోనుంది. తెలంగాణ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి ఈ దస్సుకు హాజరు కానున్నారు. ఏపీ సీఎం చంద్రబాబు, మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ కూడా సదస్సుల్లో పాల్గొంటారు. ఇక.. కర్ణాటక, కేరళ, యూపీ నుంచి మంత్రులు హాజరవుతారు. కేంద్ర ప్రభుత్వం కూడా మంత్రుల బృందాన్ని పంపిస్తోంది. అయితే, రాష్ట్రాలన్నీ ఒకే గొడుగు కింద పనిచేయాలన్న నిర్ణయంపై కర్ణాటక అసంతృప్తి వ్యక్తం చేసింది. తన ప్రతినిధి బృందాన్ని పంపడానికి దావోస్‌కు పంపించడానికి నిరాకరించింది.

హైదరాబాద్ యువకుడికి అమెరికాలో 8 ఏళ్ల జైలు శిక్ష

» 2023లో ట్రక్కుతో వైట్‌హౌస్‌పై దాడికి యత్నించిన సాయి వర్షిత్

» అతనివి నాజీ సిద్ధాంతాలు: అమెరికా


సాయి వర్షిత్ (ఫైల్)

వాషింగ్టన్, జనవరి 17: అమెరికా అధ్యక్ష భవనం వైట్ హౌస్‌పై ట్రక్కుతో దాడికి యత్నించిన తెలుగు యువకుడు సాయి వర్షిత్ కందుల(20)కు అమెరికాలోని జిల్లా కోర్టు 8 ఏళ్ల జైలు శిక్షను విధించింది. ఆయన విడుదల అయిన తర్వాత కూడా మూడేళ్ల పాటు పర్యవేక్షణ కొనసాగుతుందని జడ్జి డాబ్నే ఎల్ ఫ్రెడ్‌రిచ్ తన ఆదేశాల్లో స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని చందానగర్‌లో జన్మించిన సాయి వర్షిత్.. తర్వాత అమెరికా వెళ్లి గ్రీన్ కార్డు పొందారు. అయితే, 2023, మే 22న ఓ ట్రక్కును అద్దెకు తీసుకుని వైట్ హౌస్‌పై దాడికి యత్నించారు. తాజాగా ఈ కేసు విచారణ పూర్తయింది. "నియంత నాజీ సిద్ధాంతాలను ఒంటబట్టించుకున్న సాయి వర్షిత్.. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన అమెరికా ప్రభుత్వాన్ని కూల్చేసే ప్రయత్నం చేశారు" అని అమెరికా న్యాయ శాఖ నిప్పులు చెరిగింది. సాయి తన నేరాన్ని అంగీకరించినట్టు తెలిపింది. కోర్టుకు సమర్పించిన నివేదికల ప్రకారం.. 2023, మే 22న సాయి సెయింట్ లూయిస్ నుంచి వాషింగ్టన్ డీసీకి చేరుకున్నారు. సాయంత్రం 6.30 గంటల సమయంలో ఓ ట్రక్కును అద్దెకు తీసుకుని శ్వేత సౌధం వైపు దూసుకువెళ్లారు. ఈ క్రమంలో వైట్ హౌస్ సహా ప్రెసిడెంట్ పార్క్‌కు రక్షణగా ఉన్న బారికేడ్లు ధ్వంసమయ్యాయి. అనంతరం ట్రక్కు నుంచి దిగిపోయిన సాయి.. దాని వెనుకకు వెళ్లి ట్రక్కుకు కట్టిన 'నాజీ-స్వస్తిక్' ముద్రలున్న తెల్లటి బ్యానర్లను తొలగించారు. ఈ సమయంలోనే పోలీసులు సాయిని అరెస్టు చేశారు. కాగా, డ్రగ్స్ కేసుల్లో దీర్ఘకాలంగా జైల్లో మగ్గుతున్న 2500 మందికి అమెరికా అధ్యక్షుడు బైడెన్ శుక్రవారం క్షమాభిక్ష ప్రసాదించారు. తద్వారా అమెరికా అధ్యక్షులుగా చేసిన వారిలో ఇప్పటి వరకు ఎవరూ ప్రసాదించని క్షమాభిక్షలు, శిక్ష తగ్గింపులు చేసిన అధ్యక్షుడిగా బైడెన్ రికార్డు సృష్టించినట్టు అయింది.

పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు 14 ఏళ్ల జైలుశిక్ష

» ఆయన సతీమణికి ఏడేళ్ల జైలుశిక్ష

» మరో అవినీతి కేసులో పాక్ కోర్టు తీర్పు

ఇస్లామాబాద్, జనవరి 17: ఒక అవినీతి కేసులో పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్, ఆయన సతీమణి బుష్రా బీబీలకు వరుసగా 14, ఏడేళ్ల జైలుశిక్షలు విధిస్తూ పాకిస్థాన్ కోర్టు ఒకటి శుక్రవారం తీర్పు ఇచ్చింది. 190 మిలియన్ పౌండ్ల అల్ ఖాదిర్ ట్రస్ట్ అవినీతి కేసులో ఈ ఇద్దరిని దోషులుగా నిర్ధారించి కోర్టు శిక్ష విధించింది. ఇమ్రాన్‌ఖాన్‌ను ఉంచిన అదీల జైలులో ఏర్పాటు చేసిన తాత్కాలిక కోర్టులో జడ్జి ఈ తీర్పు ఇవ్వడం విశేషం. ఇమ్రాన్‌ఖాన్‌కు జైలు శిక్షతో పాటు పది లక్షల పాకిస్తాన్ రూపాయల జరిమానా, బుష్రా బీబీకి జైలుశిక్షతోపాటు 5 లక్షల పాకిస్థాన్ రూపాయల జరిమానా కూడా విధించడం గమనార్హం. అలాగే ఇమ్రాన్‌ఖాన్ దంపతులు ఏర్పాటు చేసిన అల్ ఖాదిర్ విశ్వవిద్యాలయం భూమిని కూడా జప్తు చేయాలని కోర్టు ఆదేశించింది. కాగా ఇమ్రాన్‌ఖాన్ ఇప్పటికే జైలులో ఉండగా... ఆయన సతీమణిని కోర్టు వద్దే తీర్పు అనంతరం అరెస్టు చేశారు. 2022లో పాక్ పార్లమెంటులో విశ్వాస పరీక్ష ఓడిపోయిన నాటి నుంచి ఇమ్రాన్ ఖాన్ 12 కేసులను ఎదుర్కొంటున్నారు. తాను వాటి నుంచి ఎటువంటి ఉపశమనం కోరుకోవడం లేదని, ఆ కేసులను ఎదుర్కొంటానని.. ఒక నియంత దీనంతటికి కారణమని ఆయన అన్నట్లు సమాచారం.



అలిపిరిలో తనిఖీలు డొల్ల!

▸▸ **కోడిగుడ్లు, పలావ్‌తో తిరుమలకు చేరుకున్న బృందం**

తిరుమల, జనవరి 17(ఆంధ్రజ్యోతి): టీటీడీలో భద్రతా తనిఖీల వైఫల్యం మరోసారి బట్టబయలైంది. కోడిగుడ్లు, పలావ్ ఉన్న భారీ పాత్రతో ఓ బృందం నేరుగా అలిపిరి మీదుగా తిరుమలకు చేరుకుంది. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు సమీపంలోని గుమ్మడిపూడికి చెందిన 28 మందితో కూడిన ఇతర మతానికి చెందిన ఓ బృందం శుక్రవారం ఉదయం అలిపిరి నుంచి ఘాట్‌లో తిరుమలకు చేరుకుంది. రాంభగీచ బస్టాండ్‌కు సమీపంలోని పార్కింగ్‌లో వారు తమ వెంట తీసుకువచ్చిన కోడిగుడ్ల కూర, పలావ్ తింటుండగా చూసిన భక్తులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఆ బృందాన్ని అదుపులోకి తీసుకున్నారు. కాగా, తిరుమలలో నిబంధనల గురించి తమకు తెలియదని వారు వివరణ ఇచ్చారు.


తిరుమలలో పోలీసులు స్వాధీనం చేసుకున్న పలావ్, కోడిగుడ్ల కూర

నేడు ఏప్రిల్ ఆర్జితసేవా టికెట్ల కోటా విడుదల

శ్రీవారి ఆర్జితసేవా టికెట్లకు సంబంధించిన ఏప్రిల్ నెల లక్కీడిప్ కోటాను టీటీడీ శనివారం ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవలను 18వ తేదీ ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. ఈ టికెట్ల రిజిస్ట్రేషన్ కోసం జనవరి 18 నుంచి 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో భక్తులు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

'చాగంటికి అవమానం' అవాస్తవం

▸▸ **బయోమెట్రిక్ నుంచి వెళ్లే అవకాశమున్నా తిరస్కరించారు: టీటీడీ**


ఏపీ ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావుకు తిరుమలలో అవమానం జరిగిందంటూ సోషల్‌మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని టీటీడీ ఖండించింది. 'ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు జనవరి 16వ తేదీన తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో ప్రవచనాలు ఇచ్చేందుకు డిసెంబరు 20వ తేదీన టీటీడీ ప్రొసీడింగ్స్ ఇచ్చింది. క్యాబినెట్ ర్యాంక్ ప్రొటోకాల్ ప్రివిలేజ్ ప్రకారం 14న శ్రీవారి దర్శన ఏర్పాట్లు చేసింది. వయసు రీత్యా ఆలయం ముందున్న బయోమెట్రిక్ నుంచి దర్శనానికి వెళ్లే సదుపాయం ఉన్నప్పటికీ చాగంటి సున్నితంగా తిరస్కరించారు. సాధారణ భక్తుల తరహాలోనే వైకుంఠం క్యూకాంప్లెక్స్ నుంచి వచ్చి దర్శనం చేసుకున్నారు. సోషల్ మీడియాలో అసత్య కథనాలను ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అని టీటీడీ శుక్రవారం ఓ ప్రకటనలో హెచ్చరించింది.


ఆర్యవైశ్యులపై దాడులు సహించం: టీజీ వెంకటేశ్

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులపై దాడులు జరిగితే చూస్తూ ఊరుకోబోమని రెండు రాష్ట్రాల ఎమ్మెల్యేలకు హెచ్చరిస్తున్నామని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేశ్ తెలిపారు. శుక్రవారం కర్నూలులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అందరితో కలిసిమెలిసి స్నేహపూర్వకంగా ఉంటారన్నారు. డోన్‌లో మాజీ ఎమ్మెల్యే మనుమడు, టీడీపీ నాయకుడిపై దాడి చేయడం సరికాదన్నారు. దాడి చేసిన వారిని రెండు రోజుల్లో అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి పక్షుల పండుగ

తడ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా సూళ్లూరుపేట కేంద్రంగా మూడు రోజులపాటు జరిగే పక్షుల పండుగ ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఐదేళ్ల తరువాత జరుగుతున్న ఈ పండుగను భారీ ఎత్తున నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది.







ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పసుపు సేద్యం

మన సంస్కృతీ సంప్రదాయాలలో పసుపు ప్రాధాన్యం గురించి సంపూర్ణ అవగాహన లేనివారు సైతం ఆ సుగంధ ద్రవ్యం ఆరోగ్యవర్ధిని అని చెప్పడం కద్దు. ముఖ్యంగా కోవిడ్ భయానక అనుభవాలను ఇంకా మరచిపోనివారు ఆ విషయాన్ని మరీ ఘంటాపథంగా ఘోషిస్తారు. ఆ విపత్కర కాలంలో రోగ నిరోధక శక్తిని పెంపొందించుకునేందుకు నెలల తరబడి రోజూ పాలలో చిటికెడు పసుపు పొడి కలుపుకుని తాగిన వారు సంఖ్యానేకంగా ఉన్నారు. పసుపు ఆరోగ్య ప్రదాయిని మాత్రమే కాదు, ఐశ్వర్య ప్రదాయిని కూడా. ఆ ఐశ్వర్యాభివృద్ధిలో రైతులకు చేదోడు వాదోడుగా ఉండేందుకై కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డును ఏర్పాటు చేసింది.

రాజకీయాలతో ముడిపడని వ్యవహారం ఈ రోజుల్లో ఏదీ ఉండదు కదా. అందునా రైతులకు సంబంధించిన విషయాన్ని పాలకులు ఖాయం చేయడమనేది అంత త్వరగా జరగదు. కనుకనే రైతులు పసుపు బోర్డుకై మొక్కవోని దీక్షతో పోరాడారు. ఈ క్రమంలో ఒక నాయకురాలిని పార్లమెంటుకు ఎన్నుకోవడానికి నిరాకరించారు, అంతకంటే ముఖ్యంగా 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో ప్రధానిపైనే పోటీ చేసేందుకు నిజామాబాద్ నుంచి వారణాసి వెళ్లి నామినేషన్లు వేశారు. తెలంగాణ పసుపు రైతుల డిమాండ్‌కు సరైన రీతిలో ప్రతిస్పందించడంలో కాలవిలంబన చేసినా మోదీ అంతిమంగా శ్రేయోదాయకమైన నిర్ణయాన్ని తీసుకున్నారు.

మకర సంక్రాంతి రోజున నిజామాబాద్‌లో ప్రారంభమైన పసుపు బోర్డు 'మోసుకొచ్చాం స్వరాజ్యమ్మూట మూట విప్పితే ఏమీ లేదు' చందం కాకూడదు. ఒక నిర్దిష్ట పంట అభివృద్ధికి ప్రత్యేకంగా ఏర్పడే బోర్డుకు కొత్త వంగడాలు సృష్టించడం, తెగుళ్ల నివారణకు కృషి చేయడం, దిగుబడుల నాణ్యత పెంచడం, మార్కెట్ విస్తరించడం, కొత్త మార్కెట్ సృష్టించడం మొదలైన బాధ్యతలు ఉంటాయి. తెలంగాణతో సహా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలలోని పసుపు రైతుల సంక్షేమ సాధనకు ఈ జాతీయ బోర్డు బాధ్యత వహిస్తుంది. అయితే దేశంలో ఆర్థికంగా వెనుకబడిన జిల్లాల్లో ఒకటిగా ఉన్న అవిభక్త నిజామాబాద్ జిల్లాలో పసుపు సాగు విస్తీర్ణం మరే ప్రాంతంలో కంటే ఎక్కువ. కనుక ఈ గోదావరీ తీరస్థ ప్రాంతం రైతుల (బోర్డు కోసం పోరాడడంలో ముందున్నదీ వీరే కదా) అభ్యున్నతిపై పసుపు బోర్డు ప్రత్యేక శ్రద్ధ చూపాలి.

పసుపు సేద్యం, వాణిజ్యంలో భారత్ ప్రపంచ అగ్రగామిగా ఉన్నది. ప్రపంచ పసుపు ఉత్పత్తిలో 70 శాతం వాటా, వాణిజ్యంలో 62 శాతం వాటా భారత్ సొంతం. 2023–24లో 226.5 మిలియన్ డాలర్ల విలువైన 1.62 లక్షల టన్నుల పసుపు ఉత్పత్తులను భారత్ ఎగుమతి చేసింది. అంతర్జాతీయ పసుపు విపణిలో మరింత వాటాను సాధించుకోగల సత్తా మన దేశానికి ఉన్నది. అయితే అందుకు నవీన సాగు పద్ధతులను అనుసరించడం ద్వారా మరింత నాణ్యమైన పసుపును ఉత్పత్తి చేయడంపై దృష్టి పెట్టవలసిన అవసరమున్నది. 2030 సంవత్సరం నాటికి 100 కోట్ల డాలర్ల విలువైన పసుపు ఎగుమతులను లక్ష్యంగా కేంద్రం నిర్దేశించింది. ఈ లక్ష్య పరిపూర్తిలో పసుపు బోర్డు బృహత్తర పాత్ర నిర్వహించవలసి ఉన్నది. ఔషధాలు, సౌందర్య సాధనాల తయారీలో పసుపును విరివిగా వాడుతున్నందున అంతర్జాతీయంగా ఈ సుగంధ ద్రవ్యానికి మంచి గిరాకీ ఉన్నది. విదేశీ మార్కెట్లకు మరింతగా సరఫరా చేయడం ద్వారా రైతులు తమ ఆదాయాన్ని ఇతోధికంగా పెంచుకోవచ్చు. అంతర్జాతీయ విపణి అవసరాలకు అనుగుణంగా దేశీయ పసుపు సాగు పద్ధతులు మార్చుకోవల్సిన అవసరమున్నది. నాణ్యమైన పసుపును ఎగుమతి చేసినప్పుడు ఈ సుగంధ ద్రవ్యం ద్వారా దేశానికి సమకూరుతున్న ఆదాయం మరింతగా పెరుగుతుంది.

పసుపు సాగుతో సొంత ఆదాయాన్ని, స్వరాష్ట్ర, స్వదేశ ఐశ్వర్యాన్ని మరింత సమృద్ధం చేయగల అవకాశం నిజామాబాద్ రైతులకు లభించింది. శతాబ్దాల క్రితం తెలుగునాట ఒక కొత్త ధర్మాన్ని (బౌద్ధం) తొట్టతొలుత ప్రవేశపెట్టిన బావరి అనే జ్ఞాని ఈ ప్రాంతీయుడే. జ్ఞానాన్వేషణలో కొత్త భావాలను ప్రవేశపెట్టి తెలుగు వారి బౌద్ధిక చరిత్రకు ఆద్యుడైన అలనాటి బావరి స్ఫూర్తితో ఈనాటి రైతులూ పసుపు బోర్డు సహకారంతో వినూత్న సాగు పద్ధతులతో పసుపు ఉత్పత్తిలో తద్వారా ఐశ్వర్యాభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కాలి. పసుపు సాగులో కొత్త అధ్యాయానికి నాంది పలకడంతో పాటు ఇదే ప్రాంతంలో నిన్నగాక మొన్నటివరకు సిరులు సృష్టించిన నిజాం చక్కెర కర్మాగారాన్ని పూర్తి స్థాయిలో పునరుద్ధరించేందుకు బావరి నడయాడిన ప్రాంత రైతులు, ప్రజాహితులు వినూత్న ఆలోచనలతో సమష్టిగా కృషి చేయాలి.

పని, జీవితం.. సమతుల్యత ఎలా?

ఆలోచించేలా నన్ను ప్రేరేపించే లేదా రెచ్చగొట్టే వాళ్లను నేను అభిమానిస్తాను. వారి అభిప్రాయాలలో కొన్నిటిని నేను అంగీకరించకపోవచ్చు గాని అవి నన్ను నా ఆలోచనల నుంచి విరామం తీసుకుని మననశీలమయ్యేలా, పునరాలోచించేలా చేసినందుకు నేను సంతోషపడతాను. అలా ఆలోచనలు పురిగొల్పే వాళ్లు మన దరిదాపుల్లో ఎంతో మంది ఉండరు. ఎన్.ఆర్. నారాయణమూర్తి (ఎన్ఆర్ఎన్), ఎస్.ఎన్. సుబ్రహ్మణ్యన్ (ఎస్ఎన్ఎస్) లాంటి విజ్ఞులు ఉన్నందుకు వారికి మనం కృతజ్ఞతాబద్ధులమవాలి. మన సమాజంలో, విశాల ప్రపంచంలో తమ సమున్నత స్థానాలను సొంతంగా సముపార్జించుకున్న వివేకశీలురు వారు. తమ సుదీర్ఘ, విలక్షణ వృత్తి జీవితాలలో తమ మనసులోని మాటలను సూటిగా చెప్పడాన్ని అలవరచుకున్న సుజనులు వారు. ఎన్ఆర్ఎన్, ఎస్ఎన్ఎస్ ఎప్పుడు ఏమి చెప్పినా ప్రజలు శ్రద్ధగా వింటారు, ప్రతిస్పందిస్తారు— కొందరు కలహశీలంగా!



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ఎన్ఆర్ఎన్, ఎస్ఎన్ఎస్ ఇరువురూ సంపదను వారసత్వంగా పొంద లేదు. అలా అని కూలీ లేదా వేతన భత్యాలు పొందే ఉద్యోగులు/ పారిశ్రామిక కార్మికులూ కాదు. సమగ్ర, సమర్థ యోగ్యతలు ఉన్న వృత్తి నిపుణులు వారు. ఇంజినీర్లుగా జీవితాలను ప్రారంభించి మొదటి తరం వ్యవస్థాపకులుగా ఎదిగిన వారు. తమ తమ సంస్థల లాభాలలో వాటాలు ఉన్నవారు. ఆ వాటాలకు పూర్తిగా అర్హులైన వారు. వారి ప్రపంచ దృక్పథం 'వారసుల', 'ఉద్యోగుల' ప్రపంచ దృక్పథాలకు భిన్నమైనవి. పర్యవసానంగా పని — జీవితం సమతౌల్యతపై వారి దృక్పథం కూడా భిన్నమైనది.


వారసులు అనేవారు అత్యున్నత స్థాయికి చేరేందుకు క్రింది స్థాయి నుంచి కష్టపడి పని చేయనక్కర లేదు. వారికి తెలుసు, అలాగే వ్యాపార జగత్తులోని ప్రతి ఒక్కరికీ తెలుసు— వారసులు ఏదో ఒక రోజున తమ సంస్థలో అత్యున్నత స్థాయికి చేరుకుంటారని. చాలా మంది వారసులు, పాత తరానికి చెందిన ఒక డజన్ కుటుంబాల వారు మినహా, సంపదనుగానీ, వ్యాపార విలువలను గానీ సృష్టించనివారేనని నేను భావిస్తున్నాను. దురదృష్టవశాత్తు అటువంటి వారసులలో కొంత మంది సమున్నత వ్యాపార విలువలు, సంపదను ధ్వంసం చేసినవారే. 1991కి పూర్వమూ, ఆ తరువాత అగ్రగామి పది దిగ్గజ వ్యాపార కుటుంబాల జాబితాలను పోల్చి చూడండి. మొదటి తరం వ్యవస్థాపకులలో అత్యధికులు అపూర్వ సంపద స్రష్టలే. ఇక కార్మికులు, ఉద్యోగుల విషయానికి వస్తే వారిలో అత్యధికులు నెలా నెలా వేతనభత్యాలు అందుకోవడం పట్ల సంతృప్తి చెందేవారే. వారి ప్రస్తుత హోదాను మించి ఉన్నత అంతస్థుకు చేరుకోవాలన్న ప్రగాఢ ఆకాంక్ష, ఆవశ్యక నైపుణ్యాలు లేనివారే. ఒక ఉద్యోగి ఒక వారంలో ఎన్ని గంటలపాటు పనిచేయాలన్న విషయమై ఎన్ఆర్ఎన్, ఎస్ఎన్ఎస్ వ్యాఖ్యలను విమర్శించినవారు చాలవరకు వారసులు, ఉద్యోగులుగా నేను గమనించాను.

వారానికి 70 గంటల పాటు పనిచేయాలని ఎన్ఆర్ఎన్ అన్నారు. వారానికి 90 గంటల పాటు పనిచేయాలని ఎస్ఎన్ఎస్ అన్నట్టు వార్తలు వెలువడ్డాయి. ఆ అభిప్రాయాలు వారి వారి దృక్పథాల నుంచి సరైనవేనని నేను భావిస్తున్నాను. ఎన్ఆర్ఎన్ ఇలా అన్నారు: "భారతదేశ ఉత్పాదక సామర్థ్యం ప్రపంచంలోనే చాలా తక్కువ.. కనుక మన యువజనులు 'ఇది నా దేశం, వారానికి 70 గంటలు పని చేయదలుచుకున్నాను అని తమకు తాము చెప్పుకోవాలి, సంకల్పించుకోవాలి'. నారాయణ మూర్తి వ్యాఖ్యలపై చాలా చర్చ జరిగింది. తీవ్ర విమర్శలు చెలరేగాయి. అయితే ఆయన వెనక్కి తగ్గ లేదు. ఒక ఎస్ఎన్ఎస్, ఎప్పుడు రికార్డు అయిందో తెలియని ఒక వీడియోలో ఇలా అన్నారు: 'ఆదివారాలూ కూడా మీ చేత పనిచేయించలేక పోతున్నందుకు నేను నిజంగా విచారిస్తున్నాను. అలా ఆదివారాలు కూడా మీ చేత పనిచేయించగలిగితే నేను చాలా సంతోషిస్తాను. నేను ఆదివారాలూ పని చేస్తుంటాను'.

పారిశ్రామిక కార్మికులకు 8 గంటల పనిదినం తొలుత జర్మనీలో 1918లో చట్టబద్ధమయింది. దరిమిలా 8 గంటలు శ్రమ, 8 గంటలు వినోదాలు (రిక్రియేషన్), 8 గంటలు విశ్రాంతి అన్నది ఒక విశ్వజనీన నియమయింది. వినోదాలకు రోజూ 8 గంటల సమయాన్ని వెచ్చించే వ్యక్తి ఒక్కరినీ నేను చూడలేదు. 'ఆహారం భుజించడం, బట్టలు ఉతుక్కోవడం, వ్యాయామం చేయడం, ఆటలు ఆడడం, సినిమాలు చూడడం, వార్తాపత్రికలు, పుస్తకాలు చదవడం, షాపింగ్ చేయడం, ఉబుసుపోక కబుర్లు చెప్పుకోవడం మొదలైనవన్నీ రిక్రియేషన్ కిందకు వస్తాయా? ఆ విధంగా చూస్తే రిక్రియేషన్‌కు 8 గంటలు సరిపోవేమో!

పారిశ్రామిక కార్మికులలో చాలా మంది చేసిన పనులనే మళ్లీ మళ్లీ చేస్తుంటారు. చాలా తక్కువ మంది మాత్రమే కొత్త నైపుణ్యాలు నేర్చుకుని మరింత సంక్లిష్ట పనులు చేసే అర్హతలు సంపాదించుకుంటారు. డెస్క్ ఉద్యోగాలు ప్రాచుర్యంలోకి వచ్చినప్పుడు 8—8—8 నియమాన్నే అనుసరించడం ఆరంభమయింది. డెస్క్ ఉద్యోగులలో చాలా మంది చేసేవి కూడా పునరుక్తమవుతుండేవి. ఈ దృష్ట్యా కార్మికులు/ ఉద్యోగులలో అత్యధికులకు 8—8—8 నియమం బాగా ఆమోదయోగ్యమయింది. ఆటోమేషన్, రోబోలు, కృత్రిమ మేధ (ఏఐ) వచ్చిన దరిమిలా ఆ నియమం కొద్ది గంటలుగా మారింది. కార్మికులు/ ఉద్యోగులు ఎక్కువ గంటలు పనిచేయవలసిన అవసరం లేకపోయింది. అయితే ఉత్పాదక సామర్థ్యం పెంచుకునేందుకు కొత్త పరికరాలు, సాంకేతికతలు, యంత్ర వ్యవస్థలు అవసరమయ్యాయి. ఎన్ఆర్ఎన్, ఎస్ఎన్ఎస్‌ల వ్యాఖ్యలు ఇటువంటి కార్మికులు/ ఉద్యోగుల నుద్దేశించి చేసినవి కావని నేను భావిస్తున్నాను.

కార్మికులు/ఉద్యోగులకు భిన్నంగా రైతులు 8—8—8 నియమాన్ని అనుసరించారు. వ్యవసాయంలో మొదటి



యువజనులు సుదీర్ఘ గంటల పాటు చేసే ఉత్పాదక కృషే ఒక వర్ధమాన దేశాన్ని సంపద్వంతం చేస్తుందనే సత్యాన్ని యువతరం మనసుల్లో పాదుకొల్పేందుకే వారానికి 70 లేదా 90 గంటలపాటు పనిచేయాలని నారాయణమూర్తి, సుబ్రహ్మణ్యన్ చెప్పారు. వారి ఆ వ్యాఖ్యలు నేటి యువతరాన్ని జాతి నిర్మాణానికి పురిగొలిపే పిలుపులు.

8 గంటల వ్యవధి 10 నుంచి 12 గంటలకు పొడిగింపబడుతుంది. ఆ అదనపు గంటల్లో కూడా పూర్తిగా పనిచేస్తేనే మొదటి 8 గంటల్లో జరగాల్సినవి జరుగుతాయి. అదేవిధంగా డాక్టర్లు, న్యాయవాదులు, న్యాయమూర్తులు, వాస్తుశిల్పులు, శాస్త్రవేత్తలు, నటీనటులు మొదలైన వృత్తి నిపుణులు రోజుకు కేవలం 8 గంటలు మాత్రమే పని చేయరు. రోజుకు 12 గంటలు, అంతకంటే ఎక్కువ సమయం పనిచేసే వృత్తి నిపుణులు నాకు తెలుసు. అలాగే శని, ఆదివారాలు కూడా మామూలు రోజుల్లో మాదిరిగానే పనిచేసే వృత్తి నిపుణులు ఎంతో మంది ఉన్నారు. విజయాలు సాధించిన వృత్తి నిపుణులు సుదీర్ఘ పనిగంటలు గురించి ఫిర్యాదు చేయరు. వారు ఇష్టపూర్వకంగానే ఎక్కువ గంటల పాటు పనిచేస్తారు. కనుక 8—8—8 నియమం అనేది మానవులు అందరికీ ఒక విధంగా వర్తించదు.

ప్రతి రోజూ సాధారణ సమయం కంటే ఎక్కువ గంటల పాటు పని చేయడం నాకు సంతోషంగాను, సంతృప్తికరంగాను ఉంటుంది. 'పని'కి నా నిర్వచనంలో న్యాయవాదం (ప్రాక్టీసింగ్‌లా) పార్లమెంటరీ కార్యకలాపాలు, చదవడం, రాయడం, ప్రసంగించడం, ప్రజలు చెప్పే విషయాలు వినడం, పార్టీ కార్యకర్తలతో చర్చలు జరపడం, వివాహాలు, పుట్టినరోజు వేడుకలు లేదా పుస్తకావిష్కరణలు మొదలైన సామాజిక కార్యక్రమాలకు హాజరవడం మొదలైనవన్నీ చేరతాయి. నేను నిద్రపోకుండా ఉన్న సమయమంతటినీ 'పని చేసే సమయం' గానే పరిగణిస్తాను పని—జీవితం సమతౌల్యత అనేది ఏ వ్యక్తికి ఆ వ్యక్తి సొంతంగా, స్వతంత్రంగా సాధించుకోవల్సినది అని నేను విశ్వసిస్తున్నాను. పని—జీవితం మధ్య నేను ఒక సమతౌల్యతను పాటించగలుగుతున్నానని చెప్పేందుకు సంతోషిస్తున్నాను.

ఎన్ఆర్ఎన్, ఎస్ఎన్ఎస్‌లు తమ తమ వృత్తి జీవితాలలో గొప్ప విజయాలు సాధించినవారు. సమాజంలో ఒక ఉన్నత స్థానాన్ని సముపార్జించుకున్నవారు. కనుక భారతీయులు మామూలు కంటే ఎక్కువ గంటలు పనిచేసి తీరాలని చెప్పేందుకు వారు పూర్తిగా అర్హులు. ఈ విషయంలో వారిపై పలువురు చేసిన విమర్శలు, వ్యంగ్య దూషణలు అర్థం లేనివి. భారీ ఆదాయం, అపరిమిత ఆస్తులు ఉన్న స్త్రీ పురుషులు ఎంతో మంది నాకు తెలుసు. అయితే ఆ భాగ్య రాశులేవీ వారిలో ఎలాంటి అతిశయాలకు కారణమవలేదు. వారు చాలా నిరాడంబర జీవితాన్ని గడుపుతారు ఆహారాన్ని మితంగా తీసుకుంటారు. మంచి దుస్తులు ధరిస్తారు— అయితే మిరుమిట్లు గొల్పేవి కావు. ఎటువంటి పటాటోపాలకు పోకుండా తమను కలిసినవారందరితోనూ నమ్రంగా మాట్లాడతారు.

యువజనులు సుదీర్ఘ గంటల పాటు చేసే ఉత్పాదక కృషే ఒక వర్ధమాన దేశాన్ని నిజంగా సంపద్వంతం చేస్తుందని కోట్లాది ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరుస్తుందనే సత్యాన్ని ఆకాంక్షాభరిత యువతరం మనసుల్లో పాదుకొల్పేందుకే ఎన్ఆర్ఎన్, ఎస్ఎన్ఎస్‌లు ఆ విధంగా మాట్లాడారని నేను భావిస్తున్నాను. నిజానికి వారి ఆ వ్యాఖ్యలు నేటి యువతరాన్ని జాతి నిర్మాణానికి పురిగొలిపే పిలుపులు. ఆ వ్యాఖ్యలు ఎంత మాత్రం వివాదాస్పదమైనవి కావు. ప్రజలను ఆలోచించేలా అవి అనుద్దేశపూర్వకంగానే ప్రేరేపిస్తున్నాయి. పని—జీవితం మధ్య సమతౌల్యాన్ని అన్వేషిస్తున్న వారికి అదేమంత చెడ్డ విషయం కాదు కదా.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

అభివృద్ధిబాటలో వడివడిగా...!

ఆంధ్రప్రదేశ్ ప్రజలు అరవై నెలల చీకటి పాలన నుంచి విముక్తి పొంది కూటమి ప్రభుత్వానికి అఖండ విజయాన్ని ఇచ్చారు. కూటమి నేతలపై నమ్మకంతో ఓట్లేసి గెలిపించిన ప్రజల ఆశయాలకు తగ్గట్టుగా ఈ ఏడు నెలల కాలంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. ఒకవైపు రాష్ట్రంలో ఉన్న సహజ వనరులను, మానవ వనరులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు, మరోవైపు కేంద్రంతో సఖ్యతగా ఉంటూ ఒడుపుగా నిధులు సాధించుకోవడంలో సఫలీకృతం అవుతోంది.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిరాదరణకు గురైన అమరావతి, పోలవరం పనులు తిరిగి మొదలవ్వడం శుభ పరిణామం. రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు, పోలవరం తొలి దశ పనులకు రూ.12,157కోట్లు దక్కడంతో కూటమి ప్రభుత్వం ఊపిరి పీల్చుకుంది. రాజధాని అమరావతిలో రూ.11,467.27 కోట్ల వ్యయంతో పనులు మొదలైనాయి. ఎప్పుడో ఏడేళ్ల క్రితం పోలవరం నిర్వాసితులకు అప్పటి ప్రభుత్వం పునరావాస ప్యాకేజీ, ఇతర నిధులు చెల్లించింది. జగన్ రెడ్డి హయాంలో ఆ ఊసే లేదు. తాజాగా వివిధ కేటగిరీల కింద రూ.996.47 కోట్లను పోలవరం నిర్వాసితులకు కూటమి ప్రభుత్వం అందజేసింది. పోలవరం ప్రాజెక్టులో నీటి నిల్వను తగ్గించబోమని, గోదావరి జల వివాద ట్రిబ్యునల్ అవార్డు — 1980 ప్రకారం జలాశయ పూర్తి స్థాయి మట్టాన్ని 45.72 మీటర్ల మేర నిలిపేలా నిర్మాణాన్ని చేపడుతున్నామని పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో వైసీపీ నాయకుల నోళ్లు మూతబడ్డాయి.



ప్రజలకు మంచి చేయాలనే తపన, చిత్తశుద్ధి కలిగిన నాయకులు అధికారంలో ఉంటే రాష్ట్రం ఎంత అభివృద్ధి సాధించగలదో కూటమి ప్రభుత్వం చేసి చూపిస్తోంది.

ఇక రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పారిశ్రామిక, ఇంధన రంగాల్లో రూ.1,82,162 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపింది. వాటి ద్వారా 2,63,411 మందికి ఉపాధి లభిస్తుంది. అదేవిధంగా రాష్ట్రంలోని యువత నైపుణ్యాలను వెలికి తీసి వారే స్వయంగా పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన రాష్ట్రంలోని రోడ్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రూ.860.81 కోట్ల ఖర్చుతో 19,911 కి.మీ. మేర రోడ్ల గోతులు పూడ్చివేత కార్యక్రమాలు చేపట్టింది.

గత ప్రభుత్వ హయాంలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన ల్యాండ్ టైట్లింగ్ ఏక్ట్‌ను రద్దు చేయడమే కాకుండా ప్రజల భూ రక్షణ కోసం ఆంధ్రప్రదేశ్ భూ దురాక్రమణ నిషేధ చట్టం -2024ను ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. తొలి సంతకం డీఎస్సీ ఫైలుపై పెట్టడమే కాకుండా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నీ భర్తీ చేయడానికి ఏర్పాట్లు చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో రాజకీయ కక్షతో పేదలకు ఐదు రూపాయలకే కడుపు నింపే అన్నా క్యాంటీన్లను మూయించేయడం అందరికీ తెలిసిందే. కూటమి ప్రభుత్వం ఇప్పుడు తిరిగి 198 అన్నా క్యాంటీన్లను పునఃప్రారంభించి పేదల ఆకలి తీర్చడమే కాకుండా మరికొన్ని కొత్తవి కూడా ప్రారంభించే దిశగా ఆలోచిస్తుంది. ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు పేదలకు పెంచిన ఫించన్లను నెల మొదటి రోజునే లబ్ధిదారుల ఇంటి వద్దే ఇచ్చే కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నది. రైతుల వద్ద నుండి సేకరించిన ధాన్యానికి 24 గంటల్లోనే సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నది. ఇప్పటికే 4,15,066 రైతుల నుండి సేకరించిన 27 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి గాను రూ.6,083.69కోట్లు ఖాతాల్లో వేసి రైతుల కళ్ళల్లో వెలుగులు నిండేలా చేసింది.

వైసీపీ హయాంలో పాఠశాల విద్యలో అల్లకల్లోలం సృష్టించిన జీఓ- 117ను వచ్చే విద్యా సంవత్సరం నుంచి రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తరగతుల విలీనం, ఉపాధ్యాయుల సర్దుబాటు, టీచర్లకు వారానికి 42 పీరియడ్ల బోధన, ప్రాథమిక స్థాయిలో 20 మందికి ఒక టీచర్ లాంటి వాటిని అమలు చేసేందుకు తీసుకొచ్చిన ఈ జీఓతో పాఠశాల విద్య సర్వనాశనమైంది. అందుకే ప్రస్తుతం ఉన్న ఆరు రకాల బడుల స్థానంలో నాలుగు రకాల పాఠశాల వ్యవస్థను వచ్చే విద్యాసంవత్సరం నుండి అమలయ్యేలా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా మత్స్యకారులకు ఉరితాడుగా నిలిచిన జీవో 217ను రద్దు చేసింది. మత్స్యకారుల వేట నిషేధ భృతిని రెట్టింపు చేస్తూ రూ.10వేల నుంచి రూ.20వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అర్చకుల వేతనాన్ని రూ.15 వేలకు పెంచింది. ధూపదీప నైవేద్యాలకు ఇచ్చే మొత్తం రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచింది. దేవాలయాల్లో నాయీబ్రాహ్మణులకు రూ.15 వేల నుంచి రూ.25 వేలకు వేతనాన్ని పెంచింది.

చేనేత రంగం రోజురోజుకూ కునారిల్లుతున్న దశలో మేమున్నామంటూ కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. చేనేత కార్మికులకు అవసరమైన పరికరాలు అందచేస్తున్నది. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న 32 క్లస్టర్లతో పాటు కేంద్ర ప్రభుత్వం ఈ మధ్యనే రాష్ట్రానికి కొత్తగా ప్రకటించిన 10 చేనేత క్లస్టర్లను వినియోగించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అదేవిధంగా గంజాయి సాగు, రవాణాను పూర్తిగా నిర్మూలించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఒకవైపు ఇలా అభివృద్ధి, సంక్షేమంపై సమ దృష్టి పెట్టిన ప్రభుత్వం మరోవైపు గత ప్రభుత్వ తాలూకు మలినాలను తొలగించే విధంగా వ్యవస్థల ప్రక్షాళనపై దృష్టి సారించింది. అవినీతి, అక్రమార్కులను చట్టబద్ధంగా న్యాయస్థానాల ముందు నిలబెట్టి వారికి కఠిన శిక్షలు పడేలా చేస్తోంది.

ప్రజలకు మంచి చేయాలనే తపన, చిత్తశుద్ధి కలిగిన నాయకులు అధికారంలో ఉంటే రాష్ట్రం ఎంత అభివృద్ధి సాధించగలదో కూటమి ప్రభుత్వం చేసి చూపిస్తున్నది. రాష్ట్రంలో అందరికీ ఆరోగ్యం, సంపద, సంతోషమే లక్ష్యంగా స్వర్ణాంధ్ర 2047 విజన్‌తో కూటమి ప్రభుత్వం అద్భుతమైన ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసింది. అధినాయకుల ఆలోచనలకు, నిర్ణయాలకు, లక్ష్యానికి అనుగుణంగా పూర్తిస్థాయిలో ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం సహాయ సహకారాలు అందిస్తే 2029 నాటికి ఏపీ దేశంలోనే అభివృద్ధిలో ప్రథమ స్థానంలో ఉంటుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

○ కూసంపూడి శ్రీనివాస్
(జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి)

అమెరికాలో 'చెత్త' రాజకీయాలు!

అమెరికా అధ్యక్షునిగా డోనాల్డ్ ట్రంప్ రెండవసారి ప్రమాణ స్వీకారం చేసే సమయంలో కార్మికవర్గాన్ని ఆకర్షించబోయే శకటం ఒకటి ఇప్పుడు వార్తాంశం అయ్యింది. అది చెత్త సేకరించే వాహనం. చెత్త వాహనానికీ, దేశాధ్యక్షుని ప్రమాణ స్వీకారోత్సవానికీ మధ్య విడదీయరాని ఎన్నికల ప్రచార బంధమే పెనవేసుకుని ఉంది. దేశాధ్యక్షుడు జో బైడెన్ ఎన్నికల ప్రచార సమయంలో ట్రంప్‌ని, ఆయన మద్దతుదారులనీ తక్కువ చేసి చూపే ఉద్దేశంతో అంతా 'చెత్త' అని అభివర్ణించారు. ట్రంప్‌ని తక్కువ చేయాలని చూసిన బైడెన్ వ్యూహం బెడిసికొట్టింది. చెత్త అనే మాటని పట్టుకుని, ట్రంప్ వెంటనే చెత్త సేకరించే ఓ వాహనాన్ని నడుపుతూ తన ఎన్నికల ప్రచారానికి వినూతన ఒరవడి పెట్టారు. ఈ దృశ్యం కార్మిక వర్గాన్ని బాగా ఆకట్టుకుంది. ముఖ్యంగా మిషిగన్, పెన్సిల్వేనియాలో చెత్త నినాదం బ్రహ్మాండంగా పేలింది. ట్రంప్ విజయంలో ఈ రెండూ చాలా కీలకం. ఇప్పుడు ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆనాడు ఆయన నడిపిన చెత్త వాహనం డిట్రాయిట్ నుంచి వస్తోంది.


సరే, మరి మూడు రోజులలో గృహోన్ముఖం పట్టవలసిన అధ్యక్షుడు జో బైడెన్ నిజంగానే కొన్ని చెత్త మాటలు మాట్లాడారు. పోటీలో కొనసాగినట్టయితే తానే తప్పక విజేతగా నిలిచేవాడినన్నది ఆయన తాజాగా చేసిన ప్రకటన! ఇది ఎవ్వరూ ఊహించనిది! హర్షించనిదీ! చింత చచ్చినా పులుపు చావలేదంటే ఇదే మరి. అవతల కాలిఫోర్నియా కార్చిచ్చుకు తగలబడుతుంటే ఈ పిచ్చి ప్రేలాపన ఏమిటో?! ఈ పైత్యానికి కొనసాగింపుగా డెమొక్రటిక్ పార్టీలో సమైక్యతను కాపాడడానికే పెద్దలు చెప్పడంతో తాను పోటీ నుంచి తప్పుకున్నట్టు బైడెన్ మరో ప్రకటన చేశారు. ఇంతకీ ఎవరా పెద్దలు? ఆ పెద్దలు నడిపిన చెత్త రాజకీయం ఏమిటి? తమకోసం ఏమీ చేయలేదని నల్లవారి శాపనార్థాలు మూటకట్టుకున్న ఒబామా ఒక పెద్ద అయితే, ఈ రోజు కాకపోతే రేపైనా తన జీవిత సహచరిణి అమెరికా అధ్యక్షురాలు కాకపోతుందా అని ఆశగా ఎదురుచూసిన బిల్ క్లింటన్ మరో పెద్ద! నిజమే, ఈ పెద్దలు అతిగా జోక్యం చేసుకోకపోతే ఆ పార్టీకి ఇన్ని కష్టాలు ఉండేవి కావేమో! ఇప్పుడే కాదు, గతంలో కూడా ఈ పెద్దలు తమ పెద్దరికాన్ని పార్టీ మీద రుద్ది, పార్టీ మనుగడని బలహీనపరిచారు. వర్తమాన రాజకీయ చిత్రాన్నే ఉదాహరణగా తీసుకుంటే పార్టీ అభ్యర్థిగా జో బైడెన్‌ను ఎంపిక చేయడానికి ముందు ఆయనతో పోటీ పడిన వ్యక్తి బెర్నీ సాండర్స్ కార్మిక వర్గంలో మంచి పట్టున్న నాయకుడు. బెర్నీ ఎక్కడకు వెళ్లినా మావాడు మంచివాడు అనే పేరు సంపాదించుకున్నాడు. విద్యార్థి దశలో ఉద్యమాలలో పాల్గొని, ఆ తర్వాత కార్మిక వర్గంతో మమేకమై కార్మిక వర్గ పక్షపాతిగా పేరు తెచ్చుకున్నాడు. వెర్మాంట్ సెనెటర్‌గా కూడా మంచి పేరు తెచ్చుకున్నాడు. 2016లో హిల్లరీ క్లింటన్‌పై, మళ్లీ 2020లో జో బైడెన్‌పై అమెరికా అధ్యక్ష పదవికి తలపడ్డారు. అన్ని విధాలా డెమొక్రటిక్ పార్టీకి ఉజ్వలమైన భవిష్యత్తుకు

మరో మూడు రోజులలో గృహోన్ముఖం పడుతున్న జో బైడెన్ అత్యంత నిష్క్రియాశీలిగా అమెరికా చరిత్ర పుటలలో నిలిచిపోతున్నారు. అమెరికా అధ్యక్షులలో రెండుసార్లు అభిశంసనకు గురైన వ్యక్తి ట్రంప్ ఒక్కరే. ఆయన గత కాలపు అనుభవాల నుంచి గుణపాఠాలు నేర్చుకుని పాలిస్తారా? లేక మరింత దూకుడుగా ముందుకు పోతారా?

బంగారుబాట వేయగలిగిన సాండర్స్‌ను ఈ రెండు సందర్భాలలోనూ ఒబామా, క్లింటన్ ద్వయం బరి నుంచి ఉపసంహరించుకునేట్టు చెత్త యంత్రాంగం నడిపారు. సాండర్స్ నాయకత్వ లక్షణాలను కీర్తిస్తూనే ఆయనలోని ప్రగతిశీల భావజాలాన్ని ఒబామా, క్లింటన్ తిరస్కరించారు. సరే పెద్దలు చెబుతున్నారు కదా అని సాండర్స్ వెనుదిరిగారు. మరి హిల్లరీ క్లింటన్ ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారా అంటే అదీ లేదు. ఎన్నికల ప్రచారంలో చాలా సందర్భాలలో అవాకులు చెవాకులు మామూలైపోయాయి. రిపబ్లికన్లు అంటేనే దేశానికి అరిష్టం అన్నట్టు ఆమె మాట్లాడేవారు. వెళ్లిన ప్రతిచోటా డాబూ దర్పం ప్రదర్శించడం ఆమె విజయావకాశాలను బాగా దెబ్బ తీసింది. డెమొక్రటిక్ పార్టీకి పట్టం కడితే తమ ఉపాధి అవకాశాలపైన తామే నీళ్లు పోసుకున్నట్టు అవుతుందని యువత భావించడం, మరొక పక్క డోనాల్డ్ ట్రంప్ అరచేతిలో వైకుంఠం చూపించడంతో ట్రంప్ విజయం నల్లేరుపై నడకే అయ్యింది. కాని అంత అద్భుతమైన విజయం దరిమిలా మరోసారి ట్రంప్ అమెరికా అధ్యక్షునిగా చాలా తేలికగా గెలవవలసి ఉంది. కాని అలా జరగలేదు. 2020లో జరిగిన ఎన్నికలు జో బైడెన్‌ను అధికార పీఠంపై కూర్చోపెడితే, ఎన్నికల వ్యవస్థనే కూల్చే విఫలయత్నం ట్రంప్ చేశారు. ఆయన ఎంత బుకాయించినా, ఆయన పిలుపు మేరకే ఆయన మద్దతుదారులు వాషింగ్టన్ డి.సి.లోని కేపిటల్‌పై దాడి చేయడం మాయని మచ్చే. తన నడవడికతో, అతి వాచాలత్వంతో తన గొయ్యి తానే తవ్వుకునే పరిస్థితిని ట్రంప్ సృష్టించుకున్నాడు. అంతటితో అమెరికా చరిత్రలో ఆయన శకం ముగిసినట్టు అనిపించింది.







కాని అధ్యక్ష భవనంలో అడుగుపెట్టిన నాటి నుంచే జో బైడెన్ మతి స్థిమితం లేని మాటలు, చేతలూ కొట్టొచ్చినట్టు కనిపించాయి. బైడెన్ చేష్టలు పార్టీకి చెరుపు చేస్తాయని మొదటి వారంలోనే బెర్నీ సాండర్స్ డెమొక్రటిక్ పార్టీని హెచ్చరించారు. అయినా పెద్దలు కళ్లు తెరవలేదు. ఫలితంగా బైడెన్ ఇప్పుడు అత్యంత నిష్క్రియాశీలిగా అమెరికా చరిత్ర పుటలలో నిలిచిపోతున్నారు. ఆయన క్రిందపడడం, దేశాధినేతలు, దౌత్య ప్రతినిధులూ ఉన్నప్పుడు వారివైపు గాక అటు ఇటు దిక్కులు చూడడం వంటివి వయసుకు సంబంధించిన సమస్యలు కావచ్చు. వాటితో ఒక దేశాధ్యక్షుని పాలనా సామర్థ్యాన్ని అంచనా వేయడం సబబు కాదు గాని, ఈ నాలుగేళ్లూ ఏ విషయంపైనా స్పష్టంగా తన అభిప్రాయాన్ని చెప్పలేని వ్యక్తిగా అమెరికన్ ప్రజలు భావిస్తున్న మాట మాత్రం నిజం. ఎన్నో అపవాదులను మూటకట్టుకుని కూడా జో బైడెన్ చివరి రోజులలో తన కుమారుని సహా ఎందరికో క్షమాభిక్ష పెట్టడం దుస్సాహసాలలో మహా దుస్సాహసం! 2014 నుంచి 2024 మధ్య కాలంలో కుమారుడు హంటర్ బైడెన్ చేసిన ఎన్నో నేరాలకు తండ్రి క్షమాభిక్ష పెట్టడం చరిత్రలో ఎన్నడూ కనీవినని దృశ్యం. ఇంతకన్నా చెత్త నిర్ణయం మరొకటి ఉండదు. ఇంకా బ్యాంకులను మోసం చేసినవాళ్లకి కూడా జో బైడెన్ పదుల సంఖ్యలో క్షమాభిక్ష పెట్టడం మరో చెత్త నిర్ణయం. ఒక పక్క ఎన్నికలలో గెలుపొందిన అభ్యర్థి వలసలకు అడ్డుకట్ట వేస్తానంటుంటే, మరో పక్క బైడెన్ తీసుకున్న మరో నిర్ణయం చూసి అందరూ భృకుటి ముడుస్తున్నారు. ఎల్ సాల్వడార్ సహా కొన్ని దేశాల నుంచి అమెరికాకు వలస వచ్చినవారికి సంవత్సరంన్నర పాటు తాత్కాలిక రక్షిత హోదా కల్పిస్తూ చివరి రోజులలో బైడెన్ తీసుకున్న నిర్ణయం కూడా సహజంగానే వివాదాస్పదంగా మారింది.

సరే, వర్తమానానికి కాస్త వెనక్కి వెళ్తే, కమలా హ్యారీస్ ఎంపిక విషయంలో సైతం ఈ పెద్దలు చేసిన జాప్యం ఆక్షేపణీయమే. మళ్ళీ నేనే... మళ్ళీ నేనే... అధ్యక్షుణ్ణి అవుతా... అంటూ బైడెన్ చిన్న పిల్లలు చాకొలెట్ కోసం మారాము చేసినట్టు అంటుంటే, ఇప్పటికే మీ వల్ల పార్టీ పరువు, పదవి పరువూ హడ్సన్ నదిలో కలిసిపోయాయి, ఇక చాలు, బుద్ధిగా కూర్చోమ్మని చెప్పారా? లేదు. చివరివరకూ బైడెన్ ఆడింది ఆటగా పాడింది పాటగా అనుమతించారు. దేశాధ్యక్ష పదవికి ఒకసారి ఏ పార్టీ వారు ఎన్నికయినా అమెరికన్ ప్రజలు సంప్రదాయబద్ధంగా రెండోసారి కూడా వారినే ఎన్నుకుంటారు -ఎప్పుడో తప్ప! అలాగే తాను కూడా మళ్లీ గెలుస్తానని బైడెన్ ఆశ పడి ఉండవచ్చు. తప్పు లేదు. కాని పరిస్థితిని అంచనా వేయవలసిన పెద్దలకు ఏమైంది? తమ అభ్యర్థి విజయావకాశాలపై పార్టీ పెద్దలకు బ్రహ్మాండమైన విశ్వాసం ఉందా అంటే అటువంటిదేమీ లేదు. అయినా వారెవరూ బైడెన్‌ను కట్టడి చేయలేదు. ఈలోగా ట్రంప్‌పై ఆగంతకుని తూటా పేలడం, అది ఆయన తలను రాసుకుంటూ పక్కనుంచి పోవడం, అంతలోనే ట్రంప్ చేతులు పైకెత్తి నేనున్నాను అంటూ పైకి లేవడం... అంతా లిప్తకాలంలో జరిగిపోయాయి. ఇక ట్రంప్ అప్పటి నుంచి వెనుకకు తిరిగి చూసుకోనవసరం లేకపోయింది. అప్పటి ఎన్నికల ఊపు చూసి డెమొక్రటిక్ పార్టీ శ్రేణులు బెంబేలు ఎత్తిపోయి పార్టీకి ఒక్క పెన్నీ కూడా రాల్చని పరిస్థితి తలెత్తాక గాని పార్టీ పెద్దలు కళ్లు తెరవలేదు. వారికి జ్ఞానోదయం అయ్యేలోగా పరిస్థితి చేజారిపోయింది. అప్పుడు కమలా హ్యారిస్‌ను ఎంపిక చేసి, ఇక నువ్వు ఇంట్లో కూర్చునే సమయం వచ్చిందని బైడెన్‌కు నచ్చజెప్పారు. కమల కష్టపడింది గాని ఉపయోగం లేని పరిస్థితి. చేతులు కాలాక ఆకులు పట్టుకుని లాభం ఏమిటన్నది అర్థం అయ్యేసరికి పుణ్యకాలం కాస్తా గడిచిపోయింది!

ఇప్పుడు, ట్రంప్ మళ్లీ విజయగర్వంతో అమెరికా అధ్యక్ష పీఠాన్ని రెండవసారి అధిరోహించబోతున్నారు. రిపబ్లికన్ పార్టీ శ్రేణులకు ఇంతకు మించిన పండుగ మరొకటి లేదు. ట్రంప్ మళ్ళీ పోటీ అయినా చేయగలరా అన్న అనుమాన దశ నుంచి ఆయన నాలుగేళ్ళ విరామం తరువాత ఏకంగా మళ్ళీ ఆ పీఠాన్ని అధిరోహిస్తున్నారు. ఆయన వస్తున్నారంటేనే కొందరికి సింహస్వప్నం... మరి కొందరికి ఆక్షేపణీయం. అమెరికా అంటే భూతల స్వర్గం అనుకుని ఏదో రకంగా ఆ గడ్డమీద కాలు పెట్టాలని ఆశ పడేవారికి అది ఇక ముందు అంత తేలిక కాదు. కాని ఆయనపై దాదాపు 4000 పైనే రకరకాల కేసులు ఉన్నాయి. ఇన్ని కేసులున్న దేశాధ్యక్షుడు మరొకరు లేరు. ఈ మధ్యే కోర్టు ఆయనకు దేశాధ్యక్షునిగా కొన్ని మినహాయింపులు ప్రకటించినా, అవి అధికార పరిధిలో ఆయన తీసుకునే నిర్ణయాలకే తప్ప వ్యక్తిగతంగా గతంలో చేసిన తప్పిదాలకు వర్తించవని కూడా స్పష్టం చేసింది. అమెరికా అధ్యక్షులలో రెండుసార్లు అభిశంసనకు గురైన వ్యక్తి ట్రంప్ ఒక్కరే. అయితే రెండుసార్లూ ఆయనను సెనేట్ కాపాడింది. మరి భవిష్యత్తు ఎలా ఉంటుందో? ఆయన గత కాలపు అనుభవాల నుంచి గుణపాఠాలు నేర్చుకుని పాలిస్తారా? లేక మరింత దూకుడుగా ముందుకు పోతారా?

■ ---జగన్
(సీనియర్ జర్నలిస్ట్)

ఆయుధాలతో వచ్చి.. ఖాతాదారులనూ బెదిరించి..

కర్ణాటకలో పట్టపగలే బ్యాంకు దోపిడీ

» తుపాకీ గురిపెట్టి రూ.10 కోట్లకు పైగా అపహరణ

» పోలీసులు ఏం చేస్తున్నారు?: సీఎం సీరియస్



ఖాతాదారులను విచారిస్తున్న పోలీసులు

బెంగళూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని బీదర్‌లో సెక్యూరిటీ వాహనంపై కాల్పులు జరిపి, ఏటీఎంలో పెట్టాల్సిన రూ.93 లక్షలను దోచుకువెళ్లిన మరుసటి రోజే.. దుండగులు మంగళూరు సమీపంలో ఏకంగా బ్యాంకును దోచుకోవడం కలకలం రేపుతోంది. దక్షిణ కన్నడ జిల్లా ఉళ్లాల తాలూకా కేసీ రోడ్డులోని కోటికారు వ్యవసాయ సేవా సహకార సంఘం(వీఎస్ఎస్) బ్యాం కులో శుక్రవారం మధ్యాహ్నం మరో భారీ చోరీ జరిగిం ది. ఆయుధాలతో వచ్చిన దుండగు లు బ్యాంకులో ఉన్న రూ.10 కోట్ల కు పైగా నగదు, ఆభరణాలను దో చుకుపోయారు. ఐదుగురు దొంగలు ఫియట్‌కారులో వచ్చి బ్యాంకులోకి ప్రవేశించారు. తుపాకులు, తల్వార్‌లతో ఖాతాదారులు, ఉద్యోగులను బెదిరించారు. క్యాషియర్ వద్ద ఉన్న నగదును తీసుకున్నారు. సేఫ్ రూం నుంచి అప్పుడే బయటకు వచ్చిన మేనేజర్‌కు తుపాకీ గురిపెట్టి, సేఫ్ రూమ్‌ను తెరిపించారు. లాకర్లలోని నగదు, బంగారు ఆభరణాలను దోచుకుని వచ్చిన కారులో పరారయ్యారు. తమను వెంబడిస్తే కాల్చివేస్తామని హెచ్చరించారు. విషయం తెలియగానే పెద్ద ఎత్తున పోలీసు బలగాలు అక్కడికి చేరుకున్నాయి.కేవలం పది నిమిషాల వ్యవధిలో దోపిడీ చేశారని బ్యాంకు ఉద్యోగి రామచంద్ర తెలిపారు. దోపిడీకి వచ్చినవారు 30 ఏళ్ల లోపు వారేనని, హిందీలో మాట్లాడారని తెలిపారు. కాగా, బ్యాంకు దోపిడీపై సీఎం సిద్దరామయ్య తీవ్రంగా మండిపడ్డారు. పోలీసులు ఏం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

అఫ్జల్‌గంజ్ కాల్పుల ఘటన.. నిందితుల వేటలో పోలీసులు

హైదరాబాద్ సిటీ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కర్ణాటక బీదర్‌లో, హైదరాబాద్ అఫ్జల్‌గంజ్‌లో కాల్పులతో కలకలం సృష్టించిన దోపిడీ దొంగల కోసం హైదరాబాద్ పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర ఆధ్వర్యంలో 10 పోలీసు బృందాలు రంగంలోకి దిగాయి. బీదర్‌లో వివిధ ఏటీఎంలలో నింపాల్సిన రూ.93 లక్షలను పథకం ప్రకారం కొట్టేసిన దొంగలు, అడ్డొచ్చిన సెక్యూరిటీ గార్డులపై కాల్పులు జరిపి, పరారయ్యారు. డబ్బును బ్యాగుల్లో సర్దుకొని హైదరాబాద్ మీదుగా రాయ్‌పూర్ వెళ్లేందుకు పథకం వేసిన దొంగలు అఫ్జల్‌గంజ్‌లో రోషన్ ట్రావెల్స్ బస్సును ఎక్కడానికి ప్రయత్నించారు. బస్సెక్కుతుండగా లగేజీని చెక్ చేసుకోవాలని జహంగీర్ (40) అనే బస్సు క్లీనర్ చెప్పగా ఆగ్రహించిన దొంగలు తమ వద్ద తుపాకీతో అతడిపై కాల్పులు జరిపారు. అనంతరం అక్కడి నుంచి పారిపోయారు. అనంతరం దుండగులు.. స్వీకార్ హోటల్ వద్ద ఆటో ఎక్కి, సిద్దంబర్ బజార్, ఎంజే మార్కెట్, ట్యాంక్‌బండ్ మీదుగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌వైపు పారిపోయినట్లు సీసీ ఫుటేజీ ద్వారా పోలీసులు గుర్తించారు.

ఉపాధి కూలీలకు సూచనలివ్వండి: డైరెక్టర్

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పేదల జీవనోపాధులను మరింత మెరుగుపరిచేందుకు, ఉపాధి హామీ పథకంలో వినూత్న కార్యక్రమాలను చేపట్టేందుకు తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని ఉపాధి హామీ పథకం డైరెక్టర్ షణ్ముఖ్ కుమార్ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను కోరారు. శుక్రవారం పంచాయతీరాజ్ కమిషనరేట్ కార్యాలయంలో గిరిజన ప్రాంతాల్లో పనిచేసే స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. కూలీలకు రోజువారీ వేతనం రూ.300 పొందడానికి, శ్రమశక్తి సంఘాల ఏర్పాటులో అవగాహన పెంపొందించాలని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను కోరారు.

విజయవాడలో కిటకిట



విజయవాడ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

ప్రత్యేక రైలు ఖాళీగా..

విశాఖపట్నం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి చర్లపల్లికి వేసిన జన సాధారణ్ ప్రత్యేక రైలు శుక్రవారం ఇక్కడి నుంచి ఖాళీగా వెళ్లింది. ఉదయం 10 గంటలకు బయలుదేరిన ఈ రైలులో దాదాపుగా అన్ని కోచ్‌లూ ఖాళీగానే ఉన్నాయి. ఇటీవల దక్షిణ మధ్య రైల్వే అధికారులు సికింద్రాబాద్ సమీపాన చర్లపల్లిలో కొత్త టెర్మినల్ ప్రారంభించారు. దాంతో అక్కడి వరకు వెళ్లేలా కొన్ని రైళ్లను నడుపుతున్నారు. విశాఖపట్నం-చర్లపల్లి మధ్య ఆవిధంగానే సంక్రాంతి ప్రయాణికుల సౌకర్యార్థం జన సాధారణ్ రైళ్లు నడపనున్నట్టు ప్రకటించారు. వీటిలో ప్రయాణానికి టికెట్లు ముందుగా తీసుకోవాల్సిన అవసరం లేదు. స్టేషన్‌కు వెళ్లి కొనుక్కుంటే సరిపోతుంది. ఇందులో ఏసీ కోచ్‌లు, స్లీపర్ కోచ్‌లు, జనరల్ కోచ్‌లు కూడా ఉంటాయి. ఏయే ప్రాంతాల మధ్య ఏయే రైళ్లు ఏ సమయానికి నడుస్తాయో అధికారులు ముందుగానే ప్రచారం చేశారు. అయితే ఈ



ఖాళీగా ఉన్న విశాఖ-చర్లపల్లి ట్రైన్

విషయం చాలామందికి తెలియక రైళ్లను ఉపయోగించుకోలేకపోతున్నారు. విశాఖ-చర్లపల్లి రైలు విషయంలోనూ శుక్రవారం అదే జరిగిందని రైల్వే వర్గాలు పేర్కొన్నాయి. రెగ్యులర్‌గా ఆయా మార్గాల్లో రైళ్లు నడిచే సమయానికే స్టేషన్‌కు రావడం వల్ల ఈ కొత్త రైలు విషయం తెలిసి ఉండకపోవచ్చని కూడా అధికార వర్గాలు అభిప్రాయపడ్డాయి.

బ్రిజేష్ ట్రైబ్యునల్-2పై 'స్టే' కోరదాం!

(మొదటి పేజీ తరువాయి)

జరగనుంది. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టులో వాదనలను బలంగా వినిపించడం ద్వారా బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్-2ను రద్దు చేయాలని కోరడం, లేదంటే స్టే విధించాలని పట్టుబడతామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. మరోవైపు, కేంద్ర మార్గదర్శకాలపై ఏపీ, తెలంగాణ రాష్ట్రాల వాదనలను వినేందుకు బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్-2 కూడా సిద్ధమైంది. గురువారం దీనికి సంబంధించి రెండు తెలుగు రాష్ట్రాలకు ట్రైబ్యునల్ కొన్ని సూచనలు చేసింది. కేంద్ర గెజిట్ మేరకు సెక్షన్-3 కింద రాష్ట్రాల పిటిషన్లపై వాదనలు వింటామని స్పష్టం చేసింది. తర్వాత రాష్ట్ర విభజన చట్టం పరిధిలోని సెక్షన్ 89 పరిధిలోకి వచ్చిన ప్రాజెక్టులు, వాటికి కేటాయించిన కృష్ణా జలాలపై సమీక్షిస్తామని పేర్కొంది. కాగా, ట్రైబ్యునల్ సూచనలే తమకు విజయం దక్కేలా చేశాయని తెలంగాణ ప్రకటించుకుంది. కృష్ణా జలాల పంపకాలపై తమ వాదనలు నెగ్గాయని పేర్కొంది. అయితే.. సెక్షన్ 89 రాష్ట్రానికి రక్షణ కవచంగా ఉంటుందని.. ప్రాజెక్టులు లేకుండా కేవలం పరివాహక ప్రాంతంపై ఆధారపడి కేటాయింపులు ఉండవని ఏపీ ప్రభుత్వం చెబుతోంది.

తెలంగాణ వాదన అసంబద్ధం: నిపుణులు

ట్రైబ్యునల్ కాలపరిమితిని పెంచుతూ ప్రాజెక్టుల వారీగా కృష్ణా జలాల కేటాయింపులపై పునఃసమీక్షించాలన్న కేంద్రం నిర్ణయాన్ని ఏపీ జల వనరుల నిపుణులు తొలి నుంచీ వ్యతిరేకిస్తున్నారు. పోలవరం నుంచి గోదావరి జలాలను కృష్ణాకు మళ్లించడం వల్ల తెలంగాణకు కృష్ణా జలాల్లో 45 టీఎంసీల వాటా వస్తుందని తెలంగాణ చెప్పడాన్ని కూడా రాష్ట్ర జల వనరుల నిపుణులు తప్పుబడుతున్నారు. ఇవి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చెందినవిగా తెలంగాణ గుర్తించలేకపోతోందని అంటున్నారు.

'కృష్ణా జలాల'పై జగన్ మొద్దు నిద్ర

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

కృష్ణా జలాలపై బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ఇచ్చిన ఆదేశాలను పునఃసమీక్షించేలా 2023లో కేంద్ర ప్రభుత్వం గెజిట్‌ను విడుదల చేసినప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్ మొద్దు నిద్ర పోయారు. 'ఇదేంటి? ఇంత అన్యాయం చేస్తున్నారేంటి?' అని మాట వరసకు కూడా అనలేదు. దీంతో కేంద్ర నిర్ణయం మేరకు బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ తన కార్యకలాపాలను ప్రారంభించింది. అయితే, అధికారం కోల్పోయాక జగన్‌కు రాష్ట్ర ప్రయోజనాలు గుర్తొచ్చాయి. ఇప్పుడు గుండెలు బాదుకుంటూ.. తన హయాంలో జరిగిన దానిని కూడా కూటమి ప్రభుత్వానికి అంటగడుతూ ఆయన విమర్శలు గుప్పించారు. బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్.. కేంద్ర గెజిట్‌లోని సెక్షన్ 3 ప్రకారం వాటాలపై వాదనలు వింటామని గురువారం స్పష్టం చేసింది. ట్రైబ్యునల్ ఈ నిర్ణయం తీసుకుందో లేదో.. కృష్ణా జలాల్లో హక్కులు సాధించేశామంటూ తెలంగాణ నేతలు చేసుకున్న ప్రచారానికి జగన్ రోత పత్రిక వంతపాడటం మొదలుపెట్టింది. ట్రైబ్యునల్ ఆదేశాలపై తప్పంతా సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానిదేనని మాజీ సీఎం జగన్ పేర్కొన్నారు. అయితే, వాస్తవానికి వైసీపీ హయాంలోనే కేంద్రం గెజిట్ విడుదల చేసింది. కానీ, అప్పట్లో జగన్ నోరుమెదపలేదు. ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయంపై పన్నెత్తు మాట అనలేదు. సుప్రీం కోర్టులో కేసు వేసినా, బలమైన వాదనలు వినిపించలేదు. ఈ విషయాన్ని జలవనరుల రంగానికి చెందినవారు గుర్తు చేస్తున్నారు.



రాజధానిలో కొండవీటి వాగు వద్ద ఇరిగేషన్ ప్లానింగ్ అధికారులతో చర్చిస్తున్న ఏడీసీ సీఎండీ లక్ష్మీపార్థసారథి

రాజధాని పనులకు సన్నద్ధం కండి

» అధికారులకు ఏడీసీ సీఎండీ లక్ష్మీపార్థసారథి ఆదేశం

విజయవాడ/తుళ్లూరు/కృష్ణలంక, జనవరి 17(ఆంధ్రజ్యోతి): రాజధానిలో వెంటనే చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సన్నద్ధం కావాలని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) సీఎండీ లక్ష్మీపార్థసారథి అధికారులను ఆదేశించారు. శుక్రవారం అమరావతి ప్రాంతంలో ఆమె పర్యటించారు. విపత్తు నివారణ పనులకు సంబంధించి క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన పనులను ఆమె పరిశీలించారు. కొండవీడువాగు, పాలవాగు, గ్రావిటీ కాలువలను తనిఖీ చేశారు. ప్రకాశం బ్యారేజీ సమీపంలోని కొండవీడువాగు పంపింగ్ స్టేషన్‌ను పరిశీలించి.. ప్రతిపాదిత రెండో దశ పంపింగ్ స్టేషన్ పనులపై జలవనరులశాఖ అధికారులతో చర్చించారు. అనంతరం నీరుకొండ, అనంతవరం ప్రాంతాల్లో పర్యటించారు. మార్గమధ్యలో ఎన్-9 రహదారిని కూడా పరిశీలించి.. రాజధానిలో చేపట్టాల్సిన రోడ్ల పనులపైనా అధికారులతో చర్చించారు.

ప్రస్తుత ఎస్ఎస్ఆర్ రేట్లతో టెండర్లు

రాజధాని అమరావతిలో కొండవీటివాగు, పాలవాగు, గ్రావిటీ కెనాల్ పనుల టెండర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన ఎస్ఎస్ఆర్(స్టాండర్డ్ షెడ్యూల్ ఆఫ్ రేట్స్), స్టాండర్డ్ డేటా ప్రకారం రూపొందించడం జరిగిందని ఏడీసీ సీఎండీ లక్ష్మీపార్థసారథి తెలిపారు. మట్టి ఒక క్యూబిక్ మీటర్ తవ్వడానికి ప్రస్తుతం అమలులో ఉన్న రూ.150 చెల్లించవలసి ఉందన్నారు.

ఓర్వకల్లుకు భారీ వరం!

దేశంలోనే తొలి 'ఈవీ పార్కు'

పీపుల్‌టెక్‌తో సర్కారు ఒప్పందం

అమరావతి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే మొట్టమొదటి ప్రైవేట్ ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) పార్క్ కర్నూలు జిల్లా ఓర్వకల్లు మొబిలిటీ వ్యాలీలో ఏర్పాటు కానుంది. 1,200 ఎకరాల విస్తీర్ణంలో రూ.1,800 కోట్ల పెట్టుబడితో ఈ పార్క్‌ను అభివృద్ధి చేయడానికి పీపుల్ టెక్ ఎంటర్ ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ ముందుకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకుంది. రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్‌ల సమక్షంలో పీపుల్ టెక్ గ్రూప్ సీఈవో టీజీ విశ్వప్రసాద్, ఏపీ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు సీఈవో సాయికాంత్ వర్మ ఎంవోయూపై శుక్రవారం సంతకాలు చేశారు. ఈ పార్క్‌లో ఆర్‌అండ్‌డీ సెంటర్లు, టెస్టింగ్ ట్రాక్‌లు, ప్లగ్ అండ్ ప్లే ఇండస్ట్రియల్ స్పేస్ తదితర సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. వీటికి అదనంగా గృహనిర్మాణం, ఆస్పత్రులు, విద్యా సంస్థలు, మాల్స్ వంటి సదుపాయాలను కూడా కల్పించనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా రూ. 13 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా 25 వేల మందికి ఉద్యోగావకాశాలను కల్పించనున్నారు. ఒప్పందం అనంతరం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పీపుల్ టెక్ ప్రతినిధులు భేటీ అయ్యారు. ఈ ఒప్పందం ఓ మైలురాయి అవుతుందని పవన్ అన్నారు.



మంత్రులు లోకేశ్, టీజీ భరత్ సమక్షంలో పీపుల్ టెక్ సంస్థతో ఒప్పందం చేసుకుంటున్న అధికారులు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధనపై దృష్టిపెట్టండి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : 'స్వర్ణాంధ్ర-2047' లక్ష్యంగా సుస్థిరాభివృద్ధికి నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. లక్ష్యాల సాధనకు చేపట్టిన చర్యలపై శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ, వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, డ్వామా, కో-ఆపరేటివ్ తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం 'స్వర్ణాంధ్ర-2047' లక్ష్యంగా రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు దిశా నిర్దేశం చేయడం జరిగిందన్నారు. దేశానికి వెన్నెముక అయిన రైతాంగం అభివృద్ధి చెందితే మిగిలిన రంగాలు మరింత అభివృద్ధి చెందే అవకాశం వుంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో మరింత అవగాహన కల్పించాలన్నారు. రైతులు రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడకం తగ్గించి పచ్చిరొట్ట ఎరువులు వాడేలా చర్యలు తీసుకోవాలన్నారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన అధికారులు సిబ్బంది బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సందేహాల నివృత్తికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 131 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు వుండగా కేవలం 69 సంఘాలను మాత్రమే ఎరువులు, పురుగుమందులను విక్రయిస్తున్నాయని మిగిలిన వాటిలో విక్రయాలు నిర్వహించి రైతులకు అందుబాటులో వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రబీ సీజన్‌లో రైతులకు అవసరమైన వరి, మినుము, మొక్కజొన్న వంటి విత్తనాలు సిద్ధంగా వుంచాలన్నారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధ్వర్యంలో ఉపాధి పథకం కింద జిల్లాలో 475 మినీ గోకులాల షెడ్ల నిర్మాణం లక్ష్యం కాగా 523 నిర్మాణాలను చేపట్టి 335 నిర్మాణాలను పూర్తి చేయడం అభినందనీయమని రైతులు కోరిన చోట షెడ్లు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా పశుగ్రాసం పెంపకాన్ని చేపట్టి రైతులకు పశుగ్రాసాన్ని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి బాలాజీకుమార్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి దివాకర్ బాబు, జిల్లా మార్క్‌ఫెడ్ అధికారి కె.నాగమల్లిక, జిల్లా మార్కెటింగ్ అధికారి మంగమ్మ తదితరులున్నారు.

రేషన్ డీలర్ల తుది ఎంపిక జాబితా విడుదల

మొగల్రాజపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ ఆర్డీవో కార్యాలయ పరిధిలో ఉన్న విజయవాడ, జి.కొండూరు, మైలవరం, ఇబ్రహీంపట్నం మండల పరిధిలో ఖాళీగా ఉన్న రేషన్ దుకాణాలకు నోటిఫికేషన్ జారీచేసి పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికలు పూర్తి చేసి జాబితాను కార్యాలయంలో ఉంచినట్టు ఆర్డీవో కావూరి చైతన్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 111 షాపులకు నోటిఫికేషన్ ఇవ్వగా 7 షాపులపై హైకోర్టులో కేసులున్నందున, 7 షాపులకు దరఖాస్తులు రానందున మొత్తం 14 షాపులను నోటిఫికేషన్ నుంచి మినహాయించినట్టు తెలిపారు. దరఖాస్తులురాని షాపులకు మరోసారి నోటిఫికేషన్ జారీ చేస్తామని, కోర్టు దావాలో ఉన్న 7 షాపులకు కోర్టు ఆదేశాలను అనుసరించి తదుపరి చర్యలు తీసుకుంటామని ప్రకటనలో తెలిపారు. ఫలితాలు వెల్లడించిన రేషన్ దుకాణాలకు సంబంధించి అభ్యంతరాలు ఉన్నయడల 25వ తేదీలోగా లిఖిత పూర్వకంగా కార్యాలయంలో ఇవ్వాలని తెలిపారు.

ప్రతి ఇంటా సౌర వెలుగులు లక్ష్యం

» సూర్యఘర్ కనెక్షన్ల మంజూరులో జిల్లాను అగ్రగామిగా నిలపాలి

» రెండు లక్షల గృహాలకు రిజిస్ట్రేషన్‌లను వారంలోగా పూర్తిచేయండి

» లక్ష్య సాధనలో పొదుపు సంఘాల మహిళల భాగస్వామ్యం కీలకం

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రతి ఇంటా 'సూర్యఘర్' వెలుగులు నింపాలన్న ఉద్దేశంతో రెండు లక్షల సోలార్ విద్యుత్ కనెక్షన్లు అందించేందుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను వారంలోగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి 'సూర్యఘర్' పథకం ద్వారా సౌర విద్యుత్ కనెక్షన్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి సంబంధిత అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సూర్యఘర్ పథకం ద్వారా జిల్లాలో రెండు లక్షల గృహాలకు సౌర విద్యుత్ కనెక్షన్లు అందించాలనే లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటి వరకు 45 వేలమంది సౌర విద్యుత్ కనెక్షన్లకు పేర్లను నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. ఇందులో 35 వేలు గ్రామీణ ప్రాంతంలో, 10 వేలు పట్టణ ప్రాంతంలో ఉన్నాయన్నారు. పట్టణ ప్రాంతాలలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసేలా మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వం అధిక రాయితీనిచ్చి తక్కువ పెట్టుబడితో ఉచితంగా సౌర విద్యుత్‌ను పొందవచ్చునన్న విషయాన్ని ప్రజలకు వివరించి లక్ష్య సాధనకు చర్యలు తీసుకోవాలన్నారు. రూ.2 లక్షల విలువైన 3 కేడబ్ల్యూ సోలార్ ప్యానెల్ కొరకు ఓసీ, బీసీ వర్గాలకు చెందిన స్వయం సహాయక బృందాలు రూ.78 వేల రాయితీతో ఇంటి పైకప్పుపై ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. రూ.20 వేలు లబ్దిదారు వాటాపోను మిగిలిన మొత్తాన్ని తక్కువ వడ్డీతో బ్యాంకులు రుణంగా మంజూరు చేసేందుకు సిద్ధంగా వున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి పూర్తి రాయితీతో సౌర విద్యుత్ కనెక్షన్ పొందే అవకాశం వుందన్నారు. లక్ష్య సాధనలో స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రభుత్వ ఉద్యోగులు భాగస్వామ్యం కీలకమన్నారు. వారంరోజుల లోపు లక్ష్య సాధనకు చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగపరంగా అన్నివిధాలా సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా వున్నామన్నారు. సొంత ఇల్లు వుండి, కరెంటు కనెక్షన్ ఉన్న వారెవరైనా డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.పీఎంసూర్యఘర్.జీఓవీ.ఇన్ ద్వారా సులభంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని, సమీప సచివాలయం లేదా విద్యుత్ కార్యాలయం వంటి వాటిని సంప్రదించి కూడా వారి సహాయంతో రిజిస్ట్రేషన్ చేసుకొనేలా ప్రజలలో చైతన్యం తీసుకురావాలని కలెక్టర్ లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్సులో డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, జిల్లా విద్యుత్‌శాఖ ఎస్‌ఈ ఎ.మురళీమోహన్, జిల్లాకు చెందిన మున్సిపల్ కమిషనర్లు, మున్సిపల్, విద్యుత్‌శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌తో పరిసరాల పరిశుభ్రత

కృష్ణలంక : ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ద్వారా జిల్లాను పచ్చదనం పరిశుభ్రతలో అగ్రగామిగా నిలిపేందుకు అధికారులు కృషిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. శుక్రవారం వీడియా కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ సూచనల మేరకు ప్రతి నెలా 3వ శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌గా పాటించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతను పాటిస్తానని ప్రతిజ్ఞ తీసుకొని ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమాలు ఎప్పటికప్పుడు సోషల్ మీడియా, ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేయాలన్నారు. జిల్లాలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్‌లో భాగంగా గ్రామ, మండల పంచాయితీ స్థాయి అధికారులు తొలగించిన చెత్త రవాణాకు వాహనాలు, యంత్రాలు దాతల సహకారంతో సమకూర్చుకొనేలా కృషి చేయాలన్నారు. అవసరమైతే మండలంలోని ఇతర గ్రామ పంచాయితీలకు చెందిన పారిశుధ్య సిబ్బందిని చెత్తకుప్పల తొలగింపు కోసం వినియోగించుకోవాలన్నారు. పారిశుధ్య పని ప్రారంభించే ముందు, చెత్తను తొలగించిన అనంతరం ఫొటోలు తీసి జిల్లా అధికారులకు పంపాలని కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహ, డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీపీవో లావణ్య, డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని, డ్వామా పీడీ ఎ.రాము, డీఎస్‌వో పాపారావు, మున్సిపల్ కమిషనర్లు, మండల అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

మిగులు ధాన్యం.. మిల్లర్ల భోజ్యం!

సమర్థవంతంగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టిన కూటమి ప్రభుత్వం స్వల్ప విరామం తీసుకోవడంతో వ్యాపారులు అన్నదాతను దోచుకోవడం ప్రారంభించారు. నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలో పలుచోట్ల కల్లాల్లోనే పెద్ద మొత్తంలో ధాన్యం నిల్వలు ఉండటంతో వచ్చినకాడికి మిల్లర్లకు అమ్ముకుంటున్నారు. కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కక రైతున్నలు దళారుల చేతిలో మోసపోతూనే ఉన్నారు.

» కొనుగోళ్ల విరామంతో నష్టపోతున్న రైతులు

» డివిజన్‌లో ఇంకా కల్లాలోనే ధాన్యం నిల్వలు

» దిక్కుతోచని స్థితిలో దళారులకు విక్రయం

» త్వరలో కొనుగోళ్లు చేపడతాం : ఆర్డీవో

(ఆంధ్రజ్యోతి-నందిగామ) : ఈ ఏడాది కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. క్వింటాకు రూ.2,320 మద్దతు ధర అందించి భారీగా కొనుగోళ్లు చేసింది. అధికారుల నిరంతర పర్యవేక్షణలో రైతులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా జాగ్రత్తలు చేపట్టింది. రెండురోజుల వ్యవధిలోనే రైతులకు సొమ్ములు చెల్లించింది. నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలో 19500 టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. లక్ష్యాల మేర కొనుగోళ్లు పూర్తిచేసిన ప్రభుత్వం ఇటీవల సేకరణ నిలిపివేసింది. ప్రభుత్వం అన్నదాతకు మద్దతు ధర అందిస్తుండటంతో దోచుకోవడం సాధ్యం కాక వ్యాపారులు మిన్నకుండిపోయారు. అదను కోసం ఉన్న వ్యాపారులకు ప్రభుత్వ కొనుగోళ్లు నిలిపివేయడం కలసి వచ్చింది. పండించిన ధాన్యాన్ని నిల్వ ఉంచుకొనే అవకాశం లేక పోవడంతో పాటు మసుగు వాతావరణంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రైతుల ఇబ్బందులను సొమ్ము చేసుకొనేందుకు వ్యాపారులు క్వింటాకు రూ.300 నుంచి రూ.400 వరకు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల అన్నదాతలకు భారీ నష్టం వాటిల్లుతోంది. ప్రభుత్వం కొనుగోళ్లు నిలిపివేయడంతో దిక్కుతోచని స్థితిలో దళారులకు బలవుతున్నారు. వ్యవసాయశాఖ అధికారుల అంచనా ప్రకారం.. నందిగామ డివిజన్‌లో సుమారు ఐదువేల టన్నులకు పైగా ధాన్యం ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఇందులో కొంతమేర ఇప్పటికే కల్లాలో ఉండగా, మిగిలిన ధాన్యం నూర్పిళ్లు జరపాల్సి ఉంది. ధాన్యం నిల్వలు రైతుల వద్ద ఉన్నందున ప్రభుత్వం మరికొంత కాలం కొనుగోళ్లు కొనసాగించాలని కోరుతున్నారు.



కల్లాలో నిల్వ ఉంచిన ధాన్యం

ధాన్యం కొనుగోళ్లు చేపడతాం..

- ఆర్డీవో కె.బాలకృష్ణ

రైతుల వద్ద ఉన్న పూర్తి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. డివిజన్‌లోని రైతుల ఇబ్బందులపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులతో మాట్లాడగా.. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా మరో ఏడువేల టన్నుల కొనుగోలుకు అంగీకరించారు. ఆన్‌లైన్ ఓపెన్ కాగానే కొనుగోళ్లు ప్రారంభిస్తాం. రైతులు ఎవరూ తక్కువ ధరకు ధాన్యం అమ్ముకోవద్దు. నందిగామ డివిజన్‌లో పూర్తి ధాన్యం కొనుగోలు చేపట్టే అవకాశం ఉంది.



రోడ్డు ప్రమాద బాధితులను కారులో ఆసుపత్రికి తరలిస్తున్న మంత్రి పార్థసారథి

మానవత్వం చాటుకున్న మంత్రి సారథి

పామర్రు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారిపై కనుమూరు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో అకురాతి కాంతారావు(36), అకురాతి శ్రీనివాసరావులు(30)లు తీవ్రంగా గాయపడి స్పృహ కోల్పోయారు. అదే సమయంలో స్వగ్రామం నుంచి అమరావతిలో కేబినెట్ సమావేశానికి వెళుతున్న మంత్రి కొలుసు పార్థసారథి తన కాన్వాయని నిలుపుదల చేసి క్షతగాత్రులను ఉయ్యూరు ఆసుపత్రికి కారులో తరలించి మానవత్వం చాటుకున్నారు. మంత్రి వేరే కారులో అమరావతికి వెళ్లారు.

తల్లిని దూరం చేశాడనే హత్య?

» నిందితుడి కోసం గాలింపు

(ఆంధ్రజ్యోతి-జగ్గయ్యపేట) : తన తల్లితో అక్రమ సంబంధం పెట్టుకోవడమే కాకుండా, కనీసం తల్లిని చూసేందుకు కూడా అంగీకరించకపోవటంతోనే దివ్యాంగుడు యర్రంశెట్టి ఆంజనేయులును నిందితుడు నరేష్ హత్య చేసినట్టు పోలీసులు నిర్ధారణకు వచ్చినట్టు తెలుస్తోంది. ఆంజనేయులు అడ్డు తొలగిస్తే తప్ప తమ కుటుంబం కలిసి జీవించే అవకాశం లేదనే ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్టు తెలుస్తోంది. గురువారం రాత్రి 9 గంటల సమయంలో దివ్యాంగుడు, పురపాల కసంఘ కాంట్రాక్టు కార్మికుడు యర్రంశెట్టి ఆంజనేయులును బి.సురేష్ కమ్మకొడవలితో నరికి హత్య చేసిన విషయం తెలిసిందే. రైతు బజార్‌లో కోడిగుడ్ల కౌంటర్ పెట్టిన సమయంలో నరేష్ తల్లితో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఆ తర్వాత నరేశ్ కుటుంబం కకావికలైంది. దీంతో ఆంజనేయులుపై కక్ష పెంచుకున్న నరేష్ అతడి అడ్డు తొలగించుకోవాలని హత్యకు పథకం రచించాడు. గురువారం రాత్రి తల్లి వద్దకు వచ్చిన ఆంజనేయులుతో నరేష్‌కు ఘర్షణ జరిగింది. బైక్‌పై ఆంజనేయులును వెంబడించి కత్తితో దాడి చేసి పరారైయ్యాడు. పోలీసులు నరేష్ కోసం గాలిస్తున్నారు. శుక్రవారం ఆంజనేయులు భౌతికకాయానికి పోస్ట్‌మార్టమ్ అనంతరం బంధువులకు అప్పగించారు. త్వరలోనే కేసులో మిస్టరీని ఛేదిస్తామని జగ్గయ్యపేట సీఐ పి.వెంకటేశ్వర్లు చెప్పారు.



విశాఖ ఉక్కుకు గనులు కేటాయించాలి: రామకృష్ణ

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): 'విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి రూ.17,000 కోట్ల అప్పులున్నాయని కేంద్రం చెబుతోంది. అలాంటప్పుడు కేవలం రూ.11,500 కోట్లు కేటాయించడం వల్ల సమస్య పరిష్కారం కాదు. ఆ ప్లాంట్‌ను కాపాడేందుకు శాశ్వత పరిష్కారం చూపాలి' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. 'విశాఖ ఉక్కుకు ముడి ఇనుము గనులు కేటాయించి, సెయిల్‌లో విలీనం చేయాలి. విశాఖ ఉక్కుకు గనులు కేటాయించకుండా అనకాపల్లిలో దాదాపు రూ.70 వేల కోట్లతో మిట్టల్ ఏర్పాటు చేయనున్న ప్రైవేట్ స్టీల్ ప్లాంట్‌కు కేటాయిస్తే.. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆగదు' అని రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అమిత్ షా పర్యటనకు వ్యతిరేకంగా రేపు వామపక్షాల నిరసనలు

కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటనను వ్యతిరేకిస్తూ ఈనెల 19న రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు 8 వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి.

తొక్కిసలాట, భక్తుల మృతికి గవర్నర్ కార్యదర్శి, సీఎం ఎలా బాధ్యులవుతారు?

- ప్రతివాదుల జాబితా నుంచి వారిని తొలగించండి
- పిటిషనర్‌కు హైకోర్టు ఆదేశం... 22కు వాయిదా

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం టోకెన్లు జారీ సందర్భంగా జరిగిన తొక్కిసలాట, భక్తుల మృతి వ్యవహారంపై న్యాయ విచారణకు ఆదేశించాలని వేసిన పిల్‌లో గవర్నర్ కార్యదర్శిని, ముఖ్యమంత్రిని ప్రతివాదులుగా చేర్చడంపై హైకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. తొక్కిసలాట ఘటనకు వారు ఎలా బాధ్యులౌతారని ప్రశ్నించింది. ప్రభుత్వం తరఫున ప్రధాన కార్యదర్శి ఇతర అధికారులు ప్రతివాదులుగా ఉన్నారని గుర్తు చేసింది. రిజిస్ట్రీ సూచించిన విధంగా గవర్నర్ కార్యదర్శి, ముఖ్యమంత్రి పేర్లను ప్రతివాదుల జాబితా నుంచి తొలగించాలని పిటిషనర్‌ను ఆదేశించింది. రిజిస్ట్రీ లేవనెత్తిన అభ్యంతరాలకు కట్టుబడి తదనుగుణంగా వ్యాజ్యంలో సవరణలు చేయాలని స్పష్టం చేసింది. విచారణను వచ్చే బుధవారం, 22వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ కె.సురేశ్ రెడ్డి, జస్టిస్ కుంచం మహేశ్వరరావుతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు

- టీడీపీ గ్రీవెన్స్‌లో బాధితుల ఏకరవు

అమరావతి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): భూ సమస్య గురించి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు బాధితులు టీడీపీ నేతల వద్ద ఏకరవు పెట్టారు. శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు, బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చిరాంప్రసాద్ అర్జీలు స్వీకరించారు. గత ప్రభుత్వంలో తన భూమిని వైసీపీ నాయకుడు ఆక్రమించుకోవడంపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని చిత్తూరు జిల్లా కాళికాపురం గ్రామస్థుడు వీరరాఘవులు వాపోయారు. సర్వే చేసి, తన భూమి తనకు దక్కేలా చూడాలని కోరారు. తమకు వారసత్వంగా వచ్చిన భూమిని ఆన్‌లైన్ చేయమంటే అధికారులు పట్టించుకోవడం లేదని పల్నాడు జిల్లా పెదనెమలిపురికి చెందిన శంకరయ్య ఫిర్యాదు చేశారు. ధర్మారావు సహకార చక్కెర ఫ్యాక్టరీలో పని చేసినందుకు 2013 నుంచి 2022 వరకు రావాల్సిన జీతాల సొమ్మును ఇప్పించాలని వర్కర్లు విజ్ఞప్తి చేశారు.

జగన్ భద్రత పిటిషన్‌పై విచారణ వాయిదా

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కుటుంబసభ్యులతో కలిసి లండన్ వెళ్తున్న తనకు భద్రత బృందంలో మహబూబ్ బాషాను కేటాయించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ మరోసారి హైకోర్టులో విచారణకు వచ్చింది. శుక్రవారం కోర్టు విచారణ ప్రారంభమైన వెంటనే ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) యతీంద్రదేవ్ స్పందిస్తూ... ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. అందుకు అంగీకరించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కుంచం మహేశ్వరరావు విచారణను వారం రోజులకు వాయిదా వేశారు. కాగా, ఈ వ్యాజ్యం పెండింగ్‌లో ఉండగానే జగన్ తన కుమార్తె స్నాతకోత్సవం కోసం లండన్ వెళ్లారు.

తులసిబాబు దర్యాప్తునకు సహకరించడం లేదు

- పోలీసుల తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వాదనలు
- రఘురామ ఇంప్లీడ్ పిటిషన్‌ను అనుమతించిన కోర్టు

అమరావతి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ, శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుపై సీఐడీ కస్టడీలో జరిగిన దాడి వ్యవహారంలో పిటిషనర్ కామేపల్లి తులసిబాబు దర్యాప్తునకు సహకరించడం లేదని పోలీసుల తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు శుక్రవారం హైకోర్టుకు నివేదించారు. రఘురామను చిత్రహింసలకు గురిచేసిన వ్యక్తుల వివరాలు వెల్లడి కావాలంటే తులసిబాబు కస్టోడియల్ విచారణ అవసరమని వివరించారు. సీఐడీ కస్టడీలో రఘురామను కొట్టిన వ్యక్తుల్లో తులసిబాబు ఉన్నారన్నారు. కస్టడీ పిటిషన్ పెండింగ్‌లో ఉండగా తులసిబాబు బెయిల్ పిటిషన్‌పై విచారణను కొనసాగించడం సమంజసం కాదన్నారు. పిటిషనర్‌ను విచారణకు పిలిచిన వెంటనే హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారని, మేజిస్ట్రేట్ జ్యుడీషియల్ కస్టడీ ఉత్తర్వులు జారీచేయగానే అత్యవసరంగా బెయిల్ పిటిషన్ వేశారని వివరించారు. పోలీస్ కస్టడీ పిటిషన్ పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో విచారణను వాయిదా వేయాలని పోసాని కోరారు. రఘురామ తరపు న్యాయవాది వీవీ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ.. ప్రతివాదిగా చేర్చుకొని వాదనలు వినిపించేందుకు అవకాశమివ్వాలని కోరుతూ అనుబంధ పిటిషన్ వేశామన్నారు. దాన్ని అనుమతించాలని కోరారు. కౌంటర్ వేసేందుకు సమయమివ్వాలని, విచారణను సోమవారానికి వాయిదా వేయాలని కోరారు. తులసిబాబు తరఫున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపిస్తూ.. రఘురామ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను అనుమతిస్తే తమకు అభ్యంతరం లేదన్నారు. అయితే విచారణను వాయిదా వేయాలని కోరడం సరికాదన్నారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కుంచం మహేశ్వరరావు... రఘురామరాజు ఇంప్లీడ్ పిటిషన్‌ను అనుమతిస్తూ.. తులసిబాబు బెయిల్ పిటిషన్‌పై విచారణను ఈ నెల 20కి వాయిదా వేశారు.

ఎడతెగని 'మంచు' ఎపిసోడ్

- ఎంబీయూ ఘటనపై పరస్పర ఫిర్యాదులు.. ఇరువర్గాలపై కేసులు

చంద్రగిరి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మంచు కుటుంబంలో వివాదాల ఎపిసోడ్ కొనసాగుతూనే ఉంది. తాజాగా తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం ఎ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయం (ఎంబీయూ) వద్ద జరిగిన ఘటనపై ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. నటుడు మంచు మనోజ్, ఆయన భార్య భూమా మౌనికరెడ్డి ఈనెల 15న శ్రీవిద్యానికేతన్ విద్యాసంస్థలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే కోర్టు ఆదేశాల మేరకు వెళ్లకూడదని పోలీసులు చెప్పడంతో అక్కడి నుంచి డెయిరీ ఫామ్ వద్ద ఉన్న తన తాత, నానమ్మల సమాధుల వద్దకు వెళ్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మనోజ్ దౌర్జన్యంగా అక్కడున్న సిబ్బందిని బూతులు తిడుతూ, రాళ్లతో దాడి చేసి, లోపలికి ప్రవేశించారని మోహన్‌బాబు పీఏ చంద్రశేఖర నాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మనోజ్, మౌనికారెడ్డి, వారి అనుచరులు పళణిరాయల్, పవన్, మరికొంత మంది గుర్తు తెలియని వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. అదేవిధంగా తన భార్యతో కలసి సంక్రాంతి పండుగకు శ్రీవిద్యానికేతన్ విద్యాసంస్థ వద్దకు వస్తే ఎంబీయూ సిబ్బంది విజయసింహ, సురేంద్ర, బాలాజీ, సారథి, కిరణ్, రవిశేఖర్, హేమాద్రి, జీఎం చంద్రశేఖర్, కేవీఎస్ మణి, మరి కొంతమంది అడ్డుకుని తమపై దౌర్జన్యం చేశారని మనోజ్ ఫిర్యాదు చేశారు. మనోజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



నం.1గా విశాఖ ఉక్కు

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను దేశంలోనే నంబర్ వన్ ప్లాంట్‌గా మార్చడాన్ని ఒక సవాలుగా తీసుకుంటామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గత ఏడునెలలుగా ఎన్నో సార్లు ఈ ప్లాంట్ పునరుద్ధరణ గురించి చర్చించారని, ఒక దశలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో తాను, చంద్రబాబు అర్ధరాత్రి రెండు గంటలవరకు చర్చించామని తెలిపారు. తొలుత అభ్యంతరాలు వ్యక్తం చేసిన నిర్మలా సీతారామన్ ఆ తర్వాత మెత్తబడ్డారని, ప్రధాని నరేంద్రమోదీ ఎంతో ఉదారంగా వ్యవహరించారని చెప్పారు. విశాఖ ఉక్కు పునరుద్ధరణలో భాగంగా ఇది కేబినెట్ మంజూరుచేసిన తొలి ప్యాకేజీ మాత్రమేనని, తదుపరి దశల్లో కూడా నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. ప్రస్తుత ప్యాకేజీలో భాగంగా రూ. 10,300 కోట్లు ఈక్విటీ మూలధనంగా ఉంటుందని, రూ. 1140 కోట్ల వర్కింగ్ కాపిటల్ రుణాన్ని నాన్ క్యుములేటివ్ ప్రిఫరెన్స్ షేర్ కాపిటల్‌గా మారుస్తామని కుమారస్వామి చెప్పారు. ఇప్పటికే రూ. 35వేల కోట్ల మేరకు స్టీల్ ప్లాంటుకు అప్పులు ఉన్నాయనీ, బ్యాంకుల నుంచి వర్కింగ్ కాపిటల్ కోసం రుణాలు తీసుకునే పరిమితిని కూడా దాటిపోయిందని, బ్యాంకులు మరిన్ని రుణాలు ఇచ్చే ప్రసక్తి లేదని ఆయన చెప్పారు. 2024 జూన్ నాటికి కేపెక్స్ రుణం, వడ్డీలను కూడా చెల్లించలేని పరిస్థితిలో ఉన్నదని



ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కుమారస్వామి చిత్రంలో రామ్మోహన్, శ్రీనివాస వర్మ

కుమారస్వామి తెలిపారు. విశాఖ స్టీలు ప్లాంట్ కు ఒడిశాలో సొంత గనులు ఉన్నాయని, అక్కడ ఇంకా తవ్వకాలు ప్రారంభించలేదన్న ఆయన, ముడి ఇనుము సమస్యను కూడా అధిగమిస్తామని చెప్పారు. జనవరిలోనే రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లు పూర్తి ఉత్పత్తిని ప్రారంభిస్తాయని, ఈ ఏడాది ఆగస్టు నాటికి మూడో బ్లాస్ట్ ఫర్నేస్ ఉత్పత్తి ప్రారంభిస్తుందని ఆయన వెల్లడించారు. 2017 జాతీయ ఉక్కు విధాన లక్ష్యాలను స్టీల్ ప్లాంటు అందుకుంటుందన్న ధీమాను కుమారస్వామి వ్యక్తం చేశారు.

ప్యాకేజీ తయారైంది ఇలా..

"ఉక్కు మంత్రిగా నేను బాధ్యతలు చేపట్టిన గత ఏడు నెలల్లో స్టీల్ ప్లాంటు విషయమై ఎన్నో సమీక్షా సమావేశాలు నిర్వహించాను. గత ఏడాది జూలైలో ప్లాంట్‌ను సందర్శించాను. ఎస్ బీఐ, ఇతర బ్యాంకుల అధికారులను కలిసి ప్లాంట్‌ను పునరుద్ధరించే విషయం చర్చించాను. కానీ అప్పటికే ప్లాంట్ ఎన్‌పీఏలు పెరిగిపోయాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కలిసి మాట్లాడితే, ఆమె కూడా అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఏమైనా ఆమె అనుభవజ్ఞురాలు.. నేను జూనియర్‌ని. గత ఏడాది అక్టోబరు 9న సీఎం చంద్రబాబుతో కలిసి నేను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను మరోసారి కలిశాను. రాత్రి రెండు గంటల వరకు సమావేశం జరిగింది. చివరకు నిర్మలా సీతారామన్ కొంత ఆర్థిక సహాయం చేసేందుకు అంగీకరించారు. తర్వాత ఎస్‌బీఐ క్యాప్ అధికారులతో ఒక కమిటీని వేశాం. ప్లాంటు పునరుద్ధరణపై మెకాన్ సంస్థ సలహా కూడా తీసుకున్నాం. ఆ తర్వాత మంత్రుల బృందం సమావేశమై పలు సలహాలు ఇచ్చింది. చివరకు రూ. 11,440 కోట్ల ప్యాకేజీ నిర్ణయమైంది" అని కేంద్ర ఉక్కుమంత్రి కుమారస్వామి వివరించారు. 93 శాతం సామర్థ్యాన్ని సాధించడాన్ని ఆర్థిక శాఖ తమకు లక్ష్యంగా విధించిందని, ఈ ఏడాది ఆగస్టు కల్లా దానిని సాధిస్తామని చెప్పారు. కాగా, ఇవే వివరాలతో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రెస్ నోట్ విడుదల చేశారు. స్టీల్ ప్లాంటు విషయంలో ప్రధాన సమస్య ముడి ఇనుము అని, నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో (ఎన్ఎండీసీ) దీనిపై చర్చిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కేంద్రం ప్యాకేజీతో స్టీల్ ప్లాంటు కష్టాలు తొలగిపోతాయన్నారు.

ఈ ఘనత చంద్రబాబుదే

- ప్రధాని మోదీకి కృతజ్ఞతలు: రామ్మోహన్ నాయుడు
- ప్రజల్లో అసంతృప్తి తొలగిపోయింది: శ్రీనివాస వర్మ

న్యూఢిల్లీ, విశాఖపట్నం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): గత ఆరు నెలలుగా ప్రధాని మోదీని సీఎం చంద్రబాబు ఎప్పుడు కలిసినా విశాఖ ఉక్కుకు న్యాయం చేయాలని కోరారని, స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణకు ఆర్థిక ప్యాకేజీ సాధించిన ఘనత ఆయనకే దక్కుతుందని కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అన్న సత్యాన్ని గుర్తించి ఉదారంగా వ్యవహరించిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. ఉక్కు మంత్రి కుమారస్వామి ప్లాంట్‌ను సందర్శించి కార్మికులు, అధికారులతో చర్చించారని తెలిపారు. ఏపీకి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి మాదిరే కుమారస్వామి పనిచేశారని ప్రశంసించారు. రాష్ట్ర ప్రజల తరఫున ఆయనకు కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. గత పదేళ్లుగా ఉత్తరాంధ్ర ఎంపీగా స్టీల్ ప్లాంట్ సమస్యలను తాను పార్లమెంట్‌లో లేవనెత్తానని చెప్పారు. కాగా, ప్రజల మనోగతాన్ని అర్థం చేసుకున్న ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్, ఉక్కు మంత్రి కుమారస్వామితోపాటు సీఎం చంద్రబాబు కృషి వల్ల ఈ నిధులు మంజూరయ్యాయని సహాయమంత్రి శ్రీనివాస వర్మ అన్నారు. కేంద్రం ప్రకటించిన ప్యాకేజీతో స్టీల్‌ప్లాంట్‌కు పూర్వవైభవం వస్తుందని ఎంపీ ఎం శ్రీభరత్ అన్నారు.

కార్మిక సంఘాల హర్షం

విశాఖ ఉక్కు కర్మాగారానికి కేంద్రం ఆర్థిక ప్యాకేజీ ప్రకటించడం పట్ల కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఆఖరి దశలో ఉన్న కర్మాగారానికి ఆర్థిక ప్యాకేజీ ఊపిరి పోసినట్లేనని స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కేవీడీ ప్రసాద్ అన్నారు. విశాఖ ప్లాంట్‌కు కేంద్రం సాయం ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే దీని వల్ల సమస్య పరిష్కారం కాదని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు చెప్పారు. ఏడాదికి అవసరమైన ముడి ఇనుముకే రూ.18 వేల కోట్లు కావాలన్నారు. విశాఖ ఉక్కుకూ సొంత గనులు కేటాయించాలని, ప్రైవేటీకరణ చర్యలు మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో రాష్ట్రంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు కృషి చేయడం మంచి విషయమని, స్టీల్‌ప్లాంటుకు పూర్వ వైభవం తెచ్చే దిశగా మరింత కష్టించి ముందుకు సాగుతామని ఉక్కు గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కె.ఎస్.ఎన్.రావు అన్నారు. ప్యాకేజీతో తాత్కాలికంగా కొంత మేర ఉపయోగం ఉన్నప్పటికీ ఇది శాశ్వత పరిష్కారం మాత్రం కాదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ అన్నారు. కర్మాగారంపై ప్రైవేటీకరణ కత్తి వేలాడుతూనే ఉందని, సెయిల్‌లో విలీనం చేస్తే ప్లాంటుకు లాభం ఉంటుందని చెప్పారు. సమస్య శాశ్వత పరిష్కారానికి కేంద్రం ముందుకురావాలన్నారు.

కూటమి 'ఉక్కు' పట్టు



- మాట నిలుపుకొన్న ప్రభుత్వ నేతలు
- కార్మికోద్యమానికి తొలినుంచీ బాసట
- దీక్ష చేసిన పల్లా.. గంటా రాజీనామాతో ఊపు

విశాఖపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటును ప్రైవేటీకరిస్తామని కేంద్రం నాలుగేళ్ల క్రితం ప్రకటించడంతో విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమం ప్రారంభమైంది. కార్మిక సంఘాలన్నీ ఏకమై పోరాట కమిటీగా ఏర్పడ్డాయి. ఆ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని ర్యాలీలు, ధర్నాలు, దీక్షలు చేశాయి. ఇప్పటికీ స్టీల్ ప్లాంటు గేటు వద్ద దీక్షా శిబిరాలు నడుస్తున్నాయి. కార్మిక సంఘాల నేతలు అటు ఢిల్లీలోను, ఇటు రాష్ట్రంలోను అన్ని పార్టీల నాయకులను కలిసి సాయం చేయాలని అప్పట్లో కోరారు. అయితే, నాటి సీఎం జగన్మోహన్‌రెడ్డి అనేక సార్లు ఢిల్లీ వెళ్లినా విశాఖ ఉక్కు సమస్యను కేంద్రం వద్ద ప్రస్తావించలేదు. సాయం కోరలేదు. ఎన్నికల ముందు కూటమి నాయకులు పల్లా శ్రీనివాసరావు, శ్రీభరత్, పవన్‌కల్యాణ్, తదితరులు స్టీల్‌ప్లాంటు ప్రాంతానికి వెళ్లి కార్మిక సంఘాల నాయకులతో మాట్లాడి, అండగా ఉంటామని హామీఇచ్చారు. అంతకుముందు విశాఖ ఉత్తర నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తన పదవికి రాజీనామా చేశారు. టీడీపీ నేత పల్లా శ్రీనివాసరావు దీక్ష చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ తదితరులు విశాఖ ఉక్కు సమస్యను ఢిల్లీ పెద్దలకు తెలియజేసి భారీగా ఆర్థిక సాయాన్ని కోరారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామిని విశాఖపట్నం రప్పించారు. ఇక్కడి సమస్యలు చూపించారు. ఇలా కూటమి నేతలు అంతా స్టీల్‌ప్లాంటు కార్మికులకు అండగా నిలబడి, ఇచ్చిన హామీని నెరవేర్చారు. తొలుత రెండు దఫాలుగా రూ.1,650 కోట్ల ఆర్థిక సాయం అందించారు. ఇప్పుడు రివైవల్ ప్యాకేజీ కింద రూ.11,440 కోట్ల సాయం అందేలా చేశారు.

అసాధ్యాన్ని సుసాధ్యం చేశాం: చంద్రబాబు

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఈ ఏడు నెలల్లో అసాధ్యాన్ని సుసాధ్యం చేసిందని సీఎం చంద్రబాబు అన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పునరుజ్జీవానికి కేంద్రం రూ.11,440 కోట్లు కేటాయించడంపై ప్రధాని మోదీకి, ఎన్డీయే ప్రభుత్వానికి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటీ నెరవేరుస్తున్నామని చెప్పారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో సీఎం మీడియాతో మాట్లాడారు. స్టీల్ ప్లాంట్ కోసం ఆర్థిక మంత్రి, ఉక్కుశాఖ మంత్రితో ఎన్నోసార్లు చర్చించానని చెప్పారు. 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనేది ఒకప్పటి నినాదం. ఇప్పుడు విశాఖ ఉక్కు మనందరి సెంటిమెంట్. స్టీల్‌ప్లాంట్‌కు ఎప్పుడు ఇబ్బందులు వచ్చినా టీడీపీ ప్రభుత్వమే ముందుకొచ్చి ఆదుకొంది. స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకొనేందుకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఈ ఏడు నెలల్లో చేసిన ప్రయత్నాలు ఫలించాయి' అని చంద్రబాబు పేర్కొన్నారు.

బిగుస్తున్న ఉచ్చు!

(మొదటి పేజీ తరువాయి)

సీఐడీలో సాంకేతికత అభివృద్ధి పేరుతో రూ.75లక్షలు నొక్కేశారని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డీజీకి డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఫిర్యాదు చేశారు. సునీల్ ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన బ్యాంకు లావాదేవీల వివరాలు అందజేశారు. మరోవైపు వైసీపీ ప్రభుత్వంలో సునీల్ చేసిన అరాచకాలపై రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. అమాయకులపై అక్రమ కేసులు బనాయించడంతో పాటు సోషల్ మీడియాలో హైకోర్టు న్యాయమూర్తులపై అసభ్యకర పోస్టులు పెట్టిన వైసీపీ మూకలను వదిలేసిన సునీల్‌పై పలు ఫిర్యాదులు వచ్చాయి. వీటిపై విచారణకు ఆదేశించిన ప్రభుత్వం... విచారణ అధికారులుగా రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ హరీశ్ కుమార్ గుప్తాను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తనపై వచ్చిన ఆరోపణలకు సునీల్ కుమార్ ఇచ్చిన సమాధానం సంతృప్తికరంగా లేదని, ఆయనపై అభియోగాలను విచారించి సాధ్యమైనంత త్వరగా నివేదిక ఇవ్వాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో సునీల్ అరెస్టు తప్పదని పోలీసు ఉన్నతస్థాయి వర్గాలు చెబుతున్నాయి.

అడ్డగోలుగా అరాచకాలు

వైసీపీ హయాంలో సీఐడీ ఏడీజీగా సునీల్ కుమార్ నియమితులయ్యారు. అప్పటి సీఎం జగన్ నిర్ణయాలపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినవారిపై ఏకంగా దేశద్రోహం కేసు నమోదు చేసి కస్టోడియల్ టార్చర్‌కు గురిచేసేవారు. ప్రతిపక్షాలకు చెందినవారు నోరెత్తితే తీవ్రంగా పరిగణించి అర్ధరాత్రి వారి ఇంట్లోకి చొరబడి స్టేషన్‌కు ఎత్తుకొచ్చేవారు. సీఐడీ కస్టడీలో నాటి వైసీపీ ఎంపీ రఘురామ రాజును టార్చర్ చేసినవారిలో కామేపల్లి తులసిబాబు కూడా ఉన్నారన్న ఆరోపణలపై ఇటీవల పోలీసులు ఆయన్ను అరెస్టు చేశారు. విచారణ సందర్భంగా తులసిబాబు కీలక అంశాలు వెల్లడించినట్లు తెలిసింది. అందులో సునీల్ అక్రమాల గురించిన వివరాలు కూడా ఉండటంతో వాటిని నిర్ధారించుకున్న పోలీసులు ప్రభుత్వానికి సమాచారం అందించారు. దీంతో ఇప్పటికే సీఐడీ మాజీ ఏడీజీపై విచారణకు ఆదేశించిన ప్రభుత్వం... రఘురామ ఫిర్యాదును పరిగణనలోకి తీసుకుని సునీల్‌పై చర్యలకు సిద్ధమవుతోంది.

బిల్లు కావాలా... కేసు కావాలా?

సునీల్ కుమార్ సీఐడీ ఏడీజీగా ఉన్న సమయంలో ఆ విభాగంలో సాంకేతికత పరిజ్ఞానం అభివృద్ధి కోసం గుజరాత్‌కు చెందిన కంపెనీతో రూ.కోటిన్నరకు ఒప్పందం కుదిరింది. ఆ కంపెనీ ఏపీకి చెందిన వ్యక్తికి సబ్ కాంట్రాక్టు ఇచ్చింది. పని పూర్తిచేసిన తర్వాత బిల్లు కోసం సదరు కాంట్రాక్టర్ సునీల్ కుమార్‌ను కలిశారు. వెంటనే ఆయన ఫోన్ తీసుకుని 'నీకు బిల్లు కావాలా.? డ్రగ్స్ సరఫరా చేస్తున్నావనే కేసు కావాలా?' అంటూ బెదిరించారు. బిత్తరపోయిన సబ్ కాంట్రాక్టర్ తనను వదిలేస్తే చాలని వేడుకున్నారు. అయితే ఎప్పటికైనా రికార్డులో ఉండాలని వేరే మార్గంలో ఆయన వద్ద రూ.75లక్షలు తీసుకుని అధికారికంగా అతని ఖాతాలో జమ చేశారు. దీనిపై సమాచారం సేకరించిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఆ మొత్తం ఎవరెవరి ఖాతాలకు చేరాయో ఆధారాలతో సహా ఏసీబీకి అందజేశారు. ఐపీఎస్ అధికారిగా పని చేస్తూ తరచూ దుబాయ్‌కి వెళ్లిన సునీల్ కుమార్ బినామీలతో కలసి కుమారుల పేరిట అక్కడ వ్యాపారాలు చేస్తున్నట్లు ఏసీబీకి రాసిన లేఖలో రఘురామ పేర్కొన్నారు. ఆయన బ్యాంకు లావాదేవీలు, ప్రయాణ వివరాలను సమర్పించారు. 'సునీల్ కుమారులకు వ్యాపారాలు చేసేందుకు డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయి? ఆ వ్యాపార వివరాలు ప్రభుత్వానికి తెలియజేశారా?' అనే అనుమానాలు లేవనెత్తారు. హైదరాబాద్ శివారులో అగ్రిగోల్డ్ భూమిని వేలంలో కొనుగోలు చేసిన వ్యక్తుల్ని సైతం తులసిబాబు గ్యాంగ్‌తో సునీల్ బెదిరించి డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. బాపట్ల జిల్లా రామకూరులో 96మంది నకిలీ డిపాజిటర్ల ఖాతాల్లో అగ్రిగోల్డ్ బాధితులకు చెల్లించాల్సిన సొమ్ము రూ.7.20లక్షలు డిపాజిట్ చేయించారని, ఆ తర్వాత వారిని బెదిరించి విత్‌డ్రా చేసుకున్నట్లు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయా ఖాతాల వివరాలతో పాటు ఫోన్ నంబర్లు సైతం అందజేశారు. ఈ నేపథ్యంలో సునీల్ కుమార్ అక్రమాలపై ఏసీబీ కేసు నమోదు చేసే అవకాశం ఉంది. మరోవైపు ఆయన అరెస్టు తప్పదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ఏళ్ల తరబడి పెండింగ్ ఏంటి?

- ఉద్యోగుల విజిలెన్స్ కేసులపై 3 వారాల్లో నివేదిక సమర్పించండి
- పీఆర్, ఆర్‌డీ, ఆర్‌డబ్ల్యూఎస్, అటవీ శాఖ అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాలు

అమరావతి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): "ఉద్యోగులపై విజిలెన్స్ కేసులను ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచడమేంటి? ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి? వాటి వివరాలేంటి? విచారణ జాప్యానికి కారణాలేంటి?" అనే విషయాలపై మూడు వారాల్లో నివేదిక ఇవ్వాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, అటవీ శాఖ అధికారులను ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. శుక్రవారం ఆయన ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉద్యోగుల పనితీరుపై సున్నితమైన విజిలెన్స్ ఉండాలని, వారు అప్రమత్తంగా, అత్యుత్తమంగా పనిచేయడానికి ఇది ఉపయోగపడుతుందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. పనితీరు, నిబద్ధతకు విజిలెన్స్ ఒక సూక్ష్మదర్శినిలా పనిచేస్తుందన్నారు. అయితే ఉద్యోగులపై నమోదవుతున్న విజిలెన్స్ కేసులు, శాఖాపరమైన విచారణలు, దర్యాప్తులు, చర్యలు సంవత్సరాల పాటు పెండింగ్‌లో ఉండడం ఉద్యోగుల పనితీరుపై ప్రభావం చూపుతోందని పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, అటవీ శాఖల్లో విజిలెన్స్, ఏసీబీ, శాఖాపరమైన కేసుల వివరాలు, అవి ఎంత కాలంగా పెండింగ్‌లో ఉన్నాయి, అందుకు గల కారణాలపై మూడు వారాల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని సంబంధిత శాఖల ముఖ్య కార్యదర్శులను ఆదేశించారు. కొన్ని కేసులు 20 ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న విషయాన్ని అధికారులు పవన్ దృష్టికి తెచ్చారు. అపరిష్కృత కేసుల వల్ల అధికారులు, సిబ్బంది ఉద్యోగ విరమణ తర్వాత కూడా రిటైర్మెంట్ బెనిఫిట్స్ పొందలేకున్నారు. పదోన్నతుల్లో వెనుకబడిన అధికారులు కూడా ఉన్నారని గ్రహించారు. అభియోగాలు వచ్చిన వారిపై విచారణ ప్రారంభించినప్పుడు.. అందుకు తగిన పత్రాలు అందుబాటులో ఉండటం లేదని, ఇది విచారణ జాప్యానికి కారణం అవుతోందని అధికారులు డిప్యూటీ సీఎంకు తెలిపారు. తన శాఖల పరిధిలో విజిలెన్స్ నివేదిక ఆధారంగా తీసుకునే చర్యల్లో వేగం పెంచేందుకు పవన్ ప్రత్యేక మార్గదర్శకాలను సూచించారు. ఏదైనా విషయంలో అధికారులు, సిబ్బందిపై ఆరోపణలు వస్తే ప్రాథమిక విచారణ పకడ్బందీగా జరపాలన్నారు. ప్రాథమిక విచారణలో బలమైన సాక్ష్యాలు సేకరించాలని.. విచారణ అధికారికి, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగికి మధ్య సన్నిహిత సంబంధాలు లేకుండా తొలి దశలోనే నిరోధించాలని స్పష్టం చేశారు. శాఖల్లోని అన్ని విజిలెన్స్, నాన్ విజిలెన్స్ కేసులను సరైన రీతిలో తిరిగి విచారించి, వేగంగా పరిష్కరించేందుకు శాఖాధిపతులు దృష్టి సారించాలని ఆదేశించారు.

ఆర్థిక ప్యాకేజీ కేవలం సంఖ్య కాదు.. వేలాది కుటుంబాలకు కొత్త ఆశ

- విశాఖ ఉక్కుకు రూ.11,440 కోట్ల ప్యాకేజీని స్వాగతిస్తున్నాం
- ప్రధాని మోదీకి కృతజ్ఞతలు: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అమరావతి, న్యూఢిల్లీ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీ కేవలం సంఖ్య కాదని.. ఇది వేలాది కుటుంబాలకు కొత్త ఆశ... అని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక ప్యాకేజీ ప్రకటించిన నేపథ్యంలో ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉక్కు మంత్రి కుమారస్వామికి శుక్రవారం ఎక్స్ వేదికగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రధాని మోదీ చేసిన ట్వీట్‌ను రీపోస్టు చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీ అందించాలన్న ఎన్డీయే ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి ఏపీ ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని చెప్పారు. చంద్రబాబు సారథ్యంలో విశాఖ ఉక్కు కర్మాగారం మనుగడ సాగించడమే కాకుండా అభివృద్ధి చెందుతుందని హామీ ఇస్తున్నామన్నారు.

ఏపీ ప్రజల హృదయాల్లో విశాఖ ఉక్కుకు ప్రత్యేక స్థానం: ప్రధాని మోదీ


ఆంధ్రప్రదేశ్ ప్రజల హృదయాల్లో విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ప్రత్యేక స్థానం ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించడంపై మోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. 'విశాఖ ఉక్కు కర్మాగారానికి ఏపీ ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం ఉంది. గురువారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో స్టీల్ ప్లాంట్‌కు రూ.10,000 కోట్లకు పైగా పెట్టుబడి మద్దతు ఇవ్వాలని నిర్ణయించాం. ఆత్మనిర్భర్ భారత్‌ను సాధించడంలో ఉక్కు రంగానికి ఉన్న ప్రాముఖ్యతను అర్థం చేసుకుని ఈ నిర్ణయం తీసుకున్నాం' అని మోదీ ట్వీట్ చేశారు.

ఏపీతో కలసి పనిచేసేందుకు సిద్ధం: ఎన్ఐఎస్‌జీ

అమరావతి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌తో కలసి పనిచేయడానికి ఎంతో ఆసక్తితో ఉన్నామని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్మార్ట్ గవర్నెన్స్ (ఎన్ఐఎస్‌జీ) స్పష్టం చేసింది. వెలగపూడి సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టీజీఎస్) కార్యాలయంలో ఎన్ఐఎస్‌జీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి (సీఈవో) రాజీవ్ బన్సల్ తన అధికార బృందంతో పర్యవేక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖలకు సాంకేతిక సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా వెల్లడించారు. తాము ఇప్పటికే ఏపీతో సహా పలు రాష్ట్రాల్లో చేపడుతోన్న వివిధ కార్యకలాపాల గురించి అధికారులకు వివరించారు. పలు రాష్ట్రాల్లో వారి అవసరాలను బట్టి ఈ-గవర్నెన్స్, స్ట్రాటజీ ప్లానింగ్, డిజైనింగ్ తదితర రంగాల్లో సహకారం అందిస్తున్నామని వెల్లడించారు. అధునాతన టెక్నాలజీని అందించేందుకు సుముఖంగా ఉన్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో కలసి సాంకేతిక పరిజ్ఞానంతో ముందడుగు వేయాలని భావిస్తున్నామని రాజీవ్ బన్సల్ అన్నారు. సీఎం చంద్రబాబు లక్ష్యమైన స్వర్ణాంధ్ర-2047కు సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు.

దుర్గమ్మ భక్తులారా క్షమించండి

- అసౌకర్యానికి చింతిస్తున్నా: లోకేశ్



వన్‌టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): 'దుర్గమ్మ భక్తులందరినీ మనఃపూర్వకంగా క్షమాపణలు కోరుతున్నా. మీకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నా' అని మంత్రి లోకేశ్ అన్నారు. దుర్గగుడికి వచ్చిన భక్తుడు కే వర ప్రసాద్ అక్కడ పరిస్థితిని వివరిస్తూ ఎక్స్‌లో రెండు వీడియోలు పోస్టు చేశారు. దానిని చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్‌లకు ట్యాగ్ చేశారు. 'శుక్రవారం ఉదయం దుర్గగుడిలో ప్రసాదం కౌంటర్ వద్ద పరిస్థితి ఇది. తాగడానికి మంచినీళ్లు కూడా లేవు. పారిశుధ్యమూ అంతంత మాత్రమే. కూటమి ప్రభుత్వంలో ఇలాంటి దుస్థితి దురదృష్టకరం' అని ఆ భక్తుడు పేర్కొన్నారు. దీనికి లోకేశ్ స్పందిస్తూ క్షమాపణలు చెప్పారు. 'మా జట్టు సభ్యులు సంబంధిత శాఖ దృష్టికి సమస్యను తీసుకొని వెళ్లారు. ఇలాంటి తప్పులు పునరావృతం కావు' అంటూ లోకేశ్ హామీ ఇచ్చారు.

జగన్ మాటలు.. బాబు చేతలు!

(మొదటి పేజీ తరువాయి)

ఎవ్వరికీ తెలియదు. కానీ... అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే చంద్రబాబు కేంద్రం నుంచి వేలకోట్ల నిధులు సాధించారు... సాధిస్తున్నారు. పోలవరం, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, రైల్వేజోన్, పెండింగ్ బిల్లులు... ఇలా అన్నింటి పైనా ముఖ్యమంత్రిగా జగన్ చేతులెత్తేశారు. 'కేంద్రం దయ... మన ప్రాప్తం' అంటూ ఐదేళ్లు దీన వచనాలు పలికారు. 'అమరావతి'పై కక్షకట్టి దానిని అటకెక్కించారు. అదేమంటే... అన్ని వేల కోట్ల ఖర్చు భరించడం వల్ల కాదని కబుర్లు చెప్పారు. జగన్ విఫలమైన ఈ అన్ని అంశాల్లో చంద్రబాబు సూపర్ సక్సెస్ అయ్యారు.

జగన్ ఢిల్లీ యాత్రల ఫలం శూన్యం

జగన్ సీఎంగా ఉన్నప్పుడు తరచూ ఢిల్లీకి వెళ్లేవారు. ప్రధాని, హోంమంత్రితోపాటు ఇతర కేంద్ర మంత్రులతో భేటీ అయ్యేవారు. వాళ్లతో ఏం మాట్లాడిందీ, వారు ఎలా స్పందించిందీ ఎప్పుడూ బహిర్గతం చేయలేదు. కానీ... ఢిల్లీ పెద్దలకు ఇచ్చిన 'వినతిపత్రం' అంటూ ఒక కాగితాన్ని మీడియాకు విడుదల చేసేవారు. అందులో... ప్రతిసారీ దాదాపుగా అవే అంశాలు! కానీ... దేనిపైనా కేంద్రం నుంచి స్పందన కనిపించేదే కాదు. దీంతో... సొంత కేసులు, వివేకా కేసులో తమ్ముడు అవినాశ్ రెడ్డికి రక్షణ, ఇతర వ్యక్తిగత ప్రయోజనాల కోసమే జగన్ ఢిల్లీ పెద్దలను కలిసేవారనే బలమైన ఆరోపణలు వినిపించేవి. కోరినన్ని అప్పులు మినహా... రాష్ట్రం కోసం జగన్ సాధించిందేమిటనేది పెద్ద ప్రశ్న!

నేడు ఇదీ పరిస్థితి...

కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే చంద్రబాబు పలుమార్లు ఢిల్లీకి వెళ్లారు. ప్రధాని, కేంద్రమంత్రులతో భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన అనేక అంశాలను వారికి నివేదించారు. దీని ఫలితాలు తక్షణం కనిపిస్తున్నాయి. పోలవరానికి నిధులు, అమరావతికి రుణం, విశాఖ రైల్వేజోన్‌కు శంకుస్థాపన, జాతీయ రహదారులు, కేంద్ర సంస్థల పెట్టుబడులు... ఇలా కేంద్రం నుంచి నిధుల వరద పారుతోంది!

సొంత ప్రయోజనాలే ముఖ్యం

ఎన్డీయే ప్రభుత్వంలో టీడీపీ భాగస్వామి. ఇంకా చెప్పాలంటే... టీడీపీ ఎంపీల బలం కేంద్ర ప్రభుత్వానికి చాలా కీలకం. అందుకే... రాష్ట్రానికి కేంద్రం ప్రాధాన్యం ఇస్తోందనే వాదనలోనూ నిజముంది. అయితే... 2019-24లో వైసీపీ ప్రభుత్వం ఎన్డీయే ప్రభుత్వంలో భాగస్వామి కాదు. కానీ... అప్పట్లో రాజ్యసభలో ఎన్డీయేకు తగిన బలం లేదు. దీనిని అవకాశంగా తీసుకుని... రాష్ట్ర ప్రయోజనాలకు సహకరిస్తేనే, రాజ్యసభలో బిల్లులకు మద్దతు పలుకుతామని జగన్ స్పష్టం చేసే అవకాశం ఉండింది. కానీ... జగన్ ఎప్పుడూ ఇలా చేయలేదు. కేంద్రం కోరకముందే అన్ని అంశాల్లో బేషరతుగా మద్దతు పలికారు. 'నా స్వప్రయోజనాలు, కేసుల నుంచి రక్షణే నాకు ముఖ్యం' అన్నట్లుగా వ్యవహరించారు.

- అమరావతి, ఆంధ్రజ్యోతి

అన్నింటా జగన్ 'నాటకాలే'

విశాఖ ఉక్కు

జగన్ ప్రతిపక్షంలో ఉండగా ప్రత్యేక హోదా కోసం ఎంపీలతో రాజీనామా చేయించారు. అధికారంలోకి వచ్చాక ఇలాంటి 'రాజీనామాలు' మరిచిపోయారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ దిశగా కేంద్రం అడుగులు వేస్తున్నా పట్టించుకోలేదు. ఉక్కు రక్షణ కోసం వైసీపీ ఎంపీలు రాజీనామా చేయాలన్న డిమాండ్లను వినిపించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు ఢిల్లీ వెళ్లిన ప్రతీసారి ప్రధాని మోదీ, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, ఉక్కు శాఖా మంత్రి కుమారస్వామితో సమావేశమై చర్చలు జరిపారు. ఇటీవల ప్రధానిని కలిసినప్పుడు కూడా విశాఖ ఉక్కుకు ఆర్థికసాయం చేయాలని కోరారు. చంద్రబాబు ప్రయత్నాల ఫలితంగా కేంద్రం విశాఖ ఉక్కుకు రూ.11,440 కోట్ల భారీ ప్యాకేజీ ప్రకటించింది. 'ప్రైవేటీకరణ' ముప్పు తప్పింది.

పోలవరం-పరిహారం

పోలవరం నిర్వాసితులకు పునరావాసం, పరిహార ప్యాకేజీపై జగన్ ఐదేళ్లు కథలు చెప్పారు. 'నా చేతిలో ఏమీ లేదు' అన్నట్లుగా నిర్వాసితులను ఉసూరుమనిపించారు. కేంద్రం ఇచ్చే పరిహారానికి అదనంగా... ఎకరాకు రూ.10 లక్షలు చెల్లిస్తానని హామీ ఇచ్చీ పట్టించుకోలేదు. ఇప్పుడు... ఎలాంటి హంగూ, ఆర్భాటాలు లేకుండానే కేంద్రం పోలవరం నిర్వాసితులకు పరిహారం జమ చేసింది. పునరావాస కాలనీల నిర్మాణ కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు కూడా చెల్లిస్తున్నారు. 90 శాతం వరకు పరిహారం పంపిణీ పూర్తి చేశారు. స్థిరాస్తి విలువలు కూడా చాలా వరకు చెల్లించారు. మిగిలిన భూములను సేకరించి వాటికి పరిహారం అందజేసి, ఇతర అంశాలను పూర్తి చేసేందుకు అధికారులను నియమించింది.

అమరావతి...

రాష్ట్రానికి ఐదేళ్లు రాజధాని లేకుండా చేసిన ఘనత వైఎస్ జగన్‌దే! 'రాజధానిగా అమరావతికి మద్దతు పలుకుతున్నాం' అని నమ్మబలికి ఆయన అధికారంలోకి వచ్చారు. ఆ తర్వాత... మాట మడత పెట్టారు. మూడు ముక్కలాట మొదలుపెట్టారు. అమరావతి నిర్మాణానికి వేల కోట్లు కావాలన్నారు. నిధుల కోసం ఎలాంటి ప్రయత్నం చేయకుండానే... అంత భారం భరించలేమని కథలు చెప్పారు. మునిగి పోతుందని దుష్ప్రచారం చేశారు. ఇప్పుడు 'అమరావతి' దృశ్యం మారిపోయింది. ప్రపంచ బ్యాంకు, ఏడీబీలు రుణం మంజూరు చేశాయి. జగన్ సర్కారు పెండింగ్‌లో పెట్టిన బిల్లులను ప్రస్తుత ప్రభుత్వం చెల్లిస్తోంది. పనుల కొనసాగింపునకు మళ్లీ టెండర్లు పిలిచింది. అమరావతిని పూర్తిస్థాయిలో పట్టాలెక్కిస్తోంది.

విశాఖ రైల్వే జోన్...

విశాఖ రైల్వేజోన్ ఏర్పాటును వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ముడసర్లోవ వద్ద స్థలం అప్పగిస్తే జోన్ కార్యాలయం ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నట్లు రైల్వేశాఖ పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదు. అయితే, అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే కూటమి ప్రభుత్వం రైల్వేజోన్ ఏర్పాటును కార్యరూపంలోకి తెచ్చింది. రైల్వేకు ముడసర్లోవ వద్ద స్థలం అప్పగించింది. ఆ వెంటనే రైల్వేశాఖ జోనల్ కార్యాలయం నిర్మాణానికి టెండర్లు పిలిచింది. టెండర్ల గడువు ముగియగా బిడ్లు సాంకేతిక పరిశీలనలో ఉన్నాయి. ఆ భవనాల ఆకృతులతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక సమర్పించారు. ప్రధాని ఇటీవల రైల్వేజోన్ కార్యాలయానికి శంకుస్థాపన కూడా చేశారు.

నారాయణ.. నారాయణ!

కూటమి ప్రభుత్వంలోనూ 'వైసీపీ' అధికారులకు అందలం

- మంత్రి నారాయణ ఇలాకాలో మాధురిరెడ్డికి పోస్టింగ్
- లేని పోస్టు సృష్టించి మరీ అప్పగించిన వైనం

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో అడ్డగోలుగా పదోన్నతులు పొందిన ఓ మహిళా అధికారిని కూటమి ప్రభుత్వంలోనూ అందలం ఎక్కించారు. మున్సిపల్ శాఖలోని అమృత్ విభాగంలో లేని డిప్యూటీ డైరెక్టర్ పోస్టును సృష్టించి మరీ.. ఆమెను అందులో కూర్చొబెట్టారు. గత ప్రభుత్వంలో జగన్ పేషీలో కీలకంగా వ్యవహరించిన ఐఏఎస్ అధికారి ధనుంజయ్‌రెడ్డి వద్ద పనిచేస్తూ కీలకంగా వ్యవహరించిన మాధురిరెడ్డికి తగిన అర్హతలు లేకపోయినా అప్పట్లో పదోన్నతులు కల్పించారు. ఆఖరులో కన్‌ఫర్డ్ ఐఏఎస్ హోదా కూడా ఇప్పించేందుకు సకల ప్రయత్నాలు చేశారు. అంతలోనే ఎన్నికలు రావడంతో అది మిస్ అయింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలోనూ తమ పరపతి తక్కువేమీ కాదంటూ చక్రం తిప్పుతున్నారు. మున్సిపల్ శాఖలో అమృత్ విభాగానికి ప్రత్యేకంగా డిప్యూటీ డైరెక్టర్ పోస్టు లేదు. అయితే నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో అమృత్ డిప్యూటీ డైరెక్టర్ పోస్టుకు మాధురిని నియమించినట్లు ఆర్థిక శాఖ శుక్రవారం జీవో ఇవ్వడంపై ఆశ్చర్యం వ్యక్తం అవుతోంది. ఏదైనా కొత్త పోస్టు సృష్టించాలంటే ఆర్థిక శాఖ అనుమతి తప్పనిసరి. అలాంటిది ఆర్థికశాఖ అధికారులే.. లేని అమృత్ డిప్యూటీ డైరెక్టర్ పోస్టులో మాధురిని నియమించడం విచిత్రంగా ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. పైగా మంత్రి నారాయణ సొంత ఇలాకాలోని నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో జరగడంతో.. పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మంత్రికి తెలియకుండానే ఆయన శాఖలోకి తీసుకునే ప్రయత్నాలు జరిగాయా? లేక మంత్రి అనుమతితోనే జరిగిందా? అనే విషయం ఇంకా బయటకు రాలేదు.

కేంద్రానికి ధన్యవాదాలు

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి రూ.11,440 కోట్లు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోదీకి కేబినెట్ ధన్యవాదాలు తెలిపింది. "కేంద్రం సహాయంతో అమరావతి, పోలవరం పట్టాలు ఎక్కించాం. ఇప్పుడు విశాఖ ఉక్కుకు కూడా సాయం పొందగలిగాం. మనం కూడా కేంద్రం పట్ల ఇదే విధమైన కృతజ్ఞతతో ఉండాలి"అని చంద్రబాబు పేర్కొన్నారు.



మంత్రి వర్గ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, పాల్గొన్న సీఎస్ విజయానంద్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, అచ్చెన్న, నాదెండ్ల మనోహర్, అనిత, రామానాయుడు, లోకేశ్ తదితర మంత్రులు

పేదలకు స్థలాల సంబరం

పల్లెల్లో 3 సెంట్లు..పట్నాల్లో 2 సెంట్లు.. రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు

(మొదటి పేజీ తరువాయి)

కేబినెట్ సమావేశం ఇంకా అనేక ముఖ్యమైన నిర్ణయాలను తీసుకుంది. ఆ వివరాలను సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి విలేకరులకు వెల్లడించారు. ఆ వివరాలు... వైసీపీ ప్రభుత్వ హయాంలో అస్సైన్‌మెంట్ నుంచి విముక్తి కలిగించిన భూములు (ఫ్రీహోల్డ్) భూములు ఎవరి చేతుల్లోకి వెళ్లాయో పరిశీలన చేయించాలని మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర వర్గాల వారికి వ్యవసాయ భూములను అస్సైన్‌మెంట్ కింద ఇచ్చి ఇరవై సంవత్సరాలు దాటితే ఆ వర్గాల వారు వాటిని ఎవరికైనా పూర్తి హక్కులతో అమ్ముకోవడానికి నాటి వైసీపీ ప్రభుత్వం ఒక జీవో ద్వారా అవకాశం ఇచ్చింది. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పదమూడున్నర లక్షల ఎకరాల భూమిని ఫ్రీహోల్డ్ చేశారు. అందులో పాతిక వేల ఎకరాల భూమి ఆ వర్గాల వారి నుంచి ఇతరుల చేతికి అధికారికంగా మారిపోయి రిజిస్ట్రేషన్లు కూడా జరిగాయి. ఈలోపు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను నిలిపివేసింది. ఆ గడువు ఈ నెల పదో తేదీతో ముగియడంతో మళ్లీ మరోసారి నిలిపివేతను పొడిగిస్తూ మంత్రివర్గ సమావేశం నిర్ణయం తీసుకొంది. ఈ సమయంలోనే ఈ భూములు వైసీపీ హయాంలో ఎవరి చేతుల్లోకి పోయాయన్నదానిపై చర్చ జరిగింది. వైసీపీ పెద్దలు ఈ భూములను భారీగా కొల్లగొట్టారని, పేదలకు నామమాత్రపు ధర చెల్లించి వీటిని హస్తగతం చేసుకొన్నారని, జీవో రాబోతోందని ముందుగానే ఆ పార్టీ నేతలు తెలుసుకొని దానికిముందే ఆ భూములను అనధికారికంగా కొనుక్కొన్నారని కొందరు మంత్రులు చెప్పారు. "ఒక్క సత్యసాయి జిల్లాలోనే రెండున్నర లక్షల ఎకరాల భూమి ఫ్రీహోల్డ్ అయింది. లేపాక్షి నాలెడ్జ్ హబ్‌కు ఇచ్చిన భూముల మధ్యలో అస్సైన్‌మెంట్ భూములు వేల ఎకరాలు ఉన్నాయి. వాటిని వైసీపీ నేతలు కొట్టేశారని అనుమానం ఉంది. అక్కడ పరిశ్రమలు వస్తే వారు చేజిక్కించుకొన్న భూములకు విపరీతమైన ధరలు వస్తాయి. దీనిపై పరిశీలన జరపాలి" అని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కోరారు. విశాఖ చుట్టుపక్కల కూడా ఇదే తంతు జరిగిందని మరో మంత్రి చెప్పారు. దీంతో ఫ్రీహోల్డ్ అయిన భూముల జాబితాను ఇన్‌చార్జి మంత్రులకు అందచేస్తామని, అవి ఎవరి చేతుల్లో ఉన్నాయో మంత్రులు పార్టీ వర్గాల ద్వారా సమాచారం సేకరించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రభుత్వానికి అవసరం అయినప్పుడు ఈ భూములను రిజిస్ట్రేషన్ విలువకు అనుగుణంగా ప్రభుత్వం తీసుకొనే హక్కు ఉంటుందన్న నిబంధన పెట్టి రిజిస్ట్రేషన్‌కు అనుమతి ఇస్తే బాగుంటుందని రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్ సూచించారు. పేదలు ఎవరైనా తమ భూములను వైసీపీ నేతలు కారుచౌకగా కొట్టేశారని ఫిర్యాదు చేస్తే ఆ భూములు ఆ పేదలకే తిరిగి చెందేలా ఏర్పాటు చేస్తే బాగుంటుందని పయ్యావుల సూచించారు. మంత్రుల పరిశీలన తర్వాత దీనిపై నిర్ణయం తీసుకోవాలని మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. ఏడు వేల ఎకరాల భూమిని నిబంధనలకు వ్యతిరేకంగా ఫ్రీహోల్డ్ చేశారని ఫిర్యాదులు రావడంతో దానిపై ఏం చర్య తీసుకోవాలో మంత్రుల కమిటీ సూచించాలని ముఖ్యమంత్రి చెప్పారు. 22 ఏ నిబంధన కింద నిషేధ జాబితాలోకి వెళ్లిన భూములను సబబైన కారణం ఉన్నప్పుడు తొలగించే అంశం పరిశీలించే బాధ్యతను కూడా మంత్రుల కమిటీకి అప్పగించాలని నిర్ణయించారు. ఒక సర్వే నంబర్‌లో కొంత ప్రభుత్వ భూమి ఉంటే, మొత్తం సర్వే నంబర్‌లోని భూమి అంతటనీ నిషేధ జాబితాలో పెట్టడంతో సమస్యలు వస్తున్నాయని అనేక మంది ఫిర్యాదు చేస్తుండటంతో ఆ విషయం పరిశీలించాలని కమిటీకి సీఎం సూచించారు. అలాగే వైసీపీ హయాంలో రాజకీయ కక్షతో కావాలని నిషేధ జాబితాలో పెట్టిన భూముల విషయం కూడా పరిశీలించాలని కోరారు.



2019 వరకే ఆక్రమణల క్రమబద్ధీకరణ

ప్రభుత్వ భూములను ఆక్రమించి ఇళ్లు కట్టుకొన్న వారి ఇంటి స్థలాలు క్రమబద్ధీకరించడంపై మంత్రివర్గ సమావేశంలో చర్చ జరిగింది. ఇటువంటి స్థలాల క్రమబద్ధీకరణకు 2019లో టీడీపీ ప్రభుత్వం ఒక జీవో ఇచ్చిందని, దానినే కటాఫ్ తేదీగా నిర్ణయించి అప్పటివరకూ జరిగిన ఆక్రమణలను క్రమబద్ధీకరించాలని సమావేశం నిర్ణయించింది. వైసీపీ హయాంలో జరిగిన ఆక్రమణలపై అనేక ఆరోపణలు ఉన్నందువల్ల వాటిని పక్కన పెట్టాలని నిశ్చయించారు. 150 గజాల వరకూ ఉచితంగా క్రమబద్ధీకరించాలని, ఐదు వందల గజాల పైన ఆక్రమించుకొన్న వారి నుంచి రిజిస్ట్రేషన్ విలువకు ఐదు రెట్లు అదనంగా వసూలుచేసి క్రమబద్ధీకరించాలని నిశ్చయించారు. ఈ మధ్యలో ఉన్నవారికి వివిధ శ్లాబుల్లో ఫీజులు నిర్ణయిస్తారు. ఇళ్ల స్థలాలకు నగరాలు, పట్టణాల్లో స్థలాలు దొరకడం లేదని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. అటువంటిచోట టిడ్కో ఇళ్లను నిర్మించి పేదలకు ఇద్దామని ముఖ్యమంత్రి తెలిపారు.

మరికొన్ని నిర్ణయాలు..

- నివాసయోగ్యం కానిచోట, చెరువుల్లో , శ్మశానాల పక్కన ఇచ్చారంటూ చాలా మంది గతంలో లే అవుట్లలో ఇళ్లు కట్టుకోలేదు. వారు కోరుకుంటే అప్పటి కేటాయింపులు రద్దుచేసి వేరేచోట స్థలాలు మంజూరుచేయాలి. ఊరికి దూరంగా 30, 40 కిలోమీటర్ల దూరంలో గతంలో స్థలాలు పొందినవారు.. కోరుకుంటే వారికి మళ్లీ స్థలాలు కేటాయించాలి. ఇళ్లు కట్టకుండా ఖాళీగా లే అవుట్లను వదిలేసిన చోట మురుగు చేరి, దోమల సమస్య ఎక్కువగా ఉంది. అటువంటి చోట కేటాయింపులు రద్దుచేసి.. కోరుకుంటే అర్హతను బట్టి మళ్లీ కేటాయించాలి.
- గ్రామ,వార్డు స్థాయిలో రియల్ టైమ్ గవర్నెన్స్‌ని మరింత సమర్థవంతంగా అమలుచేయాలి. జనాభా ఆధారంగా గ్రామ, వార్డు సచివాలయాలను మూడు కేటగిరీలుగా విభజించాలి.
- 2024-25 ఖరీఫ్ ధాన్య సేకరణకు అవసరమైన నిధులను నేషనల్ కో-ఆపరేటివ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌సీడీసీ) నుంచి ఏపీ మార్క్‌ఫెడ్ రూ. 700 కోట్ల మేర రుణాన్ని పొందేందుకు (ఇప్పటికే పొందిన రూ.6000 కోట్ల రుణానికి అదనంగా) ప్రభుత్వ హామీని పొడిగించాలి.
- ఫెర్రో అల్లాయ్స్ అసోసియేషన్ అభ్యర్థనపై 31-03-2025 వరకు టారిఫ్, విద్యుత్ సుంకం పెంచరాదని నిర్ణయం.
- మరో 63 అన్నా క్యాంటీన్‌లు 38.43 కోట్లతో ఏర్పాటు
- నాగావళి నదిపై సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజీపై రెండు మినీ హైడల్ ప్రాజెక్టుల నిర్మాణం.
- గుంటూరు జిల్లా తాడేపల్లి పరిధిలో ప్రకాశం బ్యారేజీకి దిగువన కృష్ణా నదికి కుడి వైపు వరద రక్షణ గోడ నిర్మాణానికి 294.20 కోట్లతో పరిపాలనా అనుమతులు..

ఐదేళ్ల తర్వాత కదలిక!

నేడు పోలవరం డయాఫ్రమ్‌వాల్ పనులు పునఃప్రారంభం

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలవరం సాగునీటి ప్రాజెక్టు ప్రధాన డ్యామ్ పనుల్లో ఎట్టకేలకు ఐదేళ్ల తర్వాత కదలిక వచ్చింది. శనివారం ఉదయం 10.19 గంటలకు ప్రధాన డ్యామ్‌లో అత్యంత కీలకమైన డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు. ప్రాజెక్టులో ప్రధానమైన ఈ డ్యామ్ పనులు పునఃప్రారంభ సమయం కావడంతో.. అట్టహాసంగా ముఖ్యమంత్రి చంద్రబాబుతో సహా ఇతర ముఖ్యనేతలు, అధికారులు పాల్గొనాల్సి ఉన్నా, ఈ కార్యక్రమాలను నిరాడంబరంగా చేపట్టాలన్న యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. కేవలం పోలవరం చీఫ్ ఇంజనీరు నరసింహమూర్తి, సూపరింటెండింగ్ ఇంజనీరు రామచంద్రరావు, కాంట్రాక్టు సంస్థలు బావర్, మేఘా ఇంజనీరింగ్ సంస్థల ప్రతినిధుల సమక్షంలో పనులు ప్రారంభించనున్నారు. కాగా, శనివారం నుంచి డయాఫ్రమ్‌వాల్ టీ-5 ప్లాస్టిక్ కాంక్రీట్ మిశ్రమం వాడుతూ పనులు ప్రారంభమవుతాయంటూ 'ఆంధ్రజ్యోతి' ఈ ముహూర్తం గురించి ముందే వెల్లడించింది!!,

ప్లాస్టిక్ కాంక్రీట్ మిశ్రమంతో...

పాత డయాఫ్రమ్‌వాల్‌కు సమాంతరంగా ప్లాస్టిక్ కాంక్రీట్ మిశ్రమంతో డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. 2019-24 మధ్య కాలంలో పురోగతి మాటెలా ఉన్నా వాల్ దెబ్బతినడం, గైడ్‌బండ్ కుంగిపోవడం, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లకు సీపేజీ వంటి పెను సవాళ్లు ఎదురయ్యాయి. 2019 నాటికి 72 శాతం మేర పూర్తయిన ప్రాజెక్టును జగన్ జమానాలో విధ్వంసానికి గురైంది. రూ.465 కోట్లతో ఎల్‌అండ్‌టీ, బావర్‌తో పూర్తయిన డయాఫ్రమ్‌వాల్ 2020లో దెబ్బతిన్నది. 2019లో అధికార పగ్గాలు చేపట్టిన వెంటనే డయాఫ్రమ్‌వాల్‌పై ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్‌ను వేసి ఉంటే భారీ వరదలు వచ్చినా డయాఫ్రమ్‌వాల్‌తో సహా ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు సీపేజీకి గురయ్యేవి కావని నిపుణులు పేర్కొంటున్నారు. పోలవరం ప్రధాన డ్యామ్‌లో కీలక భూమిక వహించే డయాఫ్రమ్‌వాల్‌ను ప్రస్తుతం దెబ్బతిన్న వాల్‌కు సమాంతరంగా ఆరు మీటర్లకు ఎగువన 1396.6 మీటర్ల పొడవున రూ.980 కోట్లతో నిర్మిస్తారు. దీనికోసం కేంద్ర సాయిల్ అండ్ మినరల్ పరిశోధన సంస్థ (సీఎంఆర్ఎస్) ప్రతిపాదించిన టీ-5 ప్లాస్టిక్ కాంక్రీట్ మిశ్రమాన్ని వినియోగిస్తారు. డయాఫ్రమ్‌వాల్‌ను ఈ ఏడాది అంతానికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇదే సమయంలో 600 మీటర్ల మేర డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ పనులు పూర్తయ్యాక, మరోవైపు నుంచి ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ నిర్మాణాన్ని చేపట్టాలని నిర్ణయించారు. దీనివల్ల ఒక సీజన్‌కు ముందే 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయవచ్చని జల వనరుల శాఖ భావిస్తోంది.

జగన్‌కు ప్రాజెక్టులపై మాట్లాడే హక్కులేదు: మంత్రి నిమ్మల

పోలవరం ప్రాజెక్టుతో సహా సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసకుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి జల వనరుల ప్రాజెక్టులపై మాట్లాడే హక్కు లేదని మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు. ఉండవల్లిలోని సీఎం చంద్రబాబునాయుడి నివాసం వద్ద శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సాగునీటిపారుదల రంగాన్ని పూర్తిగా ధ్వంసం చేసిన జగన్‌కు గోదావరి, కృష్ణా జలాలపై మాట్లాడే అర్హత లేదన్నారు. మీడియా ముసుగులో తన రోత.. అవినీతి పత్రిక ద్వారా రోజూ అసత్య కథనాలతో ప్రజలను మభ్యపెట్టి మరోసారి రాష్ట్రాన్ని నాశనం చేయాలన్న ప్రణాళికలను జగన్ వేస్తున్నారని ఆయన ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టులో 21.15 మీటర్ల కాంటూరులో తొలిదశ, 45.72 మీటర్ల కాంటూరులో రెండో దశ అంటూ విభజించి పోలవరం భవితను జగన్ ప్రశ్నార్థకం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ, రాష్ట్ర భవిత కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం శ్రమిస్తున్నారని రామానాయుడు ప్రశంసించారు.

మీలో వేగమేదీ?!

- యువ మంత్రుల పనితీరుపై బాబు అసంతృప్తి
- ప్రజల్లోకి మరింతగా వెళ్లి పనిచేయాలని ఆదేశం
- మంత్రులు, ఎంపీలు, జోనల్ ఇన్‌చార్జులతో సమీక్ష
- కొందరు ఎంపీల గైర్హాజరుపై ఆగ్రహం



మంత్రులు, ఎంపీలు, జోనల్ ఇన్‌చార్జుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పాతవారిని పక్కన పెట్టి యువతరం అని కొత్తవారికి మంత్రి పదవుల్లో అవకాశం ఇస్తే వారిలో ఆ వేగం కనిపించడం లేదని సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం ఉండవల్లిలోని తన నివాసంలో మంత్రులు, ఎంపీలు, పార్టీ జోనల్ ఇన్‌చార్జులతో సుమారు 3గంటలపాటు సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో మంత్రుల పనితీరుపై సీఎం నిశితంగా వ్యాఖ్యానించినట్టు సమాచారం. "నా మంత్రివర్గంలో 24మంది మంత్రులు ఉంటే ఆరుగురు గతంలో మంత్రులుగా చేసినవారు ఉన్నారు. 18మందికి మొదటిసారి అవకాశం వచ్చింది. కొత్తవారికి అవకాశం ఇస్తే ఉత్సాహంగా పరిగెత్తుతారని భావించి.. ఇంతమందికి అవకాశం ఇచ్చాను. కానీ, కొంతమందిలో ఆ వేగం కనిపించడం లేదు. అవకాశం రానివారు.. రావడం లేదని బాధపడుతుంటే, వచ్చినవారు ఆ వేగం ఎందుకు చూపించలేకపోతున్నారు? ప్రజల్లోకి దూసుకు వెళ్లడానికి మీకువచ్చిన అడ్డం ఏమిటి? మీ పనితీరు మెరుగు పర్చుకోకపోతే నష్టపోతారు. మంత్రులుగా శాఖపై పట్టుసాధించాలి. అధికారులతో పని చేయించుకోవాలి. మీ జిల్లాలో పార్టీకి నాయకత్వం ఇవ్వాలి. ప్రజల్లోకి ప్రభుత్వం చేస్తున్న మంచిని బలంగా తీసుకువెళ్లాలి. నేను గమనిస్తున్నానని గుర్తించండి. వచ్చేసారి సమీక్ష నాటికి మీ పనితీరులో మార్పు కనిపించాలి" అని చంద్రబాబు వ్యాఖ్యానించినట్లు సమాచారం.

అసాధ్యాలు సైతం సాధించాం!

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడు నెలల స్వల్ప వ్యవధిలోనే అసాధ్యం అనుకొన్న పనులు అనేకం చేశామని చంద్రబాబు తెలిపారు. వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో మంత్రులు అలసత్వంతో వ్యవహరిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఆగిపోయిన అమరావతిని పట్టాలెక్కించాం. పోలవరం విధ్వంసం చేశారు. అది కూడా పూర్తి కాగలదన్న నమ్మకం కలిగించాం. విశాఖ ఉక్కుకు కేంద్రం సాయం సాధించాం. వచ్చిన మొదటి నెలలోనే పేదల పింఛన్లు పెంచాం. ధాన్యం విక్రయించిన రైతులకు 24 గంటల్లో డబ్బులు జమ చేస్తున్నాం. 7 నెలల్లో రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. మీలో ఎంత మంది ఈ విషయాలు ప్రజల్లోకి వెళ్లి మాట్లాడుతున్నారు? ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు అవగాహన కలిగిస్తున్నారు? మనం చేసిన పనులు చెప్పలేకపోతే ప్రత్యర్థుల దుష్ప్రచారం ప్రజల మనసుల్లోకి వెళ్తుంది" అని చంద్రబాబు అన్నారు.

ప్రజల సంతృప్తి ఇలా..

కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల సంతృప్తిలో ఏ జిల్లాలో పరిస్థితి ఎలా ఉందో చంద్రబాబు చెప్పారు. కృష్ణా, చిత్తూరు, ఎన్టీఆర్ జిల్లాలు మొదటి మూడు స్థానాల్లోనూ, కడప, అల్లూరి సీతారామరాజు జిల్లా, తూర్పుగోదావరి చివరి మూడుస్థానాల్లో ఉన్నాయని తెలిపారు. సామాజిక మాధ్యమాలను వినియోగించుకోవడంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఆయన మార్కులిచ్చారు. మంత్రుల్లో ఫరూక్ చివరిస్థానంలో ఉన్నారు. "సామాజిక మాధ్యమాల వినియోగం పెంచుకోవాలి. మీకు ప్రత్యేకంగా ఉద్యోగులను, పీఆర్వోలను ఇచ్చాను. అయినా కొంతమంది ఇంకా వెనకబడే ఉన్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఐటీ రంగంలో పనిచేసి వచ్చారు. ఆయన ర్యాంక్ కూడా సంతృప్తికరంగా లేదు. ఈసారి నాకు మీ నుంచి మంచి ఫలితాలు కనిపించాలి" అని చంద్రబాబు అన్నారు.

ఇన్‌చార్జి మంత్రులకు మరిన్ని బాధ్యతలు

జిల్లా ఇన్‌చార్జి మంత్రులకు మరిన్ని బాధ్యతలు అప్పగిస్తున్నట్లు సీఎం తెలిపారు. "మీ జిల్లాల్లో పార్టీ, యంత్రాంగాన్ని సమన్వయం చేసే బాధ్యత మీదే. ఊరికే డీడీఆర్సీ సమావేశాలకు హాజరై తిరిగి రావడం కాకుండా జిల్లాల్లో రాజకీయ పరిస్థితిపై పట్టుపెంచుకోండి. అవసరమైతే మండలస్థాయి వరకు వెళ్లండి. కొత్త ఎమ్మెల్యేలు చాలా తప్పులు చేస్తున్నారు. వారికి ఏది తప్పో చెప్పండి. మీకు మొహమాటం ఉంటే నాకు చెప్పండి. నేను ఏ సమయంలో ఫోన్ చేసినా.. బాధ్యత అప్పగించినా నాకు వెంటనే ఫలితం కనిపించాలి. జిల్లాల్లో ఇన్‌చార్జి మంత్రి, జిల్లాకు చెందిన మంత్రి, ఎంపీ, కలెక్టర్ ఒక బృందంగా పనిచేసి మంచి ఫలితాలు సాధించాలి" అని సూచించారు. రేషన్ షాపుల విషయం కోర్టుకు వెళ్లిందని, ఈలోపు ఇన్‌చార్జులను నియమిస్తామని తెలిపారు. ఇకనుంచి పార్టీకి ఎక్కువ సమయం ఇస్తానని, ఈ విషయంలో తేడాను త్వరలోనే చూస్తారని చంద్రబాబు చెప్పారు.

నేను కఠినంగా ఉండేదాకా..!

సీఎం చంద్రబాబు నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఇద్దరు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు గంటి హరీశ్, అంబికా లక్ష్మీనారాయణ తదితరులు గైర్హాజరయ్యారు. ఈ విషయంపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. "కమిటీ మీటింగులు, ఇతర పనులు పార్టీ పని కంటే మీకు ఎక్కువా? నేను మొదటిసారి ఈ సమావేశం పెట్టాను. ఏ సమావేశం ప్రాధాన్యం ఏమిటో కూడా అర్థం కావడం లేదా? కొందరు ఎంపీలు పార్టీ పనిని పూర్తిగా వదిలేసి తిరుగుతున్నారు. అలాంటి వారిని ఊరుకొనేది లేదు. నేను కఠినంగా ఉండేంత వరకు తెచ్చుకోకండి" అని చంద్రబాబు తీవ్ర స్వరంతో హెచ్చరించినట్లు తెలిసింది.

పోలవరం జంట సొరంగాల పనులు ప్రారంభం



పోలవరం ప్రాజెక్ట్‌లో జంట సొరంగాలు

పోలవరం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యం తర్వాత పోలవరం ప్రాజెక్టు జంట సొరంగాల పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. శుక్రవారం నాటికి ఈ పనులను అధికారులు ముమ్మరం చేశారు. ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్ట్ కుడి కాలువ కనెక్టివిటీ కోసం కొండను తొలిచి జంట సొరంగాలను నిర్మించారు. జంట సొరంగాల లైనింగ్, ఇతర పనులను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇటీవల ఆ పనులను అధికారులు తిరిగి ప్రారంభించారు. తోటగొంది, మామిడిగొంది గ్రామాల మధ్య జంట సొరంగాల విస్తరణ పనుల్లో భాగంగా ఊట జలాలను తొలగించారు. దీనికి సమీపంలో మామిడిగొంది, దేవరగొంది గ్రామాల మధ్య నిర్మించిన జంట సొరంగాల్లో ఊట జలాలను తొలగించి మట్టి తరలింపు పనులు చేపట్టారు. గుహల విస్తరణకు అవసరమైన యంత్ర సామగ్రి ఆ ప్రాంతానికి చేర్చి విద్యుత్ సరఫరా పనులు పూర్తి చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు వేగవంతం చేశామని ఈఈ బాలకృష్ణ చెప్పారు. విస్తరణ పనులలో భాగంగా ఎగ్జిట్ చానల్ మట్టి తరలింపు వేగంగా జరుగుతుందని, అనంతరం లైనింగ్ పనులు కూడా వేగవంతం చేస్తామన్నారు.







ప్రతి నెల మూడవ శనివారం

స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర

గౌరవ ముఖ్యమంత్రి
శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి పిలుపును
అందుకుందాం. ప్రతి నెల మూడవ శనివారాన్ని
'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' దినంగా పాటిద్దాం.

పరిశుభ్రం ఆరోగ్యం
ఒక అడుగు ముందుకు స్వచ్ఛత వైపు

మంచి ఆలోచనలు, ఆరోగ్యవంతమైన శరీరం, స్వచ్ఛమైన వాతావరణం, ఇంటి దగ్గర, పనిచేసే చోట శుభ్రతలతో మన రాష్ట్రాన్ని స్వర్ణ ఆంధ్రగా, స్వచ్ఛ ఆంధ్రగా తీర్చిదిద్దుకుందాం.






'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' లక్ష్యాలు

- ఇంటింటి నుంచి 100% చెత్త సేకరణ
- చెత్తను 100% తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేయడం
- ఘన వ్యర్థాలను 100% శాస్త్రీయంగా ప్రాసెస్ చేయడం
- తిరిగి ఉపయోగించగల వ్యర్థాలను రీసైక్లింగ్ చేయడం
- చెత్త కుప్పలు లేని సమాజం
- 100% వాడుక నీటి నిర్వహణ
- 100% ఓడిఎఫ్ ప్లస్ ఆదర్శ గ్రామాలు

జారీ చేసినవారు : స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్

ప్రజలారా రండి! 'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' లక్ష్యాల సాధనలో ప్రభుత్వానికి సహకరించండి



www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



శనివారం | 18-1-2025 | పేజీలు: 10 + 8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 273 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: పంచమి పూర్తి; నక్షత్రం: పుబ్బ మ. 2.51 తదుపరి ఉత్తర; వర్జ్యం: రా. 10.50-12.37; దుర్ముహూర్తం: ఉ. 6.52-8.21; అమృతఘడియలు: ఉ. 7.53-9.37; రాహుకాలం: ఉ. 9.30-10.30; సూర్యోదయం:6.52; సూర్యాస్తమయం: 5.58 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఈట్ రైట్ స్టేషన్‌గా బెజవాడ

ఫైవ్‌స్టార్ రేటింగ్‌తో ధ్రువీకరించిన ఫుడ్‌సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా

- పరిశుభ్రమైన, సురక్షితమైన ఆహార విధానాలు పాటించినందుకే..
- పదేపదే ఫుడ్ సేఫ్టీ బృందం తనిఖీలు.. కౌన్సెలింగ్ ఫలితంగా..
- 85 శాతం కంటే ఎక్కువ మార్కులతో డివిజన్‌లో రెండోస్థానం
- ఆరు నెలల పూర్తి అధ్యయనం తర్వాత వెల్లడించిన అధికారులు

2లో



శనివారం | 18-1-2025 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

ప్రకాశం బ్యారేజీపైకి నో ఎంట్రీ..







డామిట్.. హెల్మెట్

నగరంలో హెల్మెట్ తప్పనిసరి నిబంధనను పోలీసులు కఠినంగా అమలు చేస్తున్నారు. పండుగ మూడు రోజులు స్తబ్దుగా ఉన్న పోలీసులు... కనుమ తర్వాత రోజు నుంచి తనిఖీలను ముమ్మరం చేశారు. హెల్మెట్‌లేని వాహనదారులకు జరిమానాలు విధిస్తున్నారు. నగరంలోని కీలక రహదారులతో పాటు గల్లీల్లోనూ తనిఖీలు ముమ్మరంగా జరుగుతున్నాయి. శుక్రవారం హెల్మెట్‌లేని వారిని ప్రకాశం బ్యారేజీ మీదకు అనుమతించలేదు. పోలీసుల ఈ తనిఖీలు సత్ఫలితాల నిస్తున్నాయనే చెప్పాలి. ఒకప్పుడు అక్కడక్కడ అరకొరగా కనిపించిన హెల్మెట్‌దారులు ఇప్పుడు చాలాచోట్ల కనిపిస్తున్నారు.



బెంజిసర్కిల్ వద్ద..

మరో రక్షణ గోడ

కృష్ణానదిలో సీతానగరంవైపు త్వరలో నిర్మాణం

- రైల్వేబ్రిడ్జి నుంచి వారధి వరకు 2.160 కిలోమీటర్లు
- జలవనరుల శాఖ ప్రతిపాదనకు మంత్రివర్గ ఆమోదం
- రూ.294.20 కోట్లతో అంచనాలు సిద్ధం



కనకదుర్గమ్మ వారధి వద్ద విజయవాడ వైపు నిర్మించిన రక్షణ గోడ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కృష్ణానది వరద ముంపును అరికట్టడానికి విజయవాడ వైపున రక్షణ గోడ మాదిరిగానే గుంటూరు జిల్లాలోని సీతానగరం, తాడేపల్లి వైపు కూడా రెండో రక్షణ గోడను నిర్మించనున్నారు. దీనికి మంత్రివర్గం శుక్రవారం ఆమోదం తెలిపింది. గత ఏడాది సెప్టెంబరు 1వ తేదీన కృష్ణానదికి భారీగా వరద వచ్చింది. సుమారు 11 లక్షల క్యూసెక్కుల వరద ప్రకాశం బ్యారేజీని తాకింది. అయితే, విజయవాడ వైపు ఉన్న ప్రాంతాలపై పెద్దగా కృష్ణానది వరద ప్రభావం కనిపించలేదు. కానీ, సీతానగరం ఘాట్లపై నుంచి సిమెంట్ రహదారి పైకి నీరు చేరింది. కనకదుర్గ వారధికి అవతలి వైపున ఉన్న విజయవాడ క్లబ్ ప్రహరీని తాకింది. దీంతో ఈ ప్రాంతంలో ఉన్న కరకట్టలు బలహీనపడుతున్నాయి. ఈ నేపథ్యంలో సీతానగరం వైపు రక్షణ గోడను నిర్మించాలని జలవనరుల శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. బ్యారేజీ దిగువన సీతానగరంలోని రైల్వేబ్రిడ్జి నుంచి వారధి వరకు 2.160 కిలోమీటర్ల మేర గోడను నిర్మించాలని ప్రతిపాదించారు. దీనికి రూ.294.20 కోట్ల వ్యయమవుతుందని అంచనాలు రూపొందించగా, మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

రక్షణ ఫలితం ఇదీ..

కృష్ణానదికి వరదలు వచ్చిన ప్రతిసారీ నగరంలోని కొంత ప్రాంతం వరద ముంపు బారిన పడుతుండేది. చిన్నపాటి వరద వచ్చినా, లక్షల క్యూసెక్కుల నీరు బ్యారేజీ నుంచి దిగువకు వచ్చినా కృష్ణలంక, గీతానగర్‌కట్ట, రామలింగేశ్వరనగర్, బాలాజీనగర్ ప్రాంతాలు మునిగిపోయేవి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం సంకల్పించింది. రామలింగేశ్వరనగర్ శ్మశానవాటిక నుంచి గీతానగర్ కట్ట వరకు రక్షణ గోడను నిర్మించింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం గీతానగర్ కట్ట నుంచి పద్మావతి ఘాట్ వరకు ఉన్న పరివాహక ప్రాంతంలో ఈ గోడను నిర్మించింది. గత ఏడాది కృష్ణా, బుడమేరుకు వచ్చిన వరద కారణంగా నగరంలోని భవానీపురం, కొత్తపేట, పాలఫ్యాక్టరీ, అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం, నున్న, కండ్రిక ప్రాంతాలు నీటమునిగాయి. కానీ, రక్షణ గోడ నిర్మించిన కొన్ని ప్రాంతాల్లోకి మాత్రమే వరద నీరు ప్రవహించింది. రామలింగేశ్వరనగర్ శ్మశానం నుంచి యనమలకుదురు వైపునకు రక్షణ గోడ లేకపోవడంతో అటువైపు నుంచి వరద నీరు ప్రవేశించి వీధుల్లోకి చేరింది. ఈ గోడ లేకపోయినట్టయితే ముంపు ప్రభావం భారీగా ఉండేది. ఇలా వరదలు వచ్చినప్పుడు విజయవాడ పరివాహక ప్రదేశానికి రక్షణ ఉన్నప్పటికీ గుంటూరు జిల్లాలోని సీతానగరం, తాడేపల్లి వైపున ఆ పరిస్థితి లేదు. దీంతో విజయవాడ వైపు నిర్మించినట్టుగానే సీతానగరం వైపు కూడా రక్షణ గోడను నిర్మించాలని జలవనరుల శాఖ అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. దీనికి మంత్రివర్గం ఆమోదం తెలపడంతో రెండో రక్షణ గోడ నిర్మాణానికి కొద్దినెలల్లో అడుగులు పడతాయని జలవనరుల శాఖ వర్గాలు తెలిపాయి.

టెర్రర్ ట్రావెల్స్

బెంజిసర్కిల్ వద్ద ప్రాణసంకటంగా ప్రైవేట్ బస్సులు





బెంజిసర్కిల్ మొదటి ఫ్లైఓవర్ నాల్గో నెంబర్ పిల్లర్ వద్ద అడ్డదిడ్డంగా నిలిపిన ట్రావెల్స్ బస్సులు

- ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుకు పార్సిల్ ఇవ్వడానికి బుధవారం ఒక వ్యక్తి బెంజిసర్కిల్ వద్దకు వచ్చాడు. అనారోగ్యం కారణంగా అతనికి వాంతులు కావడంతో ఐదో నెంబరు పిల్లర్ వద్ద ఉన్న ఇనుప బారికేడ్ వద్ద ఆగాడు. వాంతులు చేసుకుంటుండగా, అక్కడే నిలిపి ఉంచిన ట్రావెల్స్ బస్సును డ్రైవర్ ఒక్కసారిగా వెనక్కి తీసుకొచ్చాడు. దీంతో బారికేడ్‌కు, బస్సుకు మధ్య ఆ వ్యక్తి నలిగిపోయాడు. కడుపు లోపలి భాగాలు దెబ్బతినడంతో అంతర్గతంగా రక్తస్రావం జరిగి ఆసుపత్రిపాలయ్యాడు.

- నిత్యం రద్దీగా ఉండే బెంజిసర్కిల్ ప్రాంతంలో ప్రైవేట్ ట్రావెల్స్ పెత్తనం పెచ్చుమీరుతోంది. ఓవైపు జాతీయ రహదారి.. మరోవైపు సర్వీసు రోడ్డును ఆక్రమించేసి, ట్రాఫిక్‌కు అడ్డుగా బస్సులను నిలపడంతో పాటు మిగతా వాహనదారులకు దారి కూడా ఇవ్వకపోగా, పాదచారులకు ప్రాణసంకటంగా మారుతున్నారు.

- ఇష్టానుసారంగా రోడ్డుపైనే నిలిపివేత
- ఎన్‌హెచ్, సర్వీసు రోడ్డును ఆక్రమించేసి పెత్తనం
- ట్రాఫిక్‌కు అడ్డుగా, ప్రయాణికులకు ప్రాణసంకటంగా..
- సర్వీసు రోడ్డును పార్కింగ్‌గా మార్చుకున్న సంస్థలు
- నియంత్రణ లేకపోవడంతో బరితెగింపు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బెంజిసర్కిల్ మొదటి ఫ్లైఓవర్ నాల్గో నెంబర్ పిల్లర్ వద్ద ట్రావెల్స్ బస్సులు ప్రాణసంకటంగా మారాయి. వ్యాపారం, ఆదాయంపైనే దృష్టిపెట్టిన ట్రావెల్స్ కంపెనీలు ఇక్కడ ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అటు నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారిని, ఇటు సర్వీసు రోడ్డును సొంత జాగీరులా మార్చుకుని బస్సులను నిలుపుతున్నాయి. రోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు బెంజిసర్కిల్ సర్వీసు రోడ్డులో ఇదో ప్రత్యక్ష నరకమని వాహనదారులు చెబుతున్నారు.

బస్సెనక బస్సు పెట్టి..

అసలే బెంజిసర్కిల్ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. ఇలాంటి ప్రాంతంలో బస్సెనక బస్సులు నిలుపుతున్నారు. తమ పని పూర్తయ్యాకే మిగిలిన వాహనాలకు దారి ఇస్తామన్నట్టు డ్రైవర్లు వ్యవహరిస్తున్నారు. ట్రావెల్స్ కంపెనీ యజమానులు వారికి వంత పాడుతున్నారు. నారా చంద్రబాబునాయుడు కాలనీ నుంచి జాతీయ రహదారిపైకి వెళ్లడానికి నాలుగు, ఐదు పిల్లర్లకు మధ్యన కటింగ్ ఉంది. ఇదే కటింగ్ ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉంది. ఇక్కడి నుంచి ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు బందరు రోడ్డుపై నుంచి వచ్చి జాతీయ రహదారి ఎక్కుతాయి. నారా చంద్రబాబునాయుడు కాలనీ మిగతా 2లో..

ప్రాణసంకటంగా..


ప్రయాణికులను ఎక్కించుకోవడంపై దృష్టి పెడుతున్న ట్రావెల్స్ డ్రైవర్లు ఇతరుల భద్రతను ఏమాత్రం పట్టించుకోవట్లేదు. అంతేకాకుండా ఈ ప్రాంతాన్ని పార్కింగ్ ప్రదేశంగా మార్చేస్తున్నారు. ఎస్వీఎస్ కల్యాణ మండపం వద్ద రహదారికి ఇరువైపులా ట్రావెల్స్ బస్సులను నిలుపుతున్నారు. అక్కడే మరమ్మతులు చేస్తున్నారు. దీంతో రహదారిపై డీజిల్, ఇంజన్ ఆయిల్ పోస్తున్నారు.

దుర్గగుడిలో మార్పులు

ఉద్యోగుల విధుల్లో కీలక మార్పులు చేర్పులు

వన్‌టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : దుర్గగుడిలో మెరుగైన పరిపాలనా సౌలభ్యం కోసం డిప్యూటీ ఈవో, ఏఈవో, పర్యవేక్షకుల విధుల్లో మార్పులు చేస్తూ ఈవో కె.రామచంద్రమోహన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ ఈవో ఎం.రత్నరాజుకు స్ట్రాంగ్‌రూమ్, జ్యూయెలరీ, ఎఫ్‌డీఆర్ రెన్యువల్స్ హుండీలు, లీజులు, లైసెన్స్‌దారుల వేలంపాటల పర్యవేక్షణ, వీఐపీ ప్రొటోకాల్, కొండ దిగువన, ఎగువన పారిశుధ్య పర్యవేక్షణ అప్పగించారు. ఏఈవో ఎం.దుర్గారావుకు భూములు, లీజులు, న్యాయవిభాగం, శివాలయం ఓవరాల్ ఇన్‌చార్జి, పండుగలు, దత్తత దేవాలయాల విధులను అప్పగించారు. పి.సుధారాణికి చీరలు, ఆడిట్, అకౌంట్స్, సరుకుల సెంటర్ స్టోర్, జనరల్ విధులు కేటాయించారు. జె.శ్రీనివాసమూర్తికి రెలిజియస్, నాన్ రెలిజియస్, ఎస్టాబ్లిష్‌మెంట్, అమ్మవారి మెయిన్ టెంపుల్, సబ్ టెంపుల్స్, ట్రస్ట్‌బోర్డు, ఎస్పీఎఫ్, హోంగార్డు, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల విభాగాల పర్యవేక్షణ, అకామిడేషన్, కనకదుర్గ ప్రభ, కేశఖండన శాలలు, స్టేషనరీ, ఎంబీ ఫారమ్స్, ఫస్ట్ ఎయిడ్ సెంటర్, ఆర్టీఐ యాక్ట్, ధర్మపథం బాధ్యత అప్పగించారు. ఎం.శ్రీనివాసరావుకు అకౌంట్స్, ఐటీ రిటర్న్స్, జీఎస్టీ రిటర్న్స్ స్క్రూటినీ, అన్నదానం విధులు అప్పగించారు. కె.శ్రీనివాసరావుకు శానిటేషన్, దత్తత దేవాలయాలు, ఉపాలయాలు, అకామిడేషన్, ఆర్టీఐ యాక్ట్ విధులు అప్పగించారు. పి.భాగ్యజ్యోతికి మెయిన్ స్టోర్స్, ఆడిట్, జనరల్, చీరల విభాగాలు, తాడి గురురాజుకు ప్రసాదం తయారీ, స్టేషనరీ, ఎండీ ఫారమ్ అప్పగించారు. వీఎన్ జగదీశ్ ప్రసాద్‌కు ఎస్టాబ్లిష్‌మెంట్, వేదపాఠశాల, కొండ దిగువన కౌంటర్ల పర్యవేక్షణ అప్పగించారు. వి.నగేశ్‌కు కొండ దిగువన రిసెప్షన్, కృష్ణమ్మ హారతులు, సీహెచ్‌వీ నరసింహరాజుకు మెయిన్ టెంపుల్, పూజలు, ఫెస్టివల్స్, డీవీవీ సత్యనారాయణకు కౌంటర్ల పర్యవేక్షణ, టోల్‌గేట్, ల్యాండ్స్ లీజులు అప్పగించారు.

ఫీజు.. ఫ్లీజ్



వాహన కాలుష్య తనిఖీ ఫీజులపై నియంత్రణ కొరవడింది. కొన్ని అధీకృత ఏజెన్సీలు అడ్డగోలుగా వసూళ్లకు పాల్పడుతున్నాయి. తప్పులను కప్పి పుచ్చుకోవటానికి కాలుష్య తనిఖీ పత్రాలను వాహన్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయకపోవడంతో ఫిట్‌నెస్‌కు దరఖాస్తు చేసుకున్న వాహనాలకు సామర్థ్య పరీక్ష చేయటానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

వాహన కాలుష్య తనిఖీ ఫీజుల్లో కొరవడిన నియంత్రణ

ఇష్టానుసారంగా వసూలు చేస్తున్న ఏజెన్సీలు

- ప్రశ్నిస్తున్నారని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ నిలుపుదల
- మాన్యువల్ సర్టిఫికెట్లతో సరిపెడుతున్న ఏజెన్సీలు
- వాహనాల ఫిట్‌నెస్ విషయంలో తీవ్ర ఇబ్బందులు
- మూడు దశాబ్దాల కిందటి చార్జీల వల్లే అనధికారిక వసూళ్లు
- ఫీజులను సవరించాలని ఏజెన్సీల విజ్ఞప్తి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మూడున్నర దశాబ్దాల కిందట ఏర్పడిన మోటారు వాహనాల చట్టం మేరకే ఇప్పటికీ వాహన కాలుష్య తనిఖీ ఫీజులు ఉన్నాయి. అప్పట్లో ద్విచక్ర వాహనానికి రూ.15, మూడు, నాలుగు చక్రాల వాహనాలకు రూ.25, అన్ని రకాల డీజిల్ వాహనాలకు రూ.30 చొప్పున కాలుష్య తనిఖీ ఫీజుగా నిర్ణయించారు. కానీ, ఈ ఫీజులను ఏజెన్సీలు వసూలు చేయట్లేదు. అర్ధసంవత్సరానికి రూ.150-రూ.200 వరకు, సంవత్సరానికి రూ.300-రూ.400 వరకు అనధికారికంగా వసూలు చేస్తున్నారు. ఈ విషయంపై రవాణా కేటగిరీకి చెందిన వాహనదారుల నుంచి ఆర్టీఏకు ఎప్పుడూ ఫిర్యాదులు వచ్చేవి కావు. కానీ, రవాణాయేతర కేటగిరీకి సంబంధించి మాత్రం ఫిర్యాదులొస్తున్నాయి. కార్లు వినియోగించే వారు ఎక్కువగా ఫిర్యాదు చేస్తున్నారు.

వాహన్ సైట్‌లో అప్‌లోడ్ చేయరు

వాహన కాలుష్యాన్ని తనిఖీ చేశాక ధ్రువీకరించే సర్టిఫికెట్‌ను వాహన్ సైట్‌లోకి అప్‌లోడ్ చేస్తే వాస్తవంగా ఎంత ఫీజు ఉంటుందో వాహనదారుడికి తెలుస్తుంది. ఉదాహరణకు రూ.100 చెల్లించి వాహనానికి కాలుష్య తనిఖీ నిర్వహించాక ఏజెన్సీలు సదరు వాహనదారుడికి సర్టిఫికెట్‌ను ఇస్తారు. కానీ, వాస్తవ ఫీజు రూ.25లే. ఈ విషయం ఆ సర్టిఫికెట్‌ను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేవరకు వాహనదారుడికి తెలియదు. రూ.25కు రూ.100 చెల్లించామని తెలుసుకుంటున్న వారు ఆర్టీఏకు ఫిర్యాదు చేస్తున్నారు. ఆ తర్వాత అధికారులు సదరు ఏజెన్సీలను బ్లాక్‌లిస్టులో పెడుతున్నారు. ఈ కారణంగా ఏజెన్సీలు వాహన్ సైట్‌లోకి అప్‌లోడ్ చేయకుండా కేవలం మాన్యువల్‌గా సర్టిఫికెట్లను ఇస్తున్నాయి. మాన్యువల్‌గా చేతికి ఇవ్వడం వల్ల వాహన్ సైట్‌లో అప్‌లోడ్ కావట్లేదు. ఫలితంగా కాలుష్య తనిఖీ ధ్రువీకరణ లేని వాహనాలుగానే కనిపిస్తున్నాయి. చాలాకాలంగా రవాణా శాఖ అధికారులు వాహన కాలుష్యంపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించట్లేదు. ఏదైనా సందర్భంలో కాలుష్య తనిఖీ ధ్రువీకరణ పత్రం అడగడంతో వాహనదారులు మాన్యువల్ సర్టిఫికెట్‌ను చూపిస్తున్నారు.

ధరలు సవరించాలి

వాహన కాలుష్య తనిఖీ వ్యవస్థలో పారదర్శకత లోపిస్తోంది. కొన్నిచోట్ల అధిక ధరలు వసూలు చేస్తున్నారు. దీనివల్ల వాహనదారులపై భారం పడుతోంది. అంతకుమించి మిగతా 2లో..

ఫిట్‌నెస్ తంటాలు

వాహనాల ఫిట్‌నెస్ విషయంలోనే ఇబ్బంది తలెత్తుతోంది. వాహనాలకు ఫిట్‌నెస్ చేయించాలంటే కచ్చితంగా పొల్యూషన్ సర్టిఫికెట్ ఉండి తీరాలి. అది కూడా 'వాహన్'లో అప్‌లోడై ఉండాలి. ఏజెన్సీలు మాన్యువల్‌గా సర్టిఫికెట్ ఇవ్వడం వల్ల వాహన్ సైట్‌లో అప్‌లోడ్ కావట్లేదు. దీంతో ఆ వాహనం ఫిట్‌నెస్ లేనిదిగానే చూపిస్తుంది. కాగా, దాదాపు 36 ఏళ్ల కిందట నిర్దేశించిన వాహన కాలుష్య తనిఖీ చార్జీల వల్ల ఏజెన్సీలకు నిర్వహణ ఖర్చు కూడా రావట్లేదు. దీంతో నిర్దేశించిన చార్జీల కంటే అధికంగా వసూలు చేస్తున్నారు. ఈ క్రమంలో అధీకృత వాహన తనిఖీ కేంద్రాల సంఘం నుంచి రేట్లను సవరించాల్సిందిగా డిమాండ్ వస్తోంది. కొన్ని ఏజెన్సీలు చేస్తున్న తప్పుల వల్ల అందరిపై మచ్చపడుతోందని, గిట్టుబాటయ్యే విధంగా రేట్లను సవరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తోంది. దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లో ఏజెన్సీలకు గిట్టుబాటు రేట్లను నిర్ధారించారని, ఇక్కడ కూడా అలాంటి చర్యలు తీసుకోవాలని ఆకాంక్షిస్తోంది.

రాజధాని రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు

- ఈ-లాటరీలో 39 మంది రైతులకు 72 ప్లాట్ల కేటాయింపు

2లో

సర్వజనాస్పత్రిలో పరికరాలు ప్రారంభం

- కీలకమైన పరికరాల రాకతో సత్వర వైద్యసేవలు

నేడు అమిత్‌షా రాక

నగరంలో రెండు రోజులు పటిష్ట బందోబస్తు



- రేపు కొండపావులూరులో ఎన్డీఆర్ఎఫ్, ఎన్డీఐఎం భవనాల ప్రారంభం
- హోటల్ నోవాటెల్ వద్ద ప్రత్యేక భద్రత
- సమన్వయంతో పనిచేయండి : సీపీ రాజశేఖరబాబు సమీక్ష

2లో

ఉమ్మడి కృష్ణాకు ప్రొబేషన్ డీఎస్పీలు

విజయవాడ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణాజిల్లాకు ప్రొబెషనరీ డీఎస్పీలను కేటాయిస్తూ డీజీపీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్టీఆర్ కమిషనరేట్ దక్షిణ మండల ఏసీపీగా దేవినేని పవన్‌కుమార్, గుడివాడకు వి.ధీరజ్ వినీల్, మచిలీపట్నానికి చప్పిడి రాజా, అవనిగడ్డకు తాళ్లూరి విద్యశ్రీని నియమించారు.



రైల్వేస్టేషన్ రద్దీ

సంక్రాంతి సెలవులు ముగియడంతో విజయవాడ రైల్వేస్టేషన్‌లో రద్దీ తారస్థాయికి చేరింది. ప్లాట్‌ఫాంలన్నీ ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. రైళ్లు కూడా కిటకిటలాడు తున్నాయి. సంక్రాంతి సెలవులకు సొంతూర్లకు వచ్చి.. తిరిగి వెళ్తున్న వారితో రైల్వేస్టేషన్ ప్రాంగణంతో పాటు టికెట్ కౌంటర్లు కళకళలాడుతున్నాయి. పండుగను పురస్కరించుకుని రైల్వే అధికారులు ప్రకటించిన ప్రత్యేక రైళ్లు కూడా సరిపోవట్లేదు. సాధారణ రైళ్లలో కూడా కాలు పెట్టలేని పరిస్థితి ఏర్పడింది.

నేడు నగరానికి అమిత్ షా రాక

● పటిష్ట బందోబస్తు నిర్వహిస్తాం: సీపీ రాజశేఖర్ బాబు

గుణదల, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్ షా నగర పర్యటనకు వస్తున్నందున శని, ఆదివారాల్లో నగరంలో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తామని నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు తెలిపారు. అమిత్ షా రాకను పురస్కరించుకుని నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై అధికారులతో సీపీ శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అమిత్‌షా శనివారం ఉదయం గన్నవరం విమానాశ్రయంలో దిగి అక్కడ నుంచి రోడ్డు మార్గాన విజయవాడ మీదుగా ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసానికి చేరుకుంటారని తెలిపారు. అక్కడ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, పలువురు మంత్రులతో కలిసి భోజనం చేస్తారన్నారు. అక్కడ నుంచి తిరిగి నగరంలోని నోవోటెల్‌కు చేరుకుని అక్కడ రాత్రికి బసచేయనున్నట్లు తెలిపారు. నోవోటెల్ పరిసర ప్రాంతాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. అమిత్ షా పర్యటనలో ఉన్న సమయంలో నగరంలోని ఇతర ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా అన్ని ప్రభుత్వశాఖలు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. ఆదివారం ఉదయం ఆయన కృష్ణా జిల్లాలోని ఎన్డీఆర్ఎఫ్ వారి నిదం క్యాంపస్ ప్రారంభ కార్యక్రమానికి వెళతారని తెలిపారు. డీసీపీ గౌతమి షాలి, ఉదయరాణి, కృష్ణమూర్తి నాయుడు, ప్రసాద్, సబ్ కలెక్టర్ చైతన్య, ఏడీసీపీలు ఎం.రాజారావు, ప్రసన్నకుమార్, ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈట్ రైట్ స్టేషన్‌గా విజయవాడ

ఫైవ్ స్టార్ రేటింగ్‌తో ధ్రువీకరించిన ఫుడ్‌సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా





'ఈట్ రైట్ స్టేషన్'సర్టిఫికెట్


ఆనందం వ్యక్తం చేస్తున్న రైల్వే ఉద్యోగులు

రైల్వేస్టేషన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పరిశుభ్రమైన, సురక్షితమైన ఆహార విధానాలను అవలంబించినందుకు ఫుడ్‌సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి విజయవాడ రైల్వే స్టేషన్‌కు 'ఈట్ రైట్‌స్టేషన్' ధ్రువీకరణ లభించింది. అన్నవరం, గుంటూరు, నడికుడి, హైదరాబాద్‌లోని నాంపల్లి స్టేషన్ తర్వాత ఎస్ఈఆర్ జోన్‌లో ఐదో స్టేషన్‌గా, విజయవాడ డివిజన్‌లో రెండోదిగా విజయవాడ రైల్వేస్టేషన్‌గా నిలిచింది. 85 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించి 5స్టార్ గుర్తింపు పొందింది. విజయవాడ నుంచి రోజూ లక్ష మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. వీరందరికీ నాణ్యమైన ఆహారాన్ని అందించటానికి ఫుడ్ సేఫ్టీ, ట్రైనింగ్ సర్టిఫికేషన్‌లో ఇక్కడి స్టాళ్ల యజమానులు, కేటరింగ్ విక్రేతలు ఆహారాన్ని రవాణా చేసేవారు శిక్షణ పొందారు. విజయవాడ రైల్వే హాస్పిటల్ చీఫ్ సూపరింటెండెంట్ ఎం.శౌరిబాల ఆధ్వర్యంలో ఫుడ్ సేఫ్టీ బృందం పలు పర్యాయాలు కౌన్సెలింగ్ నిర్వహించింది. ఆహార భద్రత, పరిశుభ్రత, ప్రమాణాలు, విక్రయదారుల వ్యక్తిగత పరిశుభ్రత, రక్షణ పరికరాలు, ఉత్పత్తుల గడువు తేదీలు, శీతోష్ణస్థితి, ఉష్ణోగ్రత విధానాలు, చెత్తను పారవేయడం, తడి, పొడి చెత్త విభజనపై నిరంతర పర్యవేక్షణ జరిగింది. ప్రారంభంలో ప్రీ ఆడిట్‌ను కూడా నిర్వహించారు. ఫుడ్ సేఫ్టీ అథారిటీ ఎం ప్యానెల్ థర్డ్ పార్టీ ఆడిట్‌ను నిర్వహించింది. ఆరు నెలల పాటు పూర్తి పర్యవేక్షణ, అధ్యయనం తరువాత ఈ సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ సర్టిఫికెట్ 2027 జనవరి వరకు అమలులో ఉంటుంది. సిబ్బందిని డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్, డాక్టర్ శౌరిబాల, వావిలపల్లి రాంబాబు, ఎండీ ఆలీఖాన్, ఎంశైలజ, కె.అనిల్‌కుమార్, రహంతుల్లా అభినందించారు.

మాతా శిశు మరణాల కట్టడికి
సమన్వయంతో పనిచేయండి

● వైద్య ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికల్లో రక్తహీనత నివారణ, మాతా శిశు మరణాల కట్టడికి వైద్య ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి పదేళ్ల నుంచి పందొమ్మిదేళ్ల వయస్సులోపు బాలికలు, 49 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన మహిళలకు ఎప్పటికప్పుడు పరీక్షలు చేసి రక్తహీనతను గుర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రక్తహీనత కలిగిన వారికి అవసరమైన ఐరన్ ట్లాబ్లెట్లు, ఇంజక్షన్లు, పౌష్టికాహారం అందించి రక్తహీనతను నివారించేందుకు వైద్య మహిళా శిశు సంక్షేమ అధికారులు సంయుక్తంగా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణులను గుర్తించి వారికి ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను పంపిణీ చేయాలని సూచించారు. సాధ్యమైనంతవరకు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది తరచూ గర్భిణీల ఇళ్లను సందర్శించి రక్తహీనత సమస్య ఏర్పడకుండా పౌష్టికాహారం తీసుకొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. మాతా, శిశు సంరక్షణకు ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొనేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంలో నిర్లక్ష్యం చూపకుండా చూడాలన్నారు. జిల్లాలో నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని అమలు చేయడంలో వైద్య ఆరోగ్య మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని, డీసీహెచ్‌సీ డీసీకే నాయక్, ఎన్టీఆర్ ఆరోగ్య ట్రస్ట్ జిల్లా కో-ఆర్డినేటర్ జె.సుమన్, మహిళా శిశు సంక్షేమ శాఖ సీడీపీవోలు జి.మంగమ్మ, కె.నాగమణి, లక్ష్మీభార్గవి, భాగ్యరేఖక, సత్యవతి, పుష్పవతి, నోడల్ ఆఫీసర్ సాయిగీత, ప్రోగ్రాం ఆఫీసర్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

రాజధాని రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు

● ఈ-లాటరీలో 39 మంది రైతులకు 72 ప్లాట్లు కేటాయింపు


రాజధాని రైతులకు ప్లాట్ల పత్రాలు అందజేస్తున్న సీఆర్డీయే అధికారులు

వన్‌టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణానికి ల్యాండ్ పూలింగ్ స్కీం(ఎల్‌పీఎస్) కింద భూములు ఇచ్చిన రైతులకు సీఆర్డీయే కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం నగరంలోని సీఆర్డీయే కార్యాలయంలో ఈ-లాటరీ నిర్వహించి ప్లాట్లను కేటాయించారు. రైతులకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా నివాస, వాణిజ్య ప్లాట్లకు ముందుగా ట్రయల్ రన్ వేసి తరువాత ప్రత్యక్ష లాటరీ ప్రక్రియను చేపట్టారు. ఈ-లాటరీలో ప్లాట్లు పొందిన రైతులకు భౌగోళికంగా వారి ప్లాట్లు ఎక్కడ కేటాయించారో వివరించడానికి ప్రత్యేకంగా జీఐఎస్ సిబ్బంది, గ్రామ సర్వేయర్లను నియమించారు. అబ్బరాజుపాలెం, రాయపూడి 1 అండ్ 2, కొండమరాజుపాలెం, వెలగపూడి, మందడం 1 అండ్ 2, గ్రామాలకు సంబంధించిన 39 మంది రైతులకు 72 ప్లాట్లను కేటాయించారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ సౌకర్యవంతంగా జరిగేందుకు అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది రిజిస్ట్రేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసిందని రైతులకు అధికారులు తెలిపారు. ఈ-లాటరీ కార్యక్రమంలో గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవతేజ, సీఆర్డీయే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.ఎస్.భాగ్యరేఖ, కె.స్వర్ణమేరి, ప్లానింగ్ విభాగ డైరెక్టర్ బి.సురేష్ కుమార్, తహసీల్దార్ అరుణాదేవి తదితరులు పాల్గొన్నారు.

పండగ చేసుకున్నారు!

● పోలీసులకు బరికి రూ.30 వేల నుంచి రూ.3లక్షలు

● నిర్వాహకుల నుంచి వసూలు చేసి, మూడురోజులూ మిన్నకున్నారని ఆరోపణలు

(ఆంధ్రజ్యోతి-నందివాడ): హైకోర్టు ఆదేశాల ప్రకారం సంక్రాంతి పండుగ మూడు రోజులు జూదాలు, కోడి పందేలు నిర్వహిస్తే శిక్షార్హులు అంటూ పోలీసులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు గ్రామాల్లో బ్యానర్లు ఏర్పాటు చేశారు. మైకుల ద్వారా నానా హడావిడి చేశారు. పోలీసులు గ్రామాల్లో నానా హడావిడి చేశారు. మండలంలో గోపాలపురం, పోలుకొండ, గండేపూడి, నందివాడ, పుట్టగుంట గ్రామాల్లో కోడి పందేలు బరులు నిర్వహించారు. ఈ ఏడాది కూడా పోలీసు అధికారులు బరి స్థాయిమేరకు నిర్వాహకుల నుంచి రూ.30 వేల నుంచి రూ.3 లక్షల వరకు ముక్కు పిండి వసూళ్లు చేసి, పండగ చేసుకున్నారని పందెపురాయుళ్లు ప్రచారం చేస్తున్నారు. పండుగ మూడు రోజులు పందెం బరుల్లో పేకాట, కోడి పందేలు, గుండాట, చిత్తులాట, బిర్యానీ పాయింట్లు నిర్వహించినా పోలీసు అధికారులు వీరి వంక కన్నెత్తి చూడలేదు. బరుల్లో గొడవలు జరిగినా తమకేమీ తెలియదన్నట్లు పట్టించుకోలేదు. బరులు ఏర్పాటు చేసిన కొంతమంది కనీసం పోలీసులకు కట్టిన డబ్బులు కూడా రాలేదని నెత్తినోరు బాదుకుంటున్నారు.


స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె.పట్టాభిరామ్‌కు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న డిప్యూటీ ఈవో రత్నరాజు, అర్చకులు

కనకదుర్గమ్మను దర్శించుకున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్

వన్‌టౌన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో కనకదుర్గమ్మను శుక్రవారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె.పట్టాభిరామ్ దర్శించుకున్నారు. ఆయనకు డిప్యూటీ ఈవో రత్నరాజు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. దర్శనానంతరం డిప్యూటీ ఈవో రత్నరాజు, అర్చకులు ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు. వేదపండితులు ఆశీస్సులు అందజేశారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

విజయవాడకు చెందిన శ్రీనృత్య కళానిలయం నాట్యాచారిణి గోనుగుంట శైలశ్రీ ఆధ్వర్యంలోని కళాకారుల బృందం శుక్రవారం దుర్గగుడి కళావేదికపై కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించింది. లావణ్య, కాత్యాయని, రాశ్యా, భావన, ఖ్యాతిక, గుణసహస్ర, రితిక, జష్విత, చంద్రవర్షిణి, తన్మయిలు నాట్య ప్రదర్శనలో పాల్గొని 11 కీర్తనలకు చక్కని హావభావాలతో తాళ, లయలకు అనుగుణంగా నాట్య ప్రదర్శన చేసి ఆహూతులను ఆకట్టుకున్నారు.


ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్‌కు స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకుడు ఉమామహేశ్వరరావు

జలధీశ్వరస్వామి సేవలో అడ్వకేట్ జనరల్


ఘంటసాల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అడ్వకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్, తన కుటుంబసభ్యులతో కలిసి బాలపార్వతీ సమేత జలధీశ్వరస్వామిని శుక్రవారం దర్శించుకున్నారు. స్వామికి ఆలయ అర్చకుడు మొవ్వ ఉమామహేశ్వరరావు విశేష పూజ లు చేశారు. ప్రసాదాన్ని, దేవాలయ చిత్రపటాన్ని, చరిత్ర పుస్తకాలను దమ్మాలపాటికి అందజేశారు.

ఆర్థిక సహాయం అందించండి

● ఎంపీ కేశినేని చిన్నికి పర్వతారోహకుడు చిన్నికృష్ణ వినతి

వన్‌టౌన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): తనకు గత ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని అందించాలని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)ని అనంతపురం జిల్లా పామిడి మండలం పాళ్యం తండాకు చెందిన పర్వతారోహకుడు రామావత్ చిన్నికృష్ణ కోరారు. శుక్రవారం ఎంపీని గురునానక్ కాలనీలోని కార్యాలయంలో ఆయన కలిశారు. గత ప్రభుత్వంలో తనకు జరిగిన అన్యాయాన్ని ఎంపీకి వివరించారు. హిమాలయ పర్వత ప్రాంతంలో రేనాక్ పర్వతాన్ని జమ్మూకశ్మీర్‌లో బైసరన్ పర్వతాన్ని 2018లో దక్షిణాఫ్రికాలోని కిలిమంజారో పర్వతాన్ని, రష్యాలో ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహించానని చిన్నికి వివరించారు. హైరేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు, మల్టీ టాలెంటెడ్ స్పోర్ట్స్ పర్సన్ అవార్డ్ సాధించిన రామావత్‌ను ఎంపీ అభినందించారు. సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

సర్వజనాస్పత్రిలో వైద్య పరికరాలు ప్రారంభం


వైద్య పరికరాలను ప్రారంభిస్తున్న డాక్టర్ పి.అశోక్ కుమార్, డాక్టర్ ఏవీ రావు

ప్రభుత్వాసుపత్రి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా సర్వజనాస్పత్రిలోని ఈఎన్‌టీ విభాగానికి అందిన ఫ్లెక్సిబుల్ బ్రాంకోస్కోప్, హార్మోనిక్ స్కాల్‌పెల్, అడ్వాన్స్‌డ్ కాట్రీ, ఇంపిడెన్స్ ఆడియోమెట్రీ పరికరాలను ప్రొఫెసర్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, ప్రిన్సిపల్ ప్రొఫెసర్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏవీ రావు, హెచ్‌వోడీ డాక్టర్ కె.రవి శుక్రవారం ప్రారంభించారు. ఫ్లెక్సిబుల్ బ్రాంకోస్కోప్‌తో స్వరపేటిక, గురక సమస్యలు, గొంతు క్యాన్సర్ నిర్ధారణ వేగంగా చేయొచ్చని డాక్టర్ కె.రవి తెలిపారు. హార్మోనిక్ స్కాల్‌పెల్‌తో త్వరిగతిన థైరాయిడ్ ఆపరేషన్లు, స్వరపేటిక క్యాన్సర్ ఆపరేషన్లు, మెడపై పెద్ద కణితలను తొలగించవచ్చన్నారు. డాక్టర్ ఎస్.వినయ్‌కుమార్, ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ టాక్టర్ టి.లీలాప్రసాద్, డాక్టర్ పి.రత్నబాబు, డాక్టర్ జీబీ శ్రీనివాస్, డాక్టర్ పి.ఆదిత్య, డాక్టర్ పి.స్పందన పాల్గొన్నారు.

ఫీజు.. ప్లీజ్

(1వ పేజీ తరువాయి)

'వాహన్'లో అప్‌లోడై ఉండాలి. ఏజెన్సీలు మాన్యువల్‌గా సర్టిఫికెట్ ఇవ్వడం వల్ల వాహన్ సైట్‌లో అప్‌లోడ్ కావట్లేదు. దీంతో ఆ వాహనం ఫిట్‌నెస్ లేనిదిగానే చూపిస్తుంది. కాగా, దాదాపు 36 ఏళ్ల కిందట నిర్దేశించిన వాహన కాలుష్య తనిఖీ చార్జీల వల్ల ఏజెన్సీలకు నిర్వహణ ఖర్చు కూడా రావట్లేదు. దీంతో నిర్దేశించిన చార్జీల కంటే అధికంగా వసూలు చేస్తున్నారు. ఈ క్రమంలో అధీకృత వాహన తనిఖీ కేంద్రాల సంఘం నుంచి రేట్లను సవరించాల్సిందిగా డిమాండ్ వస్తోంది. కొన్ని ఏజెన్సీలు చేస్తున్న తప్పుల వల్ల అందరిపై మచ్చపడుతోందని, గిట్టుబాటయ్యే విధంగా రేట్లను సవరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తోంది. దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లో ఏజెన్సీలకు గిట్టుబాటు రేట్లను నిర్ధారించారని, ఇక్కడ కూడా అలాంటి చర్యలు తీసుకోవాలని ఆకాంక్షిస్తోంది.

జీఏడీ పరిధిలోకి ఏవియేషన్ కార్పొరేషన్

● ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ విజయానంద్

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఏవియేషన్ కార్పొరేషన్ లిమిటెడ్‌ను ప్రభుత్వం సాధారణ పరిపాలన శాఖలోని ప్రొటోకాల్ విభాగానికి బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఏవియేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ ప్రస్తుతం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ విభాగం పరిధిలో ఉంది. దీనిని జీఏడీలోని ప్రొటోకాల్ విభాగానికి బదిలీ చేస్తూ సవరణ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం జారీ చేసింది. 2018 వరకూ ఈ కార్పొరేషన్ జీఏడీ పరిధిలోనే ఉంది. విమానాశ్రయాల అభివృద్ధి నిమిత్తం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు బదలాయించారు. ఇప్పుడు మళ్లీ జీఏ డీకి పరిధిలోకి తీసుకువచ్చారు. ఇకపై ఈ కార్పొరేషన్ పరిపాలన వ్యవహా రాలు మొత్తం జీఏడీ పరిధిలోనే ఉంటాయి. మరో ఉత్తర్వుతో ఏపీ డిజిటల్ కార్పొరేషన్‌ను ప్రభుత్వం సమాచార శాఖ పరిధిలోకి తీసుకువచ్చింది. ఏపీ డిజిటల్ కార్పొ రేషన్ కూడా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ విభాగం పరిధిలో ఉంది. తాజా మార్పుతో ఇకపై సమాచార శాఖ పరిధిలోనే డిజిటల్ కార్పొరేషన్ పాలన మొత్తం నడవనుంది.

కుష్ఠుపై 20 నుంచి అవగాహన కార్యక్రమాలు

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కుష్ఠుపై అవగాహన, బాధితుల గుర్తింపు, ఉచితంగా మందుల పంపిణీపై జనవరి 20 నుంచి ఫిబ్రవరి 2 వరకూ కార్యక్రమాల్ని విస్తృతంగా, పకడ్బందీగా నిర్వహించాలని శుక్రవారం జిల్లా వైద్యాధికారులను ప్రజారోగ్య సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి ఆదేశించారు. పట్టణ, గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ప్రతి ఒక్కరినీ పరీక్షించాలని, అనుమానిత కేసులను దగ్గరలోని పీహెచ్‌సీకి పంపాలని, అక్కడ పరీక్షలయ్యాక ఉచితంగా మందులిస్తారని తెలిపారు.

టెర్రర్ ట్రావెల్స్

(1వ పేజీ తరువాయి)

నుంచి వచ్చే వాహనాలు నాల్గో నెంబరు పిల్లర్ వద్ద నుంచి జాతీయ రహదారిపైకి ఎక్కుతాయి. నిత్యం సాయంత్రం 6 గంటల నుంచి ఈ మార్గాన్ని ట్రావెల్స్ బస్సులు మూసేస్తున్నాయి. ఒక బస్సు వెనుక మరో బస్సును ఆపేసి కటింగ్‌ను మూసేస్తున్నారు. దీంతోపాటు కటింగ్‌కు రెండు వైపులా బస్సులను నిలుపుతున్నారు. దీనివల్ల జాతీయ రహదారి నుంచి చంద్రబాబు నాయుడు కాలనీలోకి వచ్చే వాహనాలు అక్కడే నిలిచి పోతున్నాయి. హారన్లు ఎంతసేపు మోగించినా బస్సు డ్రైవర్లలో చలనం ఉండట్లేదు. ప్రయాణికులను ఎక్కించుకుని, లగేజీని సర్దిన తర్వాతే ఇతర వాహనాలకు దారి ఇస్తున్నారు.


చీమలపాడులో తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

ఎరువుల దుకాణాల్లో
ఆకస్మిక తనిఖీలు

తిరువూరు/ఎ.కొండూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని తిరువూరు, ఎ.కొండూరు మండలాల్లోని ఎరువుల దుకాణాల్లో జిల్లా వ్యవసాయాధికారుల ఆదేశాల మేరకు అంతర్గత స్క్వాడ్ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఏడీఏ ఎం.శ్రీనివాసరావు, ఏవో పద్మ ఎరువుల నిల్వలు, ఈ పాస్‌లో నిల్వలు పరిశీలించారు. ఎరువుల అమ్మకాలకు సోర్స్ సర్టిఫికెట్(ఓ ఫాం), బయో స్టిములెంట్ల సంబంధించిన పత్రాలు చూపని చీమలపాడు సాయి ఎంటర్‌ప్రైజస్ దుకాణంలో రూ.3.54 లక్షలు, ఎ.కొండూరులోని శ్రీలక్ష్మీ గణపతి ఎంటర్‌ప్రైజస్‌లో రూ.1.48 లక్షలు, కంభంపాడులో శ్రీలక్ష్మీహనుమాన్ ట్రేడర్స్‌లో రూ.4.49 లక్షలు మొత్తం రూ.9.52 లక్షల విలువైన ఎరువుల విక్రయాలను తాత్కాలికంగా నిలిపివేసినట్టు అధికారులు తెలిపారు. పత్రాలను నాలుగురోజుల్లో వ్యవసాయశాఖ కార్యాలయంలో అందించాలని, లేనిపక్షంలో కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువులు అమ్మకాలు జరిపే ప్రతి డీలరు తప్పనిసరిగా, ఫిజికల్, ఈ-పోస్‌లో స్టాక్ తేడా లేకుండా చూసుకోవాలని, రోజూ అమ్మిన స్టాకు వివరాలు ఈ-పోస్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఎ.కొండూరు ఏవో టిప్పుసుల్తాన్ పాల్గొన్నారు.

రూ.2.14 లక్షల విలువైన ఎరువుల విక్రయాలు నిలిపివేత

ఇబ్రహీంపట్నం: ఫారం ఓ గడువు ముగియడం, రిజిస్టర్ సరిగా పొందుపర్చకపోవడం, స్టాక్ సరైన వ్యవధిలో ఎక్‌నాలెడ్జ్‌మెంట్ చేయకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న రూ.2.14 లక్షల విలువైన ఎరువుల విక్రయాలను నిలిపివేసినట్లు నందిగామ ఏడీఏ కె.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం పలు ఎరువులు, పురుగుమందు దుకాణాల్లో ఆయన తనిఖీలు చేశారు. రికార్డులను పరిశీలించారు. నిబంధనలు పాటించని డీలర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏవో డి.శైలజ పాల్గొన్నారు.

రైతుల ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

● అధికారులకు సీఆర్డీయే అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ ఆదేశం

కృష్ణలంక, జనవరి 17(ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్ డేలో రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఇతర అధికారులను సీఆర్డీయే అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. శుక్రవారం తుళ్లూరులోని సీఆర్డీయే ప్రాంతీయ కార్యాలయంలో గ్రీవెన్స్‌డేలో రాజధాని రైతులు, రైతుకూలీలు నుంచి ఆయన ఫిర్యాదులను స్వీకరించారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గ్రీవెన్స్ డేను రాజధాని ప్రాంత రైతులు వినియో గించుకోవాలని ఆయన సూచించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు కె.స్వర్ణమేరి, పి.పద్మావతి, జి.రవీందర్, ఏజీ చిన్నికృష్ణ, బి.సాయి శ్రీనివాస్ నాయక్, సామాజిక అభివృద్ధి విభాగ డీసీడీఓ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


తుళ్లూరులోని ప్రాంతీయ కార్యాలయంలో రాజధాని రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న సీఆర్డీయే అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్

ఈపీఎస్, ఓపీఎస్ ఆప్షన్ సమస్య పరిష్కరించండి

● ప్రజా రవాణా సంస్థ డిప్యూటీ సీపీఎం(ఏ) జయశంకర్‌కు పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ వినతి

బస్‌స్టేషన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఈపీఎస్, ఓపీఎస్ ఆప్షన్ సమస్యను పరిష్కరించాలని డిప్యూటీ సీపీఎం(ఎ) జయశంకర్‌ను ప్రజా రవాణా సంస్థ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు కోరారు. ప్రజా రవాణా సంస్థ ఉద్యోగుల నుంచి ఈపీఎస్, సీపీఎస్ ఆప్షన్ తీసుకున్నప్పటికీ ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవటంతో ఉద్యోగులు కష్టనష్టాలపై చర్చించేందుకు శుక్రవారం కేంద్ర కార్యాలయంలో జయశంకర్ సమక్షంలో అసోసియేషన్ నాయకులు సమావేశం నిర్వహించారు. ఉద్యోగులు నష్టపోతున్నారని, రాతపూర్వకంగా విజ్ఞప్తి చేస్తూ సత్వర నిర్ణయం తీసుకోవాలని ఇంతకుముందే అసోసియేషన్ కోరిందని తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, సంయుక్త కార్యదర్శి ఎస్.రాజేష్ కుమార్ పలు ప్రతిపాదనలు చేశారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన గవర్నమెంట్ పెన్షన్ స్కీమ్ విధానాలను తెలియజేసి, ఉద్యోగుల నుంచి ఈపీఎస్, సీపీఎస్ ఆప్షన్ ఎంచుకోవాలని నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. ఆప్షన్ ఓపెన్‌లో ఉంచాలని అప్పట్లో అసోసియేషన్ కోరిందని, అయితే ఇప్పటి వరకు ప్రభుత్వం ఏ చర్య తీసుకోకపోవటం వల్ల సీపీఎస్‌కు ఆప్షన్ ఇచ్చిన ఉద్యోగులకు ఎటువంటి ప్రయోజనం కలగలేదన్నారు. కూటమి ప్రభుత్వం రావటంతో సీపీఎస్‌పై ప్రభుత్వం అభిప్రాయమేమిటో ఇంతవరకు తెలియరాలేదన్నారు. ఈపీఎస్, సీపీఎస్‌కు ఎంతమంది ఆప్షన్ ఇచ్చారో వివరాలు ఇవ్వాలని కోరారు. వివరాలు వచ్చిన తరువాత ఏమి చేస్తామన్నది తెలియజేస్తామని చెప్పారు. వీలైనంత త్వరగా నిర్ణయం వెలువడే విధంగా అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి అసోసియేషన్లను కూడా భాగస్వామ్యం చేస్తూ చర్యలు తీసుకోవాలని కోరారు. నాలుగేళ్లుగా సీపీఎస్ ఆప్షన్ విషయంలో ప్రభుత్వ పరంగా ఆలస్యం అయినందున జీవో నెం.113లో కటాఫ్ డేట్ ఇవ్వనందున ఉద్యోగులకు నష్టం కలుగుతుందని, దీంతో మరొకసారి ఆప్షన్ తీసుకుని ఆనాటి నుంచి అర్హత వచ్చే వచ్చే విధంగా ప్రభుత్వం అనుమతి కొరకు లేఖ రాయాలని కోరారు. 7,500 మంది ఆప్షన్ ఇచ్చారని, మళ్లీ ఆప్షన్ ఇచ్చుకునేందుకు ఈ ఏడాది ఫిబ్రవరి చివరి తేదీ అని డిప్యూటీ సీపీఎం(ఎ) బదులిచ్చారు. ఈ సమయం సరిపోదని, మరికొంత సమయం కావాలని నాయకులు కోరారు. ఈ అంశాన్ని ఎండీ దృష్టికి తీసుకువెళ్లి మిగిలిపోయిన ఉద్యోగులందరికీ కూడా ఆర్‌పీఎస్-2017 మేరకు బకాయిలను పూర్తిస్థాయిలో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140,149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 500

పాస్టర్లపై జరుగుతున్న దాడులపై ప్రభుత్వం స్పందించాలి

ధర్నాచౌక్: రాష్ట్రంలో చర్చిలు, పాస్టర్లపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని వైసీపీ క్రిస్టియన్‌సెల్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాన్ బెన్నీలింగం అన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ రాష్ట్రంలో క్రైస్తవ మతాన్ని అణగదొక్కే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నారన్నారు. చిత్తూరు జిల్లాలోని రేణిగుంటలో ఎస్టీ పాస్టర్‌పై దాడి చేసి అక్కడ చర్చిని కూల్చివేశారన్నారు. పుంగనూరులో కొందరు పాస్టర్లపై దాడి జరిగిందన్నారు. పాస్టర్లకు గౌరవవేతనం నేటికీ ఇవ్వలేదని విమర్శించారు. చర్చిల నిర్మాణానికి నిధులు కేటాయించాలని, జెరూసలేం యాత్రకు నిధులు పెంచాలన్నారు.

స్వల్పకాలిక వ్యవధి కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

భారతీనగర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించే స్వల్పకాలిక వ్యవధి కోర్సుల శిక్షణకు ఈనెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ విజయసారథి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ సెంటర్‌లో ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సులకు మూడు నెలల శిక్షణ ఉంటుంది. ఈ కోర్సులకు ఎంపికైన అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ సౌకర్యం కల్పిస్తామన్నారు. 8, 10వ తరగతి, ఐటీఐ, ఇంటర్మీడియట్, డిప్లొమో, ఆపైన అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఈ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు వివరాలకు 9985759304, 8328252829 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ విజయసారధి తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పటమట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్లకు అడ్డువచ్చే చెట్ల కొమ్మలు తొలగించే క్రమంలో అయ్యప్పనగర్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లాక్ రోడ్డు, బీఎస్‌ఆర్ రోడ్డు, వెలగపూడి వారి స్ట్రీట్, గొట్టిపాటి బ్రహ్మయ్య స్ట్రీట్, భవానీశంకర్ రోడ్డు, పోలీస్‌రోడ్డు, సాయి రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

భారతీనగర్: రింగ్‌రోడ్డు సెక్షన్ పరిధిలోని విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ నిలిపివేయుచున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దార్థనగర్ (1వ రోడ్డు నుంచి 5వ రోడ్డు వరకు), సిద్ధార్థ కళాశాల జంక్షన్, నవోదయా కాలనీ, ఎస్‌బీహెచ్ కాలనీ, సున్నపుబట్టీల సెంటర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు నిర్మాణానికి ప్రణాళికలు

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నది రిటైనింగ్ వాల్ పక్కన రోడ్డుతో పాటుగా డ్రెయినేజీ పంపింగ్ స్టేషన్ల నిర్మాణం పూర్తి చేసి ఆ ప్రాంత వాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జీవనం సాగించేలా చూడాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కార్పొరేషన్, ఇంజనీరింగ్ విభాగాల అధికారులను ఆదేశించారు. శుక్రవారం పటమటలో తన కార్యాలయంలో నియోజకవర్గంలోని పలు ప్రాజెక్టులపై ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ రామలింగేశ్వర్ నగర్‌లోని రుద్రభూమి వద్ద నుంచి భూపేష్‌గుప్తా నగర్ వరకు కృష్ణా రిటైనింగ్ వాల్ పక్కన రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. జనరేటర్లతో కూడిన ఐదు పంపింగ్ స్టేషన్ల నిర్మాణం చేసేందుకు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

అంచనాలు సిద్ధం చేయాలన్నారు. వరదలు వచ్చినా చుక్క నీరు ఇళ్లను ముంచెత్తకుండా చూడవచ్చారన్నారు. ఏపీ సీఎం చంద్రబాబుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేషన్ సీఈ శ్రీధర్ రెడ్డి, ఈఈ సామ్రాజ్యంతో పాటుగా కన్సల్టెంట్ ప్రతినిధులు కె.వి మనోజ్, కృష్ణ చైతన్య, గద్దె రమేష్‌లు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఇస్త్రీ పెట్టెలు అందజేత

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అశోక్‌నగర్‌లోని కార్యాలయంలో శుక్రవారం ఏడుగురు రజక సోదరులకు రూ.50 వేలతో కొనుగోలు చేసిన ఇస్త్రీ పెట్టెలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం గొప్ప బహుమతిని ఇచ్చిందన్నారు. సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి మాట్లాడుతూ 80 మందికి కుట్టు మిషన్లు, ప్రతి నియోజకవర్గంలో జనరిక్ మెడికల్ షాపులు, గొర్రెలు పాడి గేదెలు త్వరలో కార్పొరేషన్ తరఫున అందించనున్నట్లు తెలిపారు. చెన్నుపాటి గాంధీ, రాధారపు ఎల్లబాబు, శొంఠి నాగేశ్వరరావు, మల్లెల లక్ష్మీనారాయణ, చిలకలపూడి లక్ష్మీనరసింహారావు, మల్లెల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్

నిత్యం వ్యర్థ సేకరణ జరగాలి

ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్

కృష్ణలంక, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : చెత్తసేకరణలో ఎటువంటి లోపం లేకుండా వుండాలని, ప్రతిరోజు వ్యర్థ సేకరణ ఖచ్చితంగా జరుగుతుండాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం కృష్ణలంక 21వ డివిజన్ తదితర ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు వ్యర్థ సేకరణ జరుగుతుండాలని, ఆ వార్డులో తరచుగా వ్యర్థాలు వేసే ప్రదేశాలను గుర్తించి, ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తుండాలని ఆదేశించారు. అనంతరం పొట్టి శ్రీరాములు హైస్కూల్ పక్కనే వున్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. ఆహార నాణ్యతలో, పరిశుభ్రతలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని ఆయన ఆదేశించారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

పట్టణ పౌరసమాఖ్య రాష్ట్ర నాయకుడు చిగురుపాటి బాబూరావు



మాట్లాడుతున్న పట్టణ పౌరసమాఖ్య రాష్ట్ర నాయకుడు చిగురుపాటి బాబూరావు

మొగల్రాజపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, శాస్త్రీయ విజ్ఞానాన్ని సంపాదించి సమాజ శ్రేయస్సుకోసం పాటుపడాలని పట్టణ పౌరసమాఖ్య రాష్ట్ర నాయకులు చిగురుపాటి బాబూరావు హితవు పలికారు. సంక్రాంతి సందర్భంగా 13, 14, 15 తేదీల్లో భారత ప్రజాతంత్ర యువజన సంఘం, మహిళా సంఘం కమిటీ ఆధ్వర్యంలో బాలబాలికలకు నిర్వహించిన ఆటలు పోటీలు, మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి శుక్రవారం సాయంత్రం 7వ డివిజన్ భగత్‌సింగ్ గ్రంథాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాజం పట్ల బాధ్యతగా ఉంటూ మతోన్మాద శక్తులను సమాజంలో నుంచి పారదోలాలని పిలుపు ఇచ్చారు. అడుసుమిల్లి ప్రతిమ పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించడంతో పాటు బహుమతులను స్పాన్సర్ చేశారు. జిల్లా కార్యదర్శి శ్రీదేవి, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐలు రాష్ట్ర నాయకులు సంపర శ్రీనివాస్, ఆంధ్రా డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శిల్ప, ఎల్ఐసీ జాతీయ నాయకులు , సీఐటీయూ రాష్ట్ర నాయకులు సుధాకర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, గరికపాటి సునంద, పౌరసంక్షేమ సంఘం నాయకులు మురహరి, దావులూరి శ్రీనివాస్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ధర్మారావు, బాలబాలికలు, మహిళలు పాల్గొన్నారు.



సీపీ రాజశేఖరబాబుకు విరాళం అందజేస్తున్న పటమటలంక అపార్ట్‌మెంట్‌వాసులు

సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.2లక్షల విరాళం

- సీపీకి అందజేసిన పటమటలంక అపార్ట్‌మెంట్ వాసులు

విజయవాడ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : పటమటలంక త్వరలో పూర్తిగా నిఘాలో ఉండబోతుంది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీలో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి పటమటలంకలోని అపార్ట్‌మెంట్లవాసులు ముందుకు వచ్చారు. పటమటలంక వాసి కురదవెల్లి వెంకట నరసయ్య ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్ చెన్నుపాటి గాంధీతోపాటు ఏడుగురు రూ.2లక్షల విరాళాన్ని పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబుకు అందజేశారు. వారిని పోలీసు కమిషనర్ అభినందించారు.

సిద్ధార్థ దంతవైద్య కళాశాలలో 20 నుంచి దంత వైద్యశిబిరం

ఉంగుటూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : జాతీయ కట్టుడు పళ్ల విభాగం వారోత్సవాల సందర్భంగా గన్నవరం మండలంలోని చినఅవుటపల్లి డాక్టర్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంతవైద్య కళాశాలలోని కట్టుడు పళ్ల విభాగం (రూమ్‌నెం-4)లో ఈ నెల 20నుంచి 31వతేదీ వరకు (12రోజులు) ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వీ. రామోజీరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో తీసి పెట్టుకునే పూర్తి పళ్లసెట్లు, పాక్షిక పళ్ల సెట్లకు సంబంధించిన సేవలు ఉచితంగా అందించబడతాయన్నారు. దంతాలు ఊడిపోయిన ప్రతి ఒక్కరూ ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

స్వయం ఉపాధితో ఆదాయం పొందొచ్చు

డ్వాక్రా సంఘాల సమాఖ్య అధ్యక్షుల సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతి కుటుంబంలో డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో కుటీర పరిశ్రమలను ఏర్పరచుకుని స్వయం ఉపాధితో ఆదాయం పొందవచ్చునని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. శుక్రవారం గురునానక్ కాలనీలోని తన కార్యాలయంలో జరిగిన జిల్లాలోని మండల సమాఖ్యల అధ్యక్షుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ, పంచాయతీ రాజ్ ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు హైదరాబాద్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థకు జిల్లాలోని అన్ని మండలాల సమాఖ్య అధ్యక్షులను రెండోసారి పంపిస్తున్నామన్నారు. వీరంతా అక్కడ అవగాహన పొంది తమ మండలాల్లో ఏఏ కుటీర పరిశ్రమలు అనుకూలంగా ఉందో పరిశీలించి ఆ మేరకు ప్రతి కుటుంబంలోనూ వ్యాపారవేత్తలను తయారు చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కందుల కల్పన, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్లు జీవీ నరసింహారావు, సొంగా సంజయ్‌వర్మ, తెలుగు మహిళా అధ్యక్షురాలు, కార్పొరేటర్ ఉషారాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ కేశినేని చిన్ని

క్యాలెండర్ ఆవిష్కరణ

వన్‌టౌన్: విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ శుక్రవారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఏపీ గవర్నమెంట్ ఐటీఐ ఎస్, డీఎల్‌టీసీఎస్ స్టాఫ్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ పుట్టగుంట రమేష్ బాబు మాట్లాడుతూ జిల్లాలో మరిన్ని ఐటీఐ కాలేజీలను ఏర్పాటు చేయాలని కోరారు. స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఎం.రామారావు, జాయింట్ సెక్రటరీ సతీష్, హరికృష్ణ, సిటీ ప్రెసిడెంట్ మాగంటి రమేష్ బాబు, ఎన్జీవో సెక్రటరీ నాగార్జున, కాంట్రాక్టు స్టాఫ్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌కిషోర్ బాబు, పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రి పై భక్తుల రద్దీ



వన్‌టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కనకదుర్గమ్మ దర్శనానికి శుక్రవారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. మొక్కుబడుల మేరకు అమ్మవారికి తలనీలాలు సమర్పించుకుని, కృష్ణానదిలో పవిత్ర స్నానాలు చేసి అమ్మవారి దర్శనానికి కొండపైకి చేరుకున్నారు. వివిధ ఆర్జిత సేవలు లక్ష కుంకుమార్చన, చండీహోమం, నవావరణార్చన, శాంతి కల్యాణం సేవల్లో భక్తులు పాల్గొన్నారు. అనంతరం వీరికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించారు. అమ్మవారి దర్శనం త్వరగా జరిగేందుకు ఈవో కె.రామచంద్రమోహన్ ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రెట్టింపు డబ్బులు వస్తాయంటూ టోకరా

పాయకాపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ యాప్‌లో డబ్బులు కడితే రెట్టింపు వస్తాయని నమ్మించి మోసచేసిన ఘటనపై నున్న రూరల్ పోలీసులు శుక్రవారం కేసు నమోదైంది. వాంబేకాలనీ డీ బ్లాక్‌కు చెందిన కూర్మా ప్రమోద్‌కుమార్ అతని సోదరిలకు వాంబేకాలనీలో పలువురితో పరిచయాలున్నాయి. కొంత కాలంగా లోరియల్ అనే పేరుతో నడుస్తున్న ఆన్‌లైన్ యాప్‌లో డబ్బులు కడితే రెట్టింపు వస్తాయని నమ్మబలికారు. దీంతో కాలనీలోని అనేక మంది దశల వారీగా రూ. 30 లక్షలు వరకూ చెల్లించారు. ఎంతకీ సొమ్ము తిరిగి రాకపోవడంతో మోసపోయామని గ్రహించి బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేరట్ మనదే!

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

'కేరో' అనే ఇండో-యూరోపియన్ మూల పదానికి 'కొమ్ము' ఆకారంలో ఉండేదని అర్థం. పసుపుకొమ్ము, శొంఠి కొమ్ము లాగానే 'కేరెట్ కొమ్ము' అని వాడేవారు. చాలామంది ఇది విదేశాల నుంచి మనకు దిగుమతి అయిన దుంప అని భావిస్తారు. వాస్తవానికి ఈ దుంప మన దేశంలో కొన్ని వేల ఏళ్లుగా పండుతోంది. మన ప్రాచీన ఆయుర్వేద గ్రంథాలు గుంజన దుంపలు, గాజర గడ్డలనే పేర్లతో కేరట్‌నే పేర్కొన్నాయి. 16వ శతాబ్ది నాటి భోజన కుతూహలం, 17వ శతాబ్ది నాటి హంసవింశతి గ్రంథాలలో ఈ దుంప ప్రస్తావన ఉంది.

మనకు దొరికే గాజర దుంపలు లేత కాషాయ రంగులో ఉంటాయి. ఇవి మిగిలిన రంగుల్లో కూడా మనకు లభ్యమవుతాయి. కేరట్ కాయలను మెరికార్స్ అంటారు. మానవ శరీరంలో నిర్మాణ క్రియలకు సమస్యలు ఏర్పడినప్పుడు వాటిని సరిచేసే గుణం వీటికుంది. ఇక కేరట్‌లోని బీటాకెరోటీన్ అనే పదార్థంవల్ల ఆ దుంపలకు కాషాయ వర్ణం ఏర్పడుతుంది. సాధారణంగా మొక్కల్లోని కణాలను అల్ట్రావయెలెట్ కిరణాల నుంచి ఈ బీటాకెరోటిన్ కాపాడుతూ ఉంటుంది. అందువల్లే కేరట్‌ను తింటే బీటాకెరోటిన్ శరీరానికి అందుతుంది. చర్మం నిగనిగలాడుతుంది. అంతే కాకుండా కంటి చూపు మెరుగుపరచటానికి కూడా కేరట్ ఉపకరిస్తుంది. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో బ్రిటిష్ సైనికులకు కంటి చూపు మెరుగుపరచటం కోసం కేరట్‌ను ఆహారంగా పెట్టేవారట!



కేరట్, ముల్లంగి, కీర... ఈ మూడు దుంపలను సమాన పరిణామాల్లో తీసుకొని జ్యూస్ చేసుకొని రోజూ ఉదయం తాగితే శరీరంలోని అనేక రకాల రోగాలు తగ్గుతాయి. దీనిలో కొద్దిగా పెరుగు కలిపినా మంచిదే.

'భోజన కుతూహలం' గ్రంథం ప్రకారం కేరట్ వల్ల కలిగే ప్రయోజనాలివి...

- కేరట్‌లు కఫ దోషాలను పోగొడతాయి. కడుపు ఉబ్బరాన్ని, ఆమ్లాలను తగ్గిస్తాయి.
- నులిపురుగులను అరికడతాయి. కడుపునొప్పి వంటి సమస్యలకు ఔషధంగా పని చేస్తాయి.
- శరీరంలో వేడి తగ్గుతుంది. చలవ చేస్తుంది. దప్పిక కూడా తగ్గుతుంది.
- స్త్రీలలో రక్తస్రావాన్ని అరికట్టడానికి ఇవి ఉపకరిస్తాయి
- అమీబియాసిస్ వ్యాధి ఉన్నవారికి కేరట్‌వల్ల ఎన్నో ప్రయోజనాలుంటాయి.

● గంగరాజు అరుణాదేవి

ఆవకాయ, మాగాయి, నిమ్మకాయ...
ఇలా రకరకాల నిల్వ పచ్చళ్లు తింటే ఆరోగ్య సమస్యలు వస్తాయని...
అందువల్ల ఎక్కువగా తినవద్దని... తాజా కూరగాయలతో
తయారుచేసిన పచ్చళ్లనే తినమని
డాక్టర్లు సూచిస్తూ ఉంటారు.
అలాంటి కొన్ని పచ్చళ్ల తయారీ...
మీ కోసం.



వంటిల్లు

తాజా తాజా చట్నీలు

మిక్స్‌డ్ వెజిటబుల్ చట్నీ

కావాల్సిన పదార్థాలు:

ఉల్లిపాయ ముక్కలు- పావు కప్పు, తరిగిన పచ్చిమిర్చి- రెండు చెంచాలు, తరిగిన అల్లం- అర చెంచా, వెల్లుల్లి రెబ్బలు- నాలుగు, పసుపు- అర చెంచా, టమోటా ముక్కలు- ఒక కప్పు, కేరట్- అర కప్పు, బీన్స్- పావు కప్పు, కాలీఫ్లవర్- అర కప్పు, తరిగిన కొత్తిమీర- రెండు చెంచాలు, చింతపండు రసం- రెండు చెంచాలు, పంచదార- ఒక చెంచా, ఉప్పు- తగినంత, నూనె- పావు కప్పు, ఆవాలు- ఒక చెంచా, మినపప్పు- ఒక చెంచా, జీలకర్ర- ఒక స్పూను, ఎండు మిరపకాయలు- రెండు, ఇంగువ- తగినంత

తయారీ విధానం:



- కేరట్, బీన్స్, కాలీఫ్లవర్ ముక్కలను కుక్కర్‌లో ఒక విజిల్ వచ్చే దాకా ఉడికించాలి. ఆ తర్వాత బయటకు తీసి చల్లార్చాలి.
- ఒక మూకుడులో నూనె తీసుకొని అందులో తరిగిన ఉల్లిపాయలు, అల్లం, పచ్చిమిర్చి ముక్కలు, వెల్లుల్లి రెబ్బలు వేసి దోరగా వేయించాలి. చివరగా పసుపు వేయాలి.
- ఆ మిశ్రమంలోనే టమోటాలు వేసి ఉడకనివ్వాలి. తరువాత ఉడికించిన కూర ముక్కలు వేయాలి. పంచదార కలపాలి.
- కూర ముక్కల్లోని నీళ్లు ఆవిరి అయ్యేదాకా మగ్గనివ్వాలి. ఈ మిశ్రమాన్ని కిందకు దింపి చల్లారనివ్వాలి.
- ఒక మిక్సీలో ఈ మిశ్రమాన్ని, కొత్తిమీర, చింతపండు రసం, ఉప్పు వేసి ముద్దగా చేయాలి. దీనిని ఒక గిన్నెలో పెట్టుకోవాలి.
- వేరే మూకుడులో కొద్దిగా నూనె వేసి ఆవాలు, మినపప్పు, జీలకర్ర, ఎండు మిరపకాయలు, ఇంగువ వేసి వేయించాలి. దీనిని గిన్నెలోని పచ్చడిలో కలపాలి.

జాగ్రత్తలు:

- పంచదార వేయటంవల్ల పచ్చడిలో ఉన్న ఆమ్ల లక్షణాలు తొలగిపోతాయి. తినటానికి కమ్మగా ఉంటుంది.
- ఈ పచ్చడిలో టమోటా ముక్కలు ఎక్కువ వేయకూడదు.

ముల్లంగి ఆకుల చట్నీ



కావాల్సిన పదార్థాలు:

తరిగిన కొత్తిమీర- అర కప్పు, ముల్లంగి ఆకులు- అర కప్పు, ముల్లంగి ముక్కలు- పావు కప్పు, వెల్లుల్లి రెబ్బలు- ఆరు, పచ్చిమిర్చి ముక్కలు- రెండు చెంచాలు, తరిగిన అల్లం ముక్కలు- అర చెంచా, నూనె- రెండు చెంచాలు, నిమ్మకాయ రసం- నాలుగు చెంచాలు, ఉప్పు- తగినంత

తయారీ విధానం:

- మూకుడులో నూనె వేసి కొత్తిమీర, ముల్లంగి ఆకులు, పచ్చిమిర్చి ముక్కలు, అల్లం ముక్కలు, వెల్లుల్లి రెబ్బలు వేసి దోరగా వేయించాలి.
- ఈ మిశ్రమం చల్లారిన తర్వాత మిక్సీలో వేసి ముద్దగా చేయాలి.
- ఆ మిశ్రమంలోనే ముల్లంగి ముక్కలు, ఉప్పు వేసి బాగా ముద్దగా చేయాలి. అందులో నిమ్మకాయ రసం కలపాలి.

జాగ్రత్తలు:

- కొన్నిసార్లు ముల్లంగి చేదుగా ఉంటుంది. అలాంటి ముల్లంగిని వాడకూడదు. లేత ముల్లంగి ఆకులతో మంచి రుచి వస్తుంది.
- నిమ్మ రసం కూడా తగినంత చేర్చుకోవాలి. నిమ్మ రసం ఎక్కువ అయినా రుచి బాగుండదు.

చేమ ఆకుల చట్నీ



కావాల్సిన పదార్థాలు:

సన్నగా తరిగిన చేమ ఆకులు- రెండు కప్పులు, పచ్చిమిర్చి ముక్కలు- మూడు స్పూన్లు, చింత పండు రసం- రెండు చెంచాలు, బెల్లం పొడి- రుచికి తగినంత, కొబ్బరి తురుము- నాలుగు చెంచాలు, వేయించిన నువ్వులు- రెండు చెంచాలు, నూనె- పావు కప్పు, తరిగిన కొత్తిమీర- రెండు స్పూన్లు, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం:

- ఒక మూకుడులో నూనెను వేడి చేయాలి. దీనిలో చేమ ఆకులు, పచ్చిమిర్చి ముక్కలు వేయించాలి.
- ఈ మిశ్రమంలో చింతపండు రసం, బెల్లం పొడి, కొద్దిగా నీళ్లు పోసి బాగా ఉడకబెట్టాలి. కిందకు దింపి చల్లార్చాలి.
- మరో మూకుడులో కొబ్బరి తురుము, నువ్వులు దోరగా వేయించాలి. ఇవి చల్లారిన తర్వాత మిక్సీలో వేసి పొడి చేసుకోవాలి.
- ఈ పొడిలో చేమ ఆకుల మిశ్రమం, ఉప్పు వేసి ముద్దగా చేసుకోవాలి. తరిగిన కొత్తిమీర కలపాలి.

జాగ్రత్తలు:

- లేత చేమ ఆకులు రుచిగా ఉంటాయి. అయితే ఇవి ఉడకటానికి మామూలు ఆకు కూరల కన్నా ఎక్కువ సమయం పడుతుంది.
- బెల్లం బదులు పంచదార కూడా వేసుకోవచ్చు

దుస్తులపై మరకలా... వదిలించండిలా...

ఒక్కోసారి బట్టలపై అనుకోనివిధంగా మరకలు పడుతుంటాయి. సబ్బుతో ఉతికినా, వాషింగ్ మెషిన్‌లో వేసినా అవి పోవు. కొన్ని చిట్కాలు పాటించి మొండి మరకలను సైతం సులువుగా పోగొట్టుకోవచ్చు. వాటి గురించి తెలుసుకుందాం!


- బట్టలపై సిరా మరకలు పడితే వాటి మీద కొద్దిగా శానిటైజర్ లేదా పెర్ఫ్యూమ్ చల్లి దూదితో రుద్దాలి. ఒక చెంచా బేకింగ్ సోడాని నీళ్లతో తడిపి ముద్దలా చేసి ఈ మిశ్రమంతో రుద్దినా సిరా మరకలు వెంటనే పోతాయి. మరక మీద కొద్దిగా డెటాల్ వేసి అయిదు నిమిషాలు అలాగే ఉంచాలి. తరవాత టూత్ బ్రష్‌తో రుద్దితే మరక పోతుంది.
- బట్టల మీద టీ లేదా కాఫీ ఒలికి మరకలు పడుతుంటాయి. అలాంటపుడు ఒక గిన్నెలో ఒక చెంచా నిమ్మరసం, ఒక చెంచా వైట్ వెనిగర్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంతో మరకమీద రుద్దితే ఫలితం ఉంటుంది. మరక మీద టూత్‌పేస్ట్ రాసి పది నిమిషాలు అలాగే ఉంచాలి. తరవాత వేడి నీళ్లతో కడిగి సబ్బుతో ఉతికితే మరకలు పోతాయి.
- పార్కులో కూర్చున్నపుడు లేదా తోటపనిచేసినపుడు బట్టల మీద మరకలు ఏర్పడుతుంటాయి. అర బకెట్ నీళ్లలో అయిదు చెంచాల వెనిగర్ వేసి బాగా కలపండి. ఈ నీళ్లలో బట్టలను గంటసేపు నానబెట్టి తరవాత సబ్బుతో ఉతికితే మరకలన్నీ పోతాయి. టమాటా, తుప్పు, జ్యూస్, రక్తం మరకలను కూడా ఈవిధంగానే పోగొట్టవచ్చు.
- చాక్లెట్ మరకలైనపుడు ఆ బట్టలను.... బట్టల సోడా కలిపిన నీళ్లలో అరగంటసేపు నానబెట్టి సబ్బుతో ఉతికితే చాలు.
- బట్టలను వాషింగ్ మెషిన్‌లో వేసినపుడు కొన్నిటి రంగులు మిగతా వాటికి అంటుకుంటుంటాయి. సబ్బుతో రుద్దినా ఆ మరకలు పోవు. వాటి మీద 90 శాతం ఆల్కహాల్ ఉన్న ద్రావణాన్ని చల్లి దూదితో రుద్దితే రంగుల మరకలు పోతాయి.
- రక్తం మరకలు పడినపుడు వాటి మీద హైడ్రోజన్ పెరాక్సైడ్ ద్రావణం చల్లి అరగంటసేపు ఉంచాలి. తరవాత సబ్బుతో ఉతికితే మరకలు పోతాయి.
- నూనె మరకలు పడినపుడు వాటి మీద డిష్ వాషింగ్ లిక్విడ్ లేదా బేకింగ్ సోడా చల్లి అరగంట తరవాత టూత్‌బ్రష్‌తో రుద్దితే చాలు.
- బకెట్ వేడి నీళ్లలో కొద్దిగా సర్ఫ్, కొద్దిగా బట్టల సోడా వేసి బాగా కలిపి అందులో బట్టలను నానబెట్టాలి. అరగంట తరవాత వాటిని సబ్బుతో ఉతికి ఎండలో ఆరవేస్తే తేలికపాటి మరకలన్నీ పోతాయి.



చిత్రజ్యోతి
SINCE 1965

నేడు ఎన్టీఆర్ 29వ వర్ధంతి

పురాణ పరిజ్ఞానంలోనూ అన్నగారు మిన్న!



'ధన, రుణ సమ్మిళితం శక్తి-తత్ఫలితం సృష్టి' అన్నది అనాదిగా జగమెరిగిన సత్యం! పాజిటివ్, నెగిటివ్ అన్నవి లేకుంటే పవర్ లేదన్న విషయం సైన్స్ కూడా ధ్రువీకరిస్తోంది. దీనిని అనుసరించే కళలు కాంతులీనాయని ప్రతీతి. రచనలోనూ ఈ విషయాన్నే స్మరిస్తూ ఓ కథలోని ప్రధాన పాత్రల్లోని తప్పొప్పులను విశదీకరిస్తూ సాగారు. వేదవ్యాస భగవానుడు కూడా అదే తీరున పంచమవేదం మహాభారతాన్ని రచించారు. యూదు, క్రైస్తవ, ఇస్లామ్ మతస్థులు పవిత్రంగా భావించే మోజెస్ రచనలు సైతం ఇదే పంథాను అనుసరించాయని చెప్పవచ్చు. ఇవన్నీ తెలుగు చిత్రసీమలో పౌరాణికాలతో కళాఖండాలు తెరకెక్కించిన వారికి తెలియనివి కావు. అలాగే ప్రపంచంలోనే అత్యధిక పౌరాణిక చిత్రాల్లో నటించిన విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావుకు కూడా ఆ పురాణపరిజ్ఞానం ఉందనే విషయాన్ని ఆయన తెరకెక్కించిన పురాణగాథలు చెప్పకనే చెబుతాయి.

● ఈ మధ్య ఎన్టీఆర్ పుట్టిన గడ్డపైనే నిల్చుని అనంతమైన అవివేకం ప్రదర్శిస్తూ కర్ణుని పాత్రను గొప్పగా చిత్రీకరించడం తప్పు అని ఇంకా ఏవేవో చెప్పారు. 'దానవీరశూర కర్ణ'లో కర్ణుడిని గొప్పగా చూపించడం వల్లే తరువాతి తరాల వారు కర్ణ పాత్రను ఎంతో ఉదాత్తంగా భావిస్తున్నారని వారి భావన! నిజానికి ఎన్టీఆర్ కంటే ముందు కూడా ఎంతోమంది కర్ణుని గొప్పతనం గురించి పౌరాణిక చిత్రాల్లో ప్రస్తావించినవారున్నారు. ఘోష యాత్ర సమయంలోనూ, గోగ్రహణ సమయాన కర్ణుడు పరాజితుడైన మాట వాస్తవమే! అయితే అదే కర్ణుడిపై దుర్యోధనునికి ఎందుకంత నమ్మకం అంటే అస్త్రశస్త్ర రచనలోనూ, గదాయుద్ధంలోనూ ప్రావీణ్యం ఉన్న జరాసంధుని సైతం కర్ణుడు నిలువరించి ఉంటాడు. అందువల్ల దుర్యోధనునికి కర్ణుడంటే అంతటి విశ్వాసం! ఇక తన ప్రాణరక్షితాలైన సహజ కవచకుండలాలను ఇంద్రునికి దానమిచ్చిన సమయంలోనే బలి, శిబి, దధీచి వంటి పుణ్యాత్ముల సరసన చేరాడు కర్ణుడు. ఇవన్నీ కాదు సాక్షాత్తు వేదవ్యాసుడే కర్ణుని గొప్పతనాన్ని వివరిస్తూ 'మహాతేజస్వి, అభిమానవంతుడు, ధార్మికోత్తముడు..' అంటూ (మహాభారతం-ఉద్యోగపర్వం 144-31)లో వర్ణించాడు. ఇలాంటి అంశాలన్నీ నటరత్న ఎన్టీఆర్‌కు తెలియనివి కావు. ప్రధాన పాత్రలోని మంచిచెడ్డలలో మంచినే ఎక్కువగా ప్రదర్శించాలన్న సంప్రదాయాన్ని అనుసరించారు ఎన్టీఆర్. ఆయనే కాదు తరవాత వెలసిన పురాణాల లక్ష్యం కూడా అదే! ఆ అష్టాదశ పురాణాలను సైతం 'మహాభారత' కర్త వేదవ్యాసులవారే అందించారు.

● అదే తీరున రామాయణ, భారత, భాగవతాలను అందులోని పాత్రలను ఆశ్రయించుకొని తరువాతి రోజుల్లో పలు రచనలు వచ్చాయి. ఇక తెలుగులో కవిత్రయం మూలభారతంలోని కొన్ని అంశాలను వదిలివేసిన సందర్భాలూ ఉన్నాయి. ఈ తీరున ఎవరికి వారు తమ స్వేచ్ఛాసృష్టితో ఆ పురాణ పాత్రలకు తమదైన రీతిలో హంగులు అద్దారు. అలా వెలసిన కథనే మనమంతా మహా కళా ఖండమని కీర్తిస్తున్న 'మాయాబజార్'(1957) చిత్ర రాజం!

● తొలి నుంచీ మన పురాణాల లక్ష్యం సామాన్యులలో సత్‌ప్రవర్తన కలుగజేయడమే! ఎన్టీఆర్ సైతం దానిని అనుసరించారు. తాను తొలిసారి స్వీయ దర్శకత్వంలో నటిస్తూ తెరకెక్కించిన 'సీతారామకళ్యాణం'లో రావణ పాత్రను అదే తీరున చిత్రీకరించారు. పరమశివభక్తుడైన రావణుడు స్త్రీ వ్యామోహంతో పతనమయ్యాడని చాటారు. ఎన్నో సున్నితాంశాలను సైతం నిశితంగా చాటిన ఎన్టీఆర్ పురాణ పరిజ్ఞానాన్ని శంకించడం అనంతమైన అజ్ఞానమే అవుతుంది. 'లవకుశ' చిత్రం ఘనవిజయం తరువాత ఆ సినిమా వెలుగు చూడటానికి కారకులైన సుందర్‌లాల్ నహతా ఎన్టీఆర్‌ను ఓ కోరిక కోరారు. హిందీలో తాను తీసే సినిమాలో శ్రీకృష్ణ పాత్ర ధరిస్తే కోటి రూపాయలు పారితోషికంగా సమర్పించుకుంటానని అన్నారు నహతా. అయినా ఎన్టీఆర్ తన పౌరాణిక పాత్రలు తెలుగు వారికే సొంతం కావాలని ఆశించి, నహతా ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించారు. తన తెలుగు జాతి అంటే ఎన్టీఆర్‌కు అంతటి అభిమానం! అలాగే తెలుగుదేశం పార్టీతో రాజకీయ ప్రవేశం చేసి సృష్టించిన చరిత్ర తెలిసిందే. ప్రజల మదిలో ఆయన నేటికీ కొలువై ఉండడానికి ఆయన పోషించిన పౌరాణిక పాత్రలు, వాటిలో చూపించిన వైవిధ్యం కారణమని చెప్పక తప్పదు. భారతీయులు పవిత్రంగా భావించే దేవతామూర్తుల పాత్రల్లో ఎన్టీఆర్ నటించలేదు, జీవించారు. అందువల్లే ఈ నాటికీ ప్రజల హృదయాల్లో ఎన్టీఆర్ జీవించే ఉన్నారు. అంతటి మహానటుణ్ణి, మహానాయకుణ్ణి కొందరు స్వార్థపరులు రాజకీయం కోసం వేలెత్తి చూపించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే రాజకీయ ప్రయోజనాల కోసం ఉత్తరాదిన ఓ మహా స్వాప్నికుడిని హిందువు కాదంటూ ఛిద్రం చేసే ప్రయత్నం చేస్తున్నారు. అదే తీరున ఎన్టీఆర్ పేరును కూడా తమ పాలిటిక్స్‌కు ఉపయోగించుకోవాలనుకుంటే ఇక్కడ అటువంటివారి పప్పులు ఉడకవు. ఎందుకంటే తెలుగు నేలతో మమేకమైన - తెలుగు జనతతో పెనవేసుకున్న ఎన్టీఆర్ అనుబంధం అంతటి గాఢమైనది.

- కొమ్మినేని వెంకటేశ్వర రావు

నా రికార్డ్స్ అన్నీ అన్‌స్టాపబుల్

-నందమూరి బాలకృష్ణ



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన 'డాకు మహారాజ్' చిత్రం సంక్రాంతి సందర్భంగా విడుదలై ఘన విజయం సాధించిన నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్‌లో విజయోత్సవ సభను చిత్ర బృందం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ మాట్లాడుతూ 'వరుసగా ఇది నాకు నాలుగో విజయం. నీటి సమస్య గురించి ప్రజలకు అవగాహన కలిగించిన సినిమా డాకు మహారాజ్. ఒక తెలుగు ఇంజనీర్ రాజస్థాన్ వెళ్లి, అక్కడి ప్రజల కోసం డాకుగా మారడం ఈ సినిమాలో చూశారు. ఆదరించి, అఖండమైన విజయాన్ని అందించిన తెలుగు ప్రేక్షకులందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. నన్ను ఎంతగానో ప్రేమించి, నాలో ఉన్న నట విశ్వరూపాన్ని ఆవిష్కరించేలా చేశాడు దర్శకుడు బాబీ. అలాగే మా నిర్మాత వంశీ గారు నా అభిమాని. ఈ సినిమాలో కొత్త బాలకృష్ణను ఆవిష్కరించాలని ఆయన కల కన్నారు. అన్ని క్రాఫ్ట్ మీద మంచి గ్రిప్ ఉన్న వంశీ.. నా అభిమాని కావడం నాకు చాలా గర్వంగా ఉంది. మన సినిమాలను చూసి ప్రశంసించే స్థాయికి తెలుగు చలన చిత్రసీమ ఎదిగింది. నా వరకు చూసుకుంటే, నా రికార్డ్స్ అన్నీ అన్ స్టాపబుల్, నా కలెక్షన్స్ అన్నీ అన్ స్టాపబుల్, నా అవార్డ్స్ అన్నీ అన్ స్టాపబుల్, నా రివార్డ్స్ అన్నీ అన్ స్టాపబుల్' అన్నారు. ఈ నెల 22న అనంతపురంలో విజయోత్సవ పండుగ నిర్వహిస్తామని బాలకృష్ణ చెప్పారు. దర్శకుడు బాబీ కొల్లి మాట్లాడుతూ,' బాలకృష్ణ ఫిల్మోగ్రఫీలో ఒక మాస్టర్ పీస్ సినిమా ఇవ్వడానికి కారణమైన మా టీమ్ అందరికీ థాంక్యూ సో మచ్. బాలకృష్ణ గారు కథను అర్థం చేసుకొని, దర్శకుడు ఏది అడిగితే అది చేస్తారు' అన్నారు. నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ, బాలకృష్ణ గారిని కొత్తగా చూపించాలనే ఉద్దేశంతో ఈ సినిమా చేశాము. అభిమానులు, ప్రేక్షకుల నుంచి మేము ఊహించిన దానికంటే పది రెట్లు ఎక్కువ స్పందన లభించింది. జనవరి 12న ఈ సినిమా విడుదలైతే, సంక్రాంతి పండుగ రోజుకే మా డిస్ట్రిబ్యూటర్లు సేఫ్ జోన్‌కి వెళ్లిపోయారు. అది మాకు పెద్ద సక్సెస్.' అన్నారు.



మహేశ్ ట్వీట్ చేయడం ఆనందంగా ఉంది

- వెంకటేశ్

'కష్టపడి పనిచేస్తే ఫలితం వస్తుందని నా నమ్మకం. ఆ నమ్మకాన్ని ఈ విజయం మరోసారి రుజువు చేసింది. ఇది మా విజయం కాదు, తెలుగు ప్రేక్షకులది. ఈ సినిమాను ఇంతటి సూపర్ డూపర్ హిట్ చేసిన ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెబుతున్నా' అని అన్నారు హీరో వెంకటేశ్. 'సంక్రాంతికి వస్తున్నాం' ఇటీవలె విడుదలై ప్రేక్షకాదరణతో సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ పొంగల్ బ్లాక్‌బస్టర్ జాతర సెలబ్రేషన్స్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో వెంకటేశ్ మాట్లాడుతూ 'చిత్ర పరిశ్రమలోని అనేక మంది ఫోన్ చేసి అభినందిస్తున్నారు. సినిమా చాలా నచ్చిందంటూ చిన్నోడు మహేశ్‌బాబు ట్వీట్ చేయడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు. చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'ఈ రోజు నాకు ఎనిమిది సక్సెస్‌లు అంటున్నారు. ప్రేక్షకుల సపోర్ట్ లేకుంటే నాకు ఏ విజయమూ దక్కేది కాదు. ఒక దర్శకుడిగా ప్రేక్షకులకు ఎంతగా రుణపడి ఉండాలో అర్థం కావడం లేదు' అన్నారు. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ 'ఈ సినిమా మేము ఊహించని మహా అద్భుతం. అనిల్, వెంకటేశ్ కాంబినేషన్‌లో సినిమా అంటే పాజిటివ్ వైబ్రేషన్. ఇది మాకు బ్లాక్ బస్టర్ పొంగల్. ఈ సంక్రాంతిని మర్చిపోలేం' అని అన్నారు. మరో నిర్మాత శిరీష్ మాట్లాడుతూ 'ఎన్టీఆర్ ఆర్ట్స్ హరికి కృతజ్ఞతలు చెప్పాలి. ఈ చిత్రం మా సమస్యలన్నింటినీ తీరుస్తుందని షూటింగ్‌లో చెప్పేవారు. ఆయన మాట నిజమైంది' అని అన్నారు.

పెద్దోడిని అభినందించిన చిన్నోడు

శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సెలబ్రేషన్స్‌కు మహేశ్ హాజరై సందడి చేశారు. వెంకటేశ్‌తో పాటు చిత్రబృందాన్ని అభినందించారు.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి ఖేల్‌రత్న పురస్కారాలు అందుకుంటున్న మను భాకర్, ప్రవీణ్ కుమార్, హర్మన్‌ప్రీత్ సింగ్, గుకేశ్

కనుల పండుగ.. క్రీడా అవార్డుల వేడుక

న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి): క్రీడారంగంలో విశేష ప్రతిభ కనబర్చిన ఆటగాళ్లను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఘనంగా సత్కరించారు. శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో జాతీయ క్రీడా అవార్డుల వేడుక కన్నుల పండుగగా జరిగింది. ఇందులో భాగంగా అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డును డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ షూటర్ మను భాకర్, వరల్డ్ చెస్ చాంపియన్ గుకేశ్‌లతో పాటు హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారాలింపిక్స్ విజేత ప్రవీణ్ కుమార్ అందుకున్నారు. వీరికి సర్టిఫికెట్, మెడల్‌తో పాటు తలా రూ.25 లక్షల రివార్డు దక్కుతుంది. అలాగే 32 మంది అథ్లెట్లు అర్జున అవార్డును అందుకోగా, ఐదుగురు ద్రోణాచార్య స్వీకరించారు. తెలంగాణకు చెందిన పారా అథ్లెట్ దీప్తి జివాంజితో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్ జ్యోతి యర్రాజిలకు అర్జున దక్కింది. దీప్తి అవార్డును స్వీకరించగా, జ్యోతి శిక్షణ నిమిత్తం దక్షిణాఫ్రికాలో ఉండడంతో వేడుకకు హాజరుకాలేకపోయింది. ఈ పురస్కారంతో పాటు రూ.15 లక్షల రివార్డు వీళ్లకు దక్కనుంది.

భావోద్వేగ సన్నివేశం..

అర్జున అవార్డు కోసం దశాబ్దాలుగా ఆయన పోరాటానికి ఫలితం దక్కింది. పారాలింపిక్స్‌లో దేశానికి తొలి స్వర్ణం అందించిన 80 ఏళ్ల మురళీకాంత్ పేట్కర్ చివరకు అర్జున అవార్డు (లైఫ్ టైమ్) అందుకున్నాడు. అయితే ఈ సందర్భంలో అంతటా భావోద్వేగం చోటుచేసుకుంది. 1965లో పాకిస్థాన్‌తో యుద్ధంలో పేట్కర్‌కు బుల్లెట్



గాయం తగిలి నడుం కింది భాగానికి వైకల్యం ఏర్పడింది. ఆ తర్వాత 1972 పారాలింపిక్స్ స్విమ్మింగ్‌లో అతను స్వర్ణం సాధించాడు. ఆహూతుల హర్షధ్వానాల మధ్య అతను చేతి కర్రల సహాయంతో అవార్డును స్వీకరించేందుకు రాగా, రాష్ట్రపతి ముందుకు వచ్చి పేట్కర్‌ను సత్కరించడం అందరినీ ఆకట్టుకుంది.

షూటర్ ముకేష్‌కు రజతం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): మొహాలీలో జరిగిన అఖిల భారత విశ్వవిద్యాలయాల షూటింగ్ చాంపియన్‌షిప్‌లో గుంటూరు షూటర్ ముకేష్ రజతంతో మెరిశాడు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో ముకేష్ రెండో స్థానంలో నిలిచాడు.

చెస్ పోటీలు ప్రారంభం

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురంలో జాతీయస్థాయి పాఠశాల చెస్ చాంపియన్‌షిప్ శుక్రవారం ఘనంగా మొదలైంది. టోర్నీని స్థానిక ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. ఈనెల 21 వరకు ఈ పోటీలు జరుగుతాయి.

చాంపియన్స్ ట్రోఫీకి టీమిండియా ఎంపిక నేడే

ముంబై: చాంపియన్స్ ట్రోఫీతో పాటు ఇంగ్లండ్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్ కోసం భారత జట్టును శనివారం ప్రకటించనున్నారు. 15 మందితో కూడిన ఈ ప్రాథమిక జట్టులో సెలెక్షన్ కమిటీ బుమ్రాపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. ఆసీస్‌తో చివరి టెస్టులో తను గాయపడిన విషయం తెలిసిందే. అలాగే, ఈనెల 22 నుంచి ఇంగ్లండ్‌తో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌కు కూడా జట్టును ప్రకటించనున్నారు.

స్టార్లు సాఫీగా..



సబలెంకా

- ప్రీక్వార్టర్స్‌లో జొకో, అల్కారజ్, సబలెంకా, గాఫ్
- ఏడో సీడ్ పెగులాకు షాక్
- ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్‌లో స్టార్ ఆటగాళ్లు అంచనాలను అందుకొంటూ ముందంజ వేస్తున్నారు. పురుషుల్లో..11వ టైటిల్‌పై కన్నేసిన దిగ్గజం నొవాక్ జొకోవిచ్, నాలుగు గ్రాండ్‌స్లామ్‌ల విజేత కార్లోస్ అల్కారజ్, రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వెరేవ్ ప్రీక్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టారు. మహిళల విభాగంలో డిఫెండింగ్ చాంప్ అర్యానా సబలెంకా, మూడో సీడ్ కోకో గాఫ్ నాలుగో రౌండ్‌లో ప్రవేశించారు. అయితే మెల్‌బోర్న్ పార్క్‌లో రెండు సార్లు విజేతగా నిలిచిన నవోమి ఒసాకా గాయంతో మూడో రౌండ్ నుంచి అర్ధంతరంగా వైదొలగింది. ఏడో సీడ్ జెస్సికా పెగులాకు అన్‌సీడెడ్ సెర్బియా క్రీడాకారిణి ఓల్గా డానిలోవిచ్ షాకిచ్చింది. గత ఏడాది సెమీఫైనలిస్ట్ గాఫ్ 6-4, 6-2తో 2021 యూఎస్ ఓపెన్ రన్నరప్ లెలా ఫెర్నాండెజ్‌ని చిత్తు చేసింది. టాప్ సీడ్ సబలెంకా కూడా 7-6 (5), 6-4తో క్లారా టాసన్‌పై గెలిచింది. ఇతర మూడో రౌండ్ మ్యాచ్‌లలో 11వ సీడ్ పౌలా బడోసా 6-4, 4-6, 6-3తో 17వ సీడ్ కోస్త్యుక్‌ని, 14వ సీడ్ ఆండ్రీవా 6-2, 1-6, 6-2తో 23వ సీడ్ ఫ్రెచ్‌ని, 27వ సీడ్ పల్యుచెన్కోవా 6-1, 6-2తో సీగ్మండ్‌ని ఓడించి ప్రీక్వార్టర్స్‌కు చేరారు. 23 ఏళ్ల ఓల్గా డానిలోవిచ్ 7-6 (3), 6-1తో ఏడో సీడ్, యూఎస్ ఓపెన్ రన్నరప్ పెగులాపై సంచలన విజయం సాధించింది. 12వ సీడ్ ష్నీడెర్‌కు 7-6 (4), 6-7 (7), 7-5తో 18వ సీడ్ వెకిక్ షాకిచ్చింది. మరోవైపు నవోమి ఒసాకా 6-7 (7)తో టోక్యో ఒలింపిక్స్ చాంపియన్ బెలిండా బెన్సిక్‌తో తొలి సెట్‌ను కోల్పోయిన దశలో పొత్తి కడుపు నొప్పితో మ్యాచ్ నుంచి నిష్క్రమించింది. పురుషుల మూడో రౌండ్‌లో ఏడో సీడ్ జొకోవిచ్ 6-1, 6-4, 6-4తో టోమస్ మకాక్‌పై వరుస సెట్లలో విజయం సాధించాడు. అయితే రెండో సెట్‌లో జొకో శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బందిపడ్డాడు. ఆపై చికిత్స తీసుకొని మ్యాచ్‌ను కొనసాగించాడు. రెండో సీడ్ జ్వెరేవ్ 6-3, 6-4, 6-4తో ఫెర్న్‌లీపై, మూడో సీడ్ అల్కారజ్ 6-2, 6-4, 6-7 (7), 6-2తో బోర్గెస్‌పై, 12వ సీడ్ టామీ పాల్ 7-6 (0), 6-2, 6-0తో కార్బలెస్‌పై విజయంతో నాలుగో రౌండ్‌కు చేరారు.

మిక్స్‌డ్‌లో బోపన్న జోడీ బోణీ

పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లోనే వెనుదిరిగిన భారత వెటరన్ రోహన్ బోపన్న మిక్స్‌డ్‌లో బోణీ చేశాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో బోపన్న/షుయ్ జాంగ్ (చైనా) ద్వయం 6-4, 6-4తో డోడిగ్/క్రిస్టియానాపై నెగ్గి రెండోరౌండ్ చేరింది.

అమ్మాయిలూ.. అదరగొట్టాలి

- డిఫెండింగ్ చాంపియన్‌గా భారత్
- తొలి రోజే ఆరు మ్యాచ్‌లు
- రేపు విండీస్‌తో యువ భారత్ పోరు

నేటి నుంచి అండర్-19 మహిళల టీ20 వరల్డ్‌కప్

ఉదయం 8 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో



కౌలాలంపూర్: భారత కొత్తతరం మహిళా క్రికెటర్లు అంతర్జాతీయ వేదికపై మరోసారి సత్తా నిరూపించుకోవాలనుకుంటున్నారు. శనివారం నుంచి మలేసియాలో అండర్-19 టీ20 వరల్డ్‌కప్ ఆరంభం కాబోతోంది. 2023లో దక్షిణాఫ్రికాలో జరిగిన తొలి మెగా టోర్నీలో షఫాలీ వర్మ నేతృత్వంలోని భారత జట్టు విజేతగా నిలిచింది. ఈసారి నికీ ప్రసాద్ కెప్టెన్సీలో టీమ్ చెలరేగి రెండో టీ20 వరల్డ్‌కప్‌ను సైతం ఖాతాలో వేసుకోవాలనుకుంటోంది. ఈ టోర్నీలో మొత్తం 16 జట్లు పాల్గొంటుండగా, వీటిని నాలుగు గ్రూపులుగా విభజించారు. ప్రతీ గ్రూప్ నుంచి టాప్-3 జట్లు సూపర్ సిక్స్ దశకు వెళతాయి. ఆ తర్వాత రెండు సూపర్ సిక్స్ గ్రూపుల్లో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీస్‌లో తలపడతాయి. ఫిబ్రవరి 2న ఫైనల్ జరుగుతుంది. ఇక భారత జట్టు గ్రూప్ 'ఏ'లో ఉండగా శ్రీలంక, వెస్టిండీస్, మలేసియా ఇతర జట్లు. ఆదివారం విండీస్‌తో జరిగే పోరుతో భారత్ తమ టైటిల్ వేట ఆరంభిస్తుంది. అయితే శనివారం జరిగే టోర్నీ ప్రారంభ మ్యాచ్‌ల్లో ఆసీస్-స్కాట్లాండ్, ఇంగ్లండ్-ఐర్లాండ్, సమోవా-నైజీరియా, బంగ్లాదేశ్-నేపాల్, పాకిస్థాన్-యూఎస్ఏ, న్యూజిలాండ్-దక్షిణాఫ్రికా జట్లు తలపడతాయి.

భారత్ షెడ్యూల్

జనవరి 19	వెస్టిండీస్‌తో
జనవరి 21	మలేసియాతో
జనవరి 23	శ్రీలంకతో

మ్యాచ్‌లన్నీ మధ్యాహ్నం 12 గం. నుంచి

త్రిష మరోసారి..



గత నెలలో జరిగిన అండర్-19 ఆసియాకప్‌లో హైదరాబాదీ జి.త్రిష విశేషంగా రాణించింది. దీంతో ఆమె వరుసగా రెండోసారి ఈ మెగా టోర్నీలో చోటు దక్కించుకుంది. టాపార్డర్‌లో త్రిష దూకుడు జట్టుకు ఉపయోగపడగలదు. అలాగే స్పిన్ విభాగంలో పరునిక సిసోడియా, సోనమ్ యాదవ్, ఆయుషి శుక్లా కీలకం కానున్నారు. జట్టులో మరో ఇద్దరు తెలుగమ్మాయిలు కేసరి ధ్రుతి, షబ్నమ్‌లకు కూడా చోటు దక్కడం విశేషం.

భారత మహిళల జట్టు: నికీ ప్రసాద్ (కెప్టెన్), సానికా చాల్కే, త్రిష, కమలిని, భవిక, ఈశ్వరి, మిథిల, జోషిత, సోనమ్ యాదవ్, పరునిక, కేసరి ధ్రుతి, ఆయుషి, ఆనందిత, షబ్నమ్, వైష్ణవి.

సింధుకు చుక్కెదురు

- సెమీస్‌కు సాత్విక్ జోడీ
- ఇండియా ఓపెన్



న్యూఢిల్లీ: సొంతగడ్డపై టైటిల్‌తో సత్తా చాటాలనుకున్న స్టార్ షట్లర్ పీవీ సింధుకు చుక్కెదురైంది. ఇండియా ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో క్వార్టర్‌ఫైనల్లోనే వెనుదిరిగింది. కాగా, పురుషుల డబుల్స్‌లో స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లి టోర్నీలో భారత్ ఆశలను సజీవంగా ఉంచింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ పోరులో మాజీ చాంపియన్ సింధు 9-21, 21-19, 17-21తో పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత గ్రెగోరియా మరిస్కా (ఇండోనేసియా) చేతిలో పరాజయం పాలైంది. 2017లో ఇండియా ఓపెన్ టైటిల్ నెగ్గిన సింధు.. ఆ మరుసటి ఏడాది రన్నరప్‌గా నిలిచింది. కాగా, పురుషుల సింగిల్స్ బరిలో మిగిలిన ఏకైక ఆటగాడు కిరణ్ జార్జ్ 13-21, 19-21తో చైనా షట్లర్ వెంగ్ హంగ్‌యాంగ్ చేతిలో ఓటమిపాలయ్యాడు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్/చిరాగ్ ద్వయం 21-10, 21-17తో కొరియా జోడీ కాంగ్ మిన్ హ్యూక్/హో జిన్‌ను చిత్తుచేసి సెమీస్ చేరింది. ఫైనల్ బెర్త్ కోసం మలేసియా జంట గో జె ఫె/ఇజుద్దీన్ కాన్‌తో సాత్విక్ ద్వయం తలపడనుంది.



సీఎం చంద్రబాబును కలిసిన హంపి

అమరావతి (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రపంచ ర్యాపిడ్ చెస్ టైటిల్ సాధించిన తెలుగు గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకుంది. ఈ సందర్భంగా హంపిని చంద్రబాబు అభినందించారు. తెలుగు రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన హంపి.. భవిష్యత్‌లో మరిన్ని టైటిళ్లు గెలవాలని సీఎం ఆకాంక్షించారు. హంపి వెంట ఆమె కుటుంబసభ్యులు కూడా ఉన్నారు.

విజయ్ హజారే టోర్నీ ఫైనల్ నేడు | కర్ణాటక X విదర్భ | మ. 1.30 నుంచి

'ఆటో' పెట్టుబడుల కేంద్రంగా భారత్

నాలుగేళ్లలో వాహన రంగంలోకి రూ.3.09 లక్షల కోట్ల ఎఫ్‌డీఐ

ఏడాదిలో 2.5 కోట్ల వాహనాల విక్రయం.. భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో ప్రధాని



న్యూఢిల్లీ: మొబిలిటీ రంగం భవిష్యత్తు భారత్‌దేనని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దేశంలో గత ఏడాది రికార్డు స్థాయిలో రెండున్నర కోట్ల వాహనాలు అమ్ముడుపోయాయని, అనేక దేశాల జనాభా కన్నా మన దేశంలో కార్ల అమ్మకాలు అధికమని చెప్పారు. కేవలం నాలుగేళ్ల కాలంలో మొబిలిటీ రంగంలోకి 3,600 కోట్ల డాలర్ల (రూ.3.09 లక్షల కోట్లు) విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) వచ్చాయని చెప్పారు. ఐదు రోజుల పాటు జరిగే భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025 ప్రదర్శనను ఢిల్లీలోని భారత మండపంలో శుక్రవారం ప్రారంభించిన సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. మొబిలిటీ (ఆటోమొబైల్) రంగంలో తన భవిష్యత్తును తీర్చి దిద్దుకోవాలనుకునే ప్రతి ఇన్వెస్టర్‌కు భారత్ అద్భుతమైన గమ్యమన్నారు. ఆటోమోటివ్ పరిశ్రమకు ఇన్నోవేషన్, టెక్నాలజీలే చోదకమని పేర్కొంటూ "ప్రపంచం కోసం దేశంలో తయారుచేయండి" అనే మంత్రంతో ముందడుగేసే ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పూర్తి మద్దతు, ప్రోత్సాహం అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. "మేక్ ఇన్ ఇండియా" మంత్రం ఆటోమొబైల్ రంగం వృద్ధికి ఎంతో దోహదపడిందని చెప్పారు. పీఎల్ఐ పథకాలు ఈ ప్రచారానికి కొత్త ఉత్తేజం కల్పించడంతో పాటు రూ.2.25 లక్షల కోట్ల విక్రయాలు, 1.5 లక్షల ప్రత్యక్ష ఉపాధి అవకాశాలకు బాట వేశాయని తెలిపారు. భారత్ ప్రస్తుతం ప్రపంచంలో ఐదో పెద్ద ఆర్థిక వ్యవస్థ, మూడో పెద్ద ప్రయాణికుల వాహన మార్కెట్‌గా ఉందన్నారు. అధిక సంఖ్యలో ఉన్న యువ జనాభా, పెరుగుతున్న మధ్యతరగతి జీవులు, వేగవంతమైన నగరీకరణ, ఆధునిక మౌలిక వసతుల అభివృద్ధి, అందుబాటులోకి వస్తున్న అఫర్డబుల్ వాహనాలు మొబిలిటీ మార్కెట్‌కు బలమని ఆయన అన్నారు.

వేగంగా విస్తరిస్తున్న ఈవీ మార్కెట్

దేశంలో విద్యుత్ వాహనాల (ఈవీ) మార్కెట్ వేగవంతమైన వృద్ధిని నమోదు చేస్తోందని ప్రధాని చెప్పారు. గత దశాబ్ది కాలంలో ఈవీ విక్రయాలు 640 రెట్లు పెరిగాయన్నారు. 10ఏళ్ల క్రితం ఏడాదికి 2,600 ఈవీలు అమ్ముడుపోగా గత ఏడాది ఆ సంఖ్య 16.8 లక్షలకు చేరిందన్నారు. ఈ దశాబ్ది చివరి నాటికి ఈ సంఖ్య 8 రెట్లు పెరగవచ్చని అంచనా వేశారు.

రతన్ టాటా, ఒసాము సుజుకీలకు నివాళి

ఆటోమొబైల్ దిగ్గజాలైన రతన్ టాటా, ఒసాము సుజుకీలను ప్రధాని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. భారత ఆటోమొబైల్ వృద్ధికి, మధ్య తరగతి ప్రజల కలల సాకారానికి వారిద్దరి సేవలు చిరస్మరణీయమన్నారు. మొత్తం భారత మొబిలిటీ రంగానికి వారిద్దరి వారసత్వం ఎల్లప్పుడూ స్ఫూర్తిని అందిస్తుందని నివాళి ఘటించారు.

మెర్సిడెస్ బెంజ్ రెండు కొత్త కార్లు



మెర్సిడెస్ బెంజ్ సరికొత్త బ్యాటరీ విద్యుత్ కారు (బీఈవీ) ఈక్యూఎస్ మేబాక్ ఎస్‌యూవీ 680 "నైట్ సిరీస్"ను విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూమ్ ధర రూ.2.63 కోట్లు. దీనితో పాటు మెర్సిడెస్ మేబాక్ జీఎల్ఎస్ 600 నైట్ సిరీస్ కారు కూడా విడుదల చేసింది. ఈ కారు ఎక్స్‌షోరూమ్ ధర రూ.3.71 కోట్లు. ఇవి కాకుండా కొత్తగా డెవలప్ చేసిన కాన్సెప్ట్ సీఎల్ఏ కారును ఆవిష్కరించింది.



జేఎస్‌డబ్ల్యూ ఎంజీ సైబర్‌స్టర్

జేఎస్‌డబ్ల్యూ ఎంజీ రెండు కొత్త ఈవీ మోడళ్లను ఆవిష్కరించింది. ఇందులో ఎంజీ సైబర్‌స్టర్ కారు దేశంలోని తొలి ఆల్ ఎలక్ట్రిక్ రోడ్‌స్టర్ కారు. రెండోది ఎంజీ ఎం9. ఇది మూడు వరుసలున్న తొలి విద్యుత్ లిమోసిన్ కారు. ఈ రెండు కార్లను ఈ ఏడాదే మార్కెట్లో విడుదల చేస్తారు. ఈ కార్లతో తాము యాక్సెసిబుల్ లగ్జరీ విభాగంలోకి ప్రవేశించినట్టు కంపెనీ ప్రకటించింది.

బీఎండబ్ల్యూ ఇండియా ఈవీ



జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల దిగ్గజం బీఎండబ్ల్యూ పూర్తిగా స్థానికంగా తయారు చేసిన బీఎండబ్ల్యూ ఎక్స్ 1 లాంగ్ వీల్ బేస్ ఈవీని విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూమ్ ధర రూ.49 లక్షలు. దీన్ని చెన్నై ప్లాంట్‌లో ఉత్పత్తి చేశారు. బీఎండబ్ల్యూ నుంచి పూర్తిగా దేశీయంగా తయారైన తొలి ఈవీ ఇది.



పోర్షే కొత్త విద్యుత్ ఎస్‌యూవీ

జర్మనీకి చెందిన లగ్జరీ స్పోర్ట్స్ కార్ల కంపెనీ పోర్షే సరికొత్త విద్యుత్ ఎస్‌యూవీ మకాన్, సరికొత్త హంగులతో తీర్చిదిద్దిన స్పోర్ట్ సెలూన్ టైకాన్‌ను భారత మార్కెట్లో విడుదల చేసింది. మకాన్ బీఈవీ మూడు మోడళ్లలో అందుబాటులో ఉంటుంది. ధర రూ.1.22 కోట్ల నుంచి రూ.1.69 కోట్ల మధ్యన ఉంటుంది. కొత్త హంగులతో విడుదల చేసిన టైకాన్ ధర రూ.1.89 కోట్ల నుంచి రూ.2.53 కోట్ల మధ్యన ఉంటుంది.

సుజుకీ తొలి విద్యుత్ స్కూటర్



సుజుకీ మోటార్ సైకిల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తొలి విద్యుత్ స్కూటర్ ఈ-యాక్సెస్‌ను, మరో రెండు కొత్త మోడళ్లను విడుదల చేసింది. ఈ యాక్సెస్ 3.07 కిలోవాట్ల లిథియం ఐరన్ ఫాస్ఫేట్ బ్యాటరీతో వస్తుంది. ఒకసారి చార్జింగ్ చేస్తే 95 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. ఇతర మోడళ్లలో జిక్సర్ ఎస్ఎఫ్ ఫ్లెక్స్ ఫ్యుయెల్ బైక్, పూర్తిగా కొత్తగా తయారుచేసిన యాక్సెస్ 125 సీసీ స్కూటర్ ఉన్నాయి.



హీరో మోటోకార్ప్

టూవీలర్ దిగ్గజం హీరో మోటోకార్ప్ నాలుగు కొత్త వాహనాలను ప్రదర్శించింది. ఎక్స్‌ట్రీమ్ 250 ఆర్ ద్వారా 250 సీసీ వాహనాల విభాగంలోకి తొలిసారిగా ప్రవేశించింది. అలాగే ఎక్స్‌పల్స్ 210 బైక్, జూమ్ 125, జూమ్ 160 స్కూటర్లు కూడా ప్రదర్శించిన వాహనాల్లో ఉన్నాయి. ఈ వాహనాలన్నింటి బుకింగ్స్ ఫిబ్రవరిలో ప్రారంభమవుతాయి. మార్చి నుంచి వాహనాల డెలివరీ ప్రారంభిస్తారు.

బిజినెస్

విప్రో లాభంలో 24 శాతం వృద్ధి

క్యూ3లో రూ.3,354 కోట్లుగా నమోదు

ఒక్కో షేరుకు రూ.6 మధ్యంతర డివిడెండ్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి (క్యూ3) విప్రో ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 24.4 శాతం వృద్ధితో రూ.3,354 కోట్లకు చేరుకుంది. సమీక్షా కాలానికి కంపెనీ ఆదాయం కేవలం 0.5 శాతం పెరిగి రూ.22,319 కోట్లుగా నమోదైంది. ఈ మార్చితో ముగియనున్న నాలుగో త్రైమాసికం(క్యూ4)లో ఐటీ సేవల ద్వారా సమకూరే ఆదాయం 260.2-265.5 కోట్ల డాలర్ల స్థాయిలో ఉండవచ్చని విప్రో అంచనా వేసింది. క్యూ3తో పోలిస్తే క్యూ4లో ఐటీ సేవల ఆదాయ వృద్ధి మైనస్ 1 శాతం నుంచి ఒక శాతం శ్రేణిలో ఉండవచ్చని అంచనా. కాగా, ఈ ఆర్థిక సంవత్సరానికి గాను వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.6 మధ్యంతర డివిడెండ్ చెల్లించనుంది.

12,000 నియామకాలు

వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో ప్రాంగణ నియామకాల (క్యాంపస్ హైరింగ్) ద్వారా 10,000-12,000 మంది ఫ్రెషర్లను ఉద్యోగంలో చేర్చుకోనున్నట్లు విప్రో వెల్లడించింది. కాగా డిసెంబరు త్రైమాసికంలో ఉద్యోగుల సంఖ్య 1,157 తగ్గి 2,32,732కు పరిమితమైంది.

కస్టమర్లకు కాల్ చేసేందుకు '1600XX' సిరీస్‌నే ఉపయోగించండి

బ్యాంకులను కోరిన ఆర్‌బీఐ

ముంబై: బ్యాంకింగ్ రంగంలో పెరుగుతున్న ఆర్థిక మోసాలను నిరోధించేందుకు ఆర్‌బీఐ మరో నిర్ణయం తీసుకుంది. వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్‌ల ద్వారా జరుగుతున్న ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు లావాదేవీల విషయమై ఖాతాదారులకు కాల్ చేసేందుకు '1600XX' సిరీస్ నంబర్లను మాత్రమే ఉపయోగించాలని బ్యాంకులను ఆర్‌బీఐ కోరింది. అలాగే, ప్రచార అవసరాల కోసం '140XX' సిరీస్ నంబర్లను మాత్రమే వినియోగించాలని నిర్దేశించింది. అంతేకాదు, బ్యాంకులు, ఇతర నియంత్రిత సంస్థలు తమ కస్టమర్ల డేటాబేస్‌ను పర్యవేక్షించడంతో పాటు ఎప్పటికప్పుడు ప్రక్షాళన చేస్తుండాలని సూచించింది. మార్చి31 నాటికి ఈ ఆదేశాలను అమలు చేయాలని స్పష్టం చేసింది.

అకౌంట్లు, లాకర్లకు నామినీలుండాల్సిందే: మరణించిన ఖాతాదారు కుటుంబ సభ్యులు లేదా సంబంధీకులకు క్లెయిమ్ సెటిల్‌మెంట్‌ను వేగవంతం చేసేందుకు అన్ని ఖాతాలు, లాకర్లకు నామినీ వివరాలు అందుబాటులో ఉండేలా జాగ్రత్త పడాలని బ్యాంకులకు ఆర్‌బీఐ సూచించింది. ప్రస్తుత, కొత్త డిపాజిట్ అకౌంట్లు, సేఫ్టీ లాకర్లకు నామినీలను నిర్ధారించాలని కోరింది.

మూడు రోజుల ర్యాలీకి బ్రేక్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో మూడు రోజుల వరుస ర్యాలీకి తెరపడింది. ఐటీ, బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగ షేర్లలో అమ్మకాల కారణంగా ప్రామాణిక సూచీలు శుక్రవారం నష్టాల్లో ముగిశాయి. విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, గరిష్ఠ స్థాయి ముడిచమురు ధరలు సైతం ట్రేడింగ్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేశాయి. సెన్సెక్స్ ఒక దశలో 780 పాయింట్ల మేర పతనమైనప్పటికీ, మళ్లీ కాస్త కోలుకుంది. చివరికి సూచీ 423.49 పాయింట్ల నష్టంతో 76,619.33 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 108.60 పాయింట్లు కోల్పోయి 23,203.20 వద్ద క్లోజైంది.

మారుతి ఈ-విటారా




దేశీయ కార్ల దిగ్గజం మారుతి సుజుకీ తొలి బ్యాటరీ విద్యుత్ కారు ఈ-విటారాను ఆవిష్కరించింది. ఈ కారు 49 కిలోవాట్లు, 61 కిలోవాట్ల బ్యాటరీ ఆప్షన్లలో అందుబాటులో ఉంటుంది. ఒకసారి చార్జింగ్ చేస్తే 500 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. దీన్ని భారత్‌లోనే ఉత్పత్తి చేసి 100 దేశాలకు ఎగుమతి చేయనున్నట్టు ప్రకటించింది. ఈ మోడల్‌కు భారత్‌ను ప్రపంచ ఉత్పత్తి కేంద్రంగా చేయాలనుకుంటున్నట్టు కంపెనీ డైరెక్టర్, ప్రెసిడెంట్ తొషిహిరో సుజుకీ తెలిపారు.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	112	విజయవాడ	131
వరంగల్	112	గుంటూరు	130
కరీంనగర్	112	ఒంగోలు	130
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	104
కర్నూలు	112	నెల్లూరు	109
విశాఖపట్నం	127	అనంతపురం	109
గోదావరి	131		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



18వ తేదీ			
హైదరాబాద్	475	విజయవాడ	500
వరంగల్	477	గోదావరి	495
చిత్తూరు	503	విశాఖపట్నం	500
		డజను గుడ్లు రూ. 72	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	81,270 ▲	74,500 ▲	1,04,000 ▲
విజయవాడ	81,820 ▲	77,000 ▲	93,500 ▲
విశాఖపట్నం	79,290 ▲	72,680 ▲	91,760 ▼
రాజమండ్రి	84,270 ▲	74,500 ▲	91,700 ▲
ప్రొద్దుటూరు	80,350 ▲	74,400 ▲	93,500 ▼
ముంబై	79,239 ▲	72,583 ▲	90,820 ▼

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.